


ESTD: 1999

www.voodayam.com

# వుదయం




కరీంనగర్ | 29-07-2026 బుధవారం | సంపుటి : 14 | సంచిక :223 | SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 4.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily

Simultaneously Published from Karimnagar, Hyderabad, Adilabad, Khammam, Guntur & Warangal | Follow us on



- ఇకపై ఏటా ఫీజు రీయింబర్స్‌మెంట్
- భవిష్యత్తులో బకాయిల సమస్యే ఉండదు
- విద్యాశాఖలో ప్రక్షాళనకు కొత్త చట్టాలు
- రాష్ట్రానికి 11.56 లక్షల ఇళ్లు కేటాయించండి
- గ్లోబరీనా తరహా సంస్థలపై కఠిన చర్యలు

తెలంగాణకు 11.56 లక్షలు

# విద్యావ్యవస్థపై కేంద్ర పెత్తనం సరికాదు

**హైదరాబాద్, జూలై 28 (వుదయం) :** విద్యా రంగానికి సంబంధించి నిధుల కేటాయింపు, పరీక్షల నిర్వహణలో పారదర్శకతపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటోందని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ, ఇకపై ప్రతి ఏటా ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను క్రమం తప్పకుండా చెల్లిస్తామని, భవిష్యత్తులో బకాయిల సమస్యే లేకుండా స్పష్టమైన ప్రణాళికలు రూపొందించామని స్పష్టం చేశారు.

**ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై స్పష్టత**

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పేరుకుపోయిన రూ.8వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ప్రస్తుత ప్రభుత్వానికి పెద్ద భారంగా మారాయని సీఎం పేర్కొన్నారు. రీయింబర్స్‌మెంట్ చెల్లింపుల విషయంలో అక్రమాలకు పాల్పడిన సంస్థలపై విచారణ జరుగుతోందని చెప్పారు. ఈ విషయంలో ప్రతిపక్షాలు కావాలనే భ్రమలు కల్పిస్తున్నాయని మండిపడ్డారు. భాజపా నేతలు కృష్ణయ్య, రామచందర్‌రావు తెలంగాణ ప్రభుత్వంపై విమర్శలు చేసే ముందు, ఎన్డీయే అధికారంలో ఉన్న ఆంధ్రాలోని బకాయిలపై కూడా మాట్లాడితే బాగుంటుందని వ్యాఖ్యానించారు.

**విద్యావ్యవస్థలో ప్రక్షాళన – అక్రమార్కులపై వేటు**

ఆఫ్‌లైన్ పరీక్షల నిర్వహణతో కొన్ని రకాల సాంకేతిక, పరిపాలనాపరమైన సమస్యలు వస్తున్నాయని, బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని రేవంత్ హెచ్చరించారు.

కేంద్ర పెత్తనం సరికాదు: యూనివర్సిటీలపై ఆధిపత్యం చెలాయించేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందని, విద్య అనేది వీలైనంత వరకు రాష్ట్ర పరిధిలోనే ఉంటేనే తప్పులు జరగకుండా ఉంటాయని అభిప్రాయపడ్డారు.

**గ్లోబరీనా తరహా ఏజెన్సీలపై నిఘా:**

గతంలో రాష్ట్రంలో అక్రమాలకు పాల్పడిన 'గ్లోబరీనా' వంటి సంస్థలపై అప్పటి ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం వల్లే అవి సీబీఎస్ఈకి విస్తరించాయని ఆరోపించారు. ఇటువంటి ఏజెన్సీలపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకునేలా రాష్ట్రంలోనూ కొత్త చట్టాలు తెస్తామన్నారు.

టిఎస్‌పిఎస్సి ప్రక్షాళన: పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ప్రక్షాళన చేసి పారదర్శకంగా పరీక్షలు నిర్వహించామని, నిరుద్యోగ అభ్యర్థుల్లో నమ్మకం పునరుద్ధరించామని తెలిపారు.

**కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌తో సీఎం భేటీ**

అంతకుముందు, సీఎం రేవంత్‌రెడ్డి కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌తో సమావేశమయ్యారు. రాష్ట్ర అభివృద్ధికి సంబంధించి పలు కీలక విజ్ఞప్తులు చేశారు:

పీఎంఏవై 2.0 కింద ఇళ్లు: ప్రధాన్ మంత్రి ఆవాస్ యోజన (PMAY 2.0) కింద తెలంగాణకు 11.56 లక్షల ఇళ్లను కేటాయించాలని కోరారు.

ఉపాధి హామీ అనుసంధానం: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ఉపాధి హామీ పథకం జాబితాలో చేర్చి, లబ్ధిదారులకు 90 రోజుల పని కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

రైతుల సంక్షేమం: ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో కూరగాయల పందిళ్లు, పశుగ్రాస ప్లాట్లు, మల్బరీ తోటలు, పట్టుపురుగుల పెంపకం షెడ్ల నిర్మాణంతో సహా 10 కొత్త పనులను పథకంలో చేర్చి రైతులకు ఉపాధి పెంచాలని కోరారు. ఈ భేటీలో తెలంగాణకు చెందిన పలువురు ఎంపీలు సీఎం వెంట ఉన్నారు.

## పేపర్ లీకేజీలకు పాల్పడితే

# రూ.10 కోట్ల జరిమానా, 10 ఏళ్ల జైలు



**న్యూఢిల్లీ, జూలై 28 (ఎఎంస్) :** దేశంలో యువత, విద్యార్థుల భవిష్యత్తును కాపాడటమే లక్ష్యంగా ప్రభుత్వం తీసుకువచ్చిన 'పేపర్ లీక్ నిరోధక బిల్లు (యాంటీపేపర్ లీక్ అమెండ్‌మెంట్ బిల్లు)' ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ స్పష్టం చేశారు. పార్లమెంట్‌లో ఈ బిల్లుపై జరిగిన చర్చను ప్రారంభించి ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా పరీక్షల పేపర్ లీకేజీలు వ్యవస్థాగత నేరాలుగా మారుతున్నాయని, వీటిని సమూలంగా అణచివేయడానికే చట్టంలో కఠినమైన సవరణలు తెస్తున్నట్లు సభకు వివరించారు.

**కాంగ్రెస్ హయాంలోనూ లీకేజీలే..**

గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనూ అనేక పరీక్షల పేపర్లు లీకయ్యాయని జితేంద్ర సింగ్ గుర్తుచేశారు. "2009, 2011 సంవత్సరాల్లో ఎన్నో పరీక్షల పేపర్లు లీకయ్యాయి. 2012లో ఏఐఎంఎస్ (AIIMS) ప్రవేశ పరీక్ష పేపర్ కూడా లీకైంది. యూపీ, తమిళనాడు సహా దేశంలోని పలు ప్రాంతాల్లో ఉద్యోగ నియామక, ప్రవేశ పరీక్షల పత్రాలు బయటికి వచ్చాయి. వీటిని నిరోధించేందుకు 1992, 2010 సంవత్సరాలలోనూ నాటి ప్రభుత్వాలు ప్రయత్నించినప్పటికీ అవి ఎందుకు కొలిక్కి రాలేదో నాటి పాలకులే సమాధానం చెప్పాలి" అని ఆయన ప్రశ్నించారు. ఈ నేరాలు క్రమంగా వ్యవస్థీకృత మాఫియాగా రూపాంతరం చెందాయని ఆందోళన వ్యక్తం చేశారు.

దోషులకు కఠిన శిక్షలు - భారీ జరిమానాలు సంచలనం సృష్టించిన నీట్ (NEET) పేపర్ లీక్ ఉదంతం వెలుగులోకి వచ్చిన వెంటనే ప్రభుత్వం అప్రమత్తమై వేగంగా చర్యలు ప్రారంభించిందని కేంద్ర మంత్రి తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలకు ఎవరూ సాహసించకుండా చట్టాన్ని కఠినతరం చేసినట్లు పేర్కొన్నారు.

జైలు శిక్ష పెంపు: పేపర్ లీకేజీలకు పాల్పడే దోషులకు పదేళ్ల వరకు కఠిన కారాగార శిక్ష విధించేలా నిబంధనలు రూపొందించారు.

**భారీ జరిమానాలు:** లీకేజీ రాకెట్లు, గ్యాంగ్‌లకు విధించే జరిమానాను రూ.1 కోటి నుంచి ఏకంగా రూ.10 కోట్లకు పెంచారు.


ఫాస్ట్ ట్రాక్ కోర్టులు: ఇలాంటి కేసుల విచారణను వేగవంతం చేసి నిందితులకు త్వరగా శిక్షలు ఖరారు చేసేందుకు ప్రత్యేకంగా ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేస్తున్నట్లు జితేంద్ర సింగ్ వెల్లడించారు.

## విద్యార్థులపై దౌర్జన్యానికి

# మోదీ, అమిత్‌షా సమాధానం చెప్పాలి



**న్యూఢిల్లీ, జూలై 28 (ఎఎంస్) :** లోక్‌సభలో యాంటీపేపర్ లీక్ బిల్లుపై జరుగుతున్న చర్చ సందర్భంగా కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులు, యువతపై పోలీసులు లాఠీఛార్జి చేయడం, పెల్లెట్ గన్స్ ఉపయోగించడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరసన తెలుపుతున్న విద్యార్థులపై ఆయుధాలు ప్రయోగించడానికి వారేమైనా ఉగ్రవాదులా అని ప్రభుత్వాన్ని సూటిగా నిలదీశారు. ప్రధాని, హోంమంత్రి సమాధానం చెప్పాలి దేశ యువత తమ ప్రజాస్వామ్య హక్కులను శాంతియుతంగా వినియోగించుకుంటుంటే, వారిపై ఈవిధంగా దౌర్జన్యానికి పాల్పడటం సరైన పద్ధతి కాదని ప్రియాంకా గాంధీ హితవు పలికారు. విద్యార్థుల నిరసనలను ఆయుధాలతో అణచివేయాలని పోలీసులకు ఎవరు ఆదేశాలు ఇచ్చారంటూ ప్రశ్నించారు. ఈ ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా తక్షణమే స్పందించి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బాధితుల కుటుంబాలకు న్యాయం చేయాలి పేపర్ లీక్‌ల పుణ్యమా అని తీవ్ర మనోవేదనకు గురై బలవన్మరణానికి పాల్పడిన ఎంతోమంది అభాగ్యులైన విద్యార్థుల కుటుంబాలకు తగిన న్యాయం చేయాలని ఆమె కోరారు. కంటికి రెప్పలా పెంచుకున్న పిల్లలను కోల్పోయిన తల్లిదండ్రుల గుండెకోతను ఎవరు తీర్చగలరని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైఫల్యాల వల్ల ప్రాణాలు కోల్పోతున్న యువత ఆక్రందనలను పాలకులు వినాలని ప్రియాంకా గాంధీ సభలో హితవు పలికారు.





# 7ఏళ్లు నివసిస్తే గ్రీన్‌కార్డ్

**అమెరికా:** హెచ్ 1బీ వీసా, గ్రీన్‌కార్డ్ విషయంలో రిపబ్లికన్, డెమోక్రటిక్ సభ్యులు అమెరికా కాంగ్రెస్ (పార్లమెంట్) భిన్నమైన ప్రతిపాదనలు చేస్తున్నారు. హెచ్ 1బీ వీసాల జారీని మూడు సంవత్సరాల పాటు నిలిపివేయాలని ఇటీవల రిపబ్లికన్ పార్టీ సభ్యుడు టిమ్ షీహీ సెనెట్‌లో బిల్లు ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. తాజాగా డెమోక్రటిక్ సెనెటర్ అలెక్స్ పాడిల్లా భిన్నమైన ప్రతిపాదనలు చేశారు. హెచ్ 1బీ వీసాదారులు సహా అమెరికాలో 7 ఏళ్లుగా నివాసం ఉంటున్నవారు అక్కడ గ్రీన్‌కార్డుకు దరఖాస్తు చేసుకొనేలా వీలు కల్పించాలని ఆయన సూచిస్తున్నారు. పాడిల్లా గత సంవత్సరం 'ఇమిగ్రేషన్ యాక్ట్ ఆఫ్ 1929లో వలస నిబంధనల పునరుద్ధరణ' బిల్లును తీసుకువచ్చారు. వలసదారులే లక్ష్యంగా తీసుకువస్తోన్న కఠిన నిబంధనలకు కౌంటర్‌గా ఈ బిల్లులో పలు ప్రతిపాదనలు చేశారు. అమెరికాలో ఏడు సంవత్సరాల పాటు నివసించినవారు శాశ్వత నివాసం కోసం దరఖాస్తు చేసుకోవడానికి ఈ బిల్లు వీలుకల్పిస్తుంది. అయితే వారిపై ఎలాంటి క్రిమినల్ కేసులు ఉండకూడదు. "కష్టపడి పనిచేసే వలసదారుల పట్ల ట్రంప్ ప్రభుత్వం చూపుతోన్న కఠినవైఖరికి వ్యతిరేకంగా గతంలో ఈ బిల్లు ప్రవేశపెట్టాను. వారే లక్ష్యంగా అధ్యక్షుడు చేస్తోన్న వ్యాఖ్యలు ఇక్కడే తమ జీవితాన్ని నిర్మించుకున్న కుటుంబాలను అనిశ్చితిలోకి నెట్టేస్తున్నాయి.

# 1,25,000 ఎకరాలు అటవీ ప్రాంతం అగ్నికి ఆహుతైంది

**ఫ్రాన్స్ :** ఫ్రాన్స్, స్పెయిన్ సరిహద్దుల్లోని అటవీ ప్రాంతంలో కార్చిచ్చు విధ్వంసం సృష్టిస్తోంది. ఇప్పటి వరకు ఫ్రాన్స్‌లో 420 చదరపు కిలోమీటర్లకు పైగా .. స్పెయిన్‌లో 1,25,000 ఎకరాలకు పైగా అటవీ ప్రాంతం అగ్నికి ఆహుతైంది. గిరాండ్ ప్రాంతంలో కోట్ల విలువ చేసే 240కి పైగా విలాసవంతమైన ఇళ్లు కాలి బూడిదయ్యాయి. ఫ్రాన్స్‌లో ఈ భారీ కార్చిచ్చు నవంబర్ మొదటి వారం వరకూ కొనసాగవచ్చని యూరోపియన్ యూనియన్ అధికారులు హెచ్చరించారు. ఐరోపాలో అగ్నికీలల వల్ల ఈ ఏడాది అత్యంత ఘోరమైన సంవత్సరాలలో ఒకటిగా నిలిచిపోతుందన్నారు. ఈ వారం ఉష్ణోగ్రతలు మళ్లీ పెరుగుతుండడంతో ఫ్రాన్స్, స్పెయిన్, గ్రీస్‌లలో కార్చిచ్చుల ప్రమాదం మరింత పెరిగే అవకాశం ఉందన్నారు.



# ఎస్ఐఆర్‌పై బీజేపీ ప్రవాస్ అభియాన్ కార్యక్రమం

*** ఓటరు జాబితా సవరణపై కార్యకర్తలకు దిశానిర్దేశం**

**దౌల్తాబాద్, జూలై 29 (వుదయం):**



సమగ్ర ఓటరు నమూనా ప్రక్రియ (ఎస్ఐఆర్)లో భాగంగా దుబ్బాక నియోజకవర్గం దౌల్తాబాద్ మండల కేంద్రంలో బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ప్రవాస్ అభియాన్" కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు కిష్టమ్మ సుభాష్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ప్రతి కార్యకర్త చురుగ్గా పాల్గొని అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా కృషి చేయాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పించి, ఓటరు వివరాల పరిశీలనలో సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ మెంబర్ సర్ గారి భూపాల్ రెడ్డి, మాజీ సర్పంచ్ రామస్వామి గౌడ్, మండల ఉపాధ్యక్షులు బోట్క లక్ష్మణ్, మాజీ మండల అధ్యక్షులు పోతురాజు కిషన్, జిల్లా ఓబీసీ కార్యదర్శి పులిగారి స్వామి గౌడ్, మండల పట్టణ అధ్యక్షులు ఆది మహేష్, మాజీ సర్పంచ్ కొత్త సురేందర్ రెడ్డి, దేవుడి నరసింహారెడ్డి, బీఎల్ఏ2 శ్రీకాంత్, శక్తి కేంద్రాల ఇన్‌చార్జులు బోరింగ్ శ్రీను, స్వామినాథ్, శ్రీశైలం, చిక్కుడు స్వామి, భాను తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బొందలపల్లి గ్రామ ప్రభుత్వ పాఠశాలను రక్షించాలి

**అడిషనల్ కలెక్టర్ చెన్నయ్యకు సిపిఎం వినతి పత్రం**

**నాగర్‌కర్నూల్, జూలై 28 (వుదయం ప్రతినిధి) :**

నాగర్ కర్నూల్ మండలం బొందలపల్లి గ్రామంలో 35 సంవత్సరాల క్రితం నిర్మించిన ప్రభుత్వ పాఠశాలను కాపాడాలని కోరుతూ భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు (సిపిఎం) ఆధ్వర్యంలో నాగర్ కర్నూల్ జిల్లా అడిషనల్ కలెక్టర్ చెన్నయ్య గారికి మంగళవారం వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పొదిల రామయ్య మాట్లాడుతూ... బొందలపల్లి గ్రామంలో 35 సంవత్సరాల క్రితం పాఠశాల నిర్మాణం జరిగిందని తెలిపారు. ఈ పాఠశాలలో గ్రామానికి చెందిన ఎస్సి, బిసి తరగతులకు చెందిన అనేకమంది పేద విద్యార్థులు చదువుకుంటున్నారని చెప్పారు.పేద విద్యార్థుల భవిష్యత్తు కోసం అప్పటి సర్పంచ్ అయిన కే సుధాకర్ రెడ్డి గారు పాఠశాలకు దానపూర్వకంగా తన భూమిని ఇవ్వడం జరిగిందని, అతను సర్పంచ్ గా ఉన్నప్పుడే పాఠశాల నిర్మాణం పూర్తి చేశారని గుర్తు



చేశారు.అయితే ఇన్ని సంవత్సరాల తర్వాత పాఠశాలకు ఇచ్చిన స్థలం తనదని సోమవారం ఉదయం స్కూల్ ప్రారంభ సమయంలో సంబంధిత వ్యక్తి స్కూల్ వద్దకు వచ్చి విద్యార్థులందరినీ బయటికి పంపించి, స్కూల్ గోడలపై, తలుపులపై "ఈ ప్రాపర్టీ నాది" అంటూ నోటీసులు రాయడం జరిగిందని ఆరోపించారు. అంతేకాకుండా తనకు కోర్టు ఆర్డర్ ఉందని, ఈ భూమిపై సర్వ అధికారాలు తనకే ఉన్నాయని చెప్పి విద్యార్థులందరిని బయటకు పంపించి గేటుకు తాళం వేయడం జరిగిందని వివరించారు.ఇట్టి స్కూల్ విషయంలో బొందలపల్లి గ్రామంలో రాజకీయ జోక్యాన్ని నివారించి పిల్లల భవిష్యత్తును కాపాడాలని ఆయన ఈ సందర్భంగా జిల్లా అధికారులకు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు సురేష్, నాగపూర్ మధు, సుల్తాన్, కాశన్న తదితరులు పాల్గొన్నారు.

# నాలుగేళ్ల చిన్నారిపై కామాంధుడి కర్కశం

**జఫర్గఢ్ ప్రధానోపాధ్యాయుడి తాటికాయల భాస్కర్ (50) నీచానికి గ్రామం ఉలిక్కిపాటు**

**వర్ధన్నపేట, జూలై 28 ( వుదయం ప్రతినిధి ):**

విద్యార్థులకు విలువలు బోధించాల్సిన ఓ ప్రధానోపాధ్యాయుడు కామాంధుడిగా మారి నాలుగేళ్ల చిన్నారిపై అత్యాచార యత్నానికి పాల్పడిన ఘటన వర్ధన్నపేట మండలంలో తీవ్ర కలకలం రేపింది. ఈ అమానుష ఘటనతో గ్రామస్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.పోలీసుల వివరాల ప్రకారం, వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం బండౌతపురం గ్రామానికి చెందిన తాటికాయల భాస్కర్ (50) జఫర్గఢ్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. ఈ నెల 26వ తేదీన మధ్యాహ్నం సుమారు 2:30 గంటల సమయంలో అదే గ్రామానికి చెందిన నాలుగేళ్ల బాలిక ఆడుకుంటూ నిందితుడి ఇంట్లోకి వెళ్లింది.కొద్దిసేపటి తర్వాత బాలిక కనిపించకపోవడంతో తల్లి వెతుకుతూ నిందితుడి ఇంటికి వెళ్లగా, చిన్నారితో అసభ్యకరంగా ప్రవర్తిస్తూ ఆమె ప్రైవేట్ భాగాలను తాకి అత్యాచార యత్నానికి పాల్పడినట్లు కుటుంబ




సభ్యులు ఆరోపించారు. అనంతరం చిన్నారి జరిగిన విషయాన్ని తల్లికి చెప్పడంతోకుటుంబ సభ్యులు వెంటనే పోలీసులను ఆశ్రయించారు.ఫిర్యాదు అందుకున్న వర్ధన్నపేట పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం కోర్టులో హాజరుపరచగా రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.ఈ ఘటనతో బండౌతపురం గ్రామంలో తీవ్ర ఆందోళన నెలకొంది. సమాజంలో గౌరవప్రదమైన హోదాలో ఉంటూ,పిల్లలకు బుద్ధులు చెప్పాల్సిన గురువే ఈ తరహా దారుణానికి ఒడిగట్టడంతో స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. .నిందితుడిని కఠినంగా శిక్షించాలంటూ బాధితురాలి కుటుంబ సభ్యులు, గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. చిన్నారిపై దారుణానికి పాల్పడిన నిందితుడిపై అత్యంత కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు, ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

# సమాజసేవకు ప్రతిరూపం డాక్టర్ సంపత్

**తాండూరు జులై 28 వుదయం ప్రతినిధి**




వైద్య వృత్తిని కేవలం ఒక ఉద్యోగంగా కాకుండా, సమాజసేవకే అంకితమైన పరమార్థంగా భావిస్తూ శ్రీ బాలాజీ నర్సింగ్ హోం అధినేత డాక్టర్ సంపత్ కుమార్ గారు అందిస్తున్న సేవలు తాండూరు నియోజకవర్గ ప్రజల మన్ననలు పొందుతున్నాయి. మానవత్వానికి నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తూ ఆయన చేపడుతున్న పలు సేవా కార్యక్రమాలు నిరుపేదలకు, బాధితులకు గొప్ప ఆసరాగా నిలుస్తున్నాయి. ఉచిత వైద్యం - రోగులకు టోకెన్ల తిప్పలు లేకుండా...సాధారణంగా ఆసుపత్రుల్లో వైద్యుడిని కలవాలంటే టోకెన్లు, సుదీర్ఘ నిరీక్షణ తప్పనిసరి. కానీ డాక్టర్ సంపత్ కుమార్ గారు ప్రతి మంగళవారం రోగులకు ఎలాంటి టోకెన్లు లేదా రుసుము లేకుండా ఉచిత వైద్య పరీక్షలు అందిస్తూ ప్రజాదరణ పొందుతున్నారు. పేద ప్రజల ఆరోగ్యంపై ఆయనకు ఉన్న శ్రద్ధకు ఈ చర్య ఓ నిదర్శనం. 165 సార్లు రక్తదానం - ప్రాణదాతగా రికార్డు! రక్తదానం మహాదానం అంటారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారిని కాపాడేందుకు డాక్టర్ సంపత్ కుమార్ గారు ఇప్పటివరకు ఏకంగా 165 సార్లు రక్తదానం చేసి ఎందరో ప్రాణాలను నిలబెట్టారు. స్వయంగా ఒక వైద్యుడై ఉండి ఇన్నిసార్లు రక్తదానం చేయడం సమాజానికి ఎంతో స్ఫూర్తిదాయకం. అంతిమ సంస్కారాలకు ఆర్థిక సాయం తాండూరు నియోజకవర్గ పరిధిలో ఎవరైనా పేదవారు మరణిస్తే, వారి అంత్యక్రియలకు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో ఆయన ₹5,000 ఆర్థిక సాయం అందిస్తూ మానవత్వాన్ని చాటుకుంటున్నారు. కష్టకాలంలో ఆపన్నహస్తం అందిస్తూ బాధిత కుటుంబాలకు కొండంత అండగా నిలుస్తున్నారు. సమాజ హితం:వైద్యం, రక్తదానం, ఆపదలో ఆర్థిక సాయం... ఇలా ప్రతి విషయంలోనూ ముందుంటూ తాండూరు ప్రాంత ప్రజల గుండెల్లో నిలిచిన డాక్టర్ సంపత్ కుమార్ గారి సేవలు అత్యంత అభినందనీయం. ఆయన సేవలు ఇలాగే నిరంతరం కొనసాగాలని, ఆయనకు భగవంతుడు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ఆశిద్దాం.

# కాంగ్రెస్ తోనే సమగ్ర అభివృద్ధి సాధ్యం

*** ఎమ్మెల్యే యశస్విని రెడ్డి సుడిగాలి పర్యటన**
*** రూ. 4.61 కోట్ల నిధులతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన**

**పెద్దవంగర, జూలై 28 (వుదయం ప్రతినిధి):**



పెద్దవంగర మండలాన్ని జిల్లాలోనే ఆదర్శ మండలంగా తీర్చిదిద్దేందుతానని పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలో సుడిగాలి పర్యటన నిర్వహించిన ఎమ్మెల్యే, రూ. 4.61 కోట్ల నిధులతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. అనంతరం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రంగు మురళి గౌడ్, సీనియర్ నాయకులు ముద్దసాని సురేష్ మాట్లాడుతూ ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పన, గ్రామీణాభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుకు కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంతోనే రాష్ట్ర సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని వ్యాఖ్యానించారు. సీసీ రోడ్డు, రహదారులు, డ్రైనేజీలు, తాగునీటి సౌకర్యాలు, ఇతర మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దఎత్తున నిధులు కేటాయిస్తోందని తెలిపారు. అభివృద్ధి పనులను నాణ్యతతో, నిర్దేశిత గడువులో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే పర్యటన సందర్భంగా ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. ఆమె ప్రజలతో నేరుగా మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పీఆర్ డీఈ శ్రీనివాసులు, ఏఈ దయాకర్, ఎంపీడీవో సురేష్, తహశీల్దార్ వినోద్ కుమార్, ఎంఈవో శ్రీనివాస్, మండల నాయకులు సైదులు గౌడ్, గోపాల్ నాయక్, రవీందర్ రెడ్డి, నెహ్రు నాయక్, దుంపల కుమారస్వామి, దాసరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు .

# ఓటు హక్కు పరిరక్షణే లక్ష్యం.. ఎస్.ఐ.ఆర్ పై అప్రమత్తంగా ఉండాలి



**-- చల్మెడ లక్ష్మీనరసింహారావు.**

**వేములవాడ, జూలై 28 (వుదయం ప్రతినిధి) :**

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రత్యేక సమగ్ర పరిశీలన (ఎస్. ఐ. ఆర్) కార్యక్రమంపై బూత్ స్థాయి నాయకులు, ఏజెంట్లు అప్రమత్తంగా వ్యవహరించి అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా కృషి చేయాలని బీఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చల్మెడ లక్ష్మీ నరసింహారావు పిలుపునిచ్చారు . వేములవాడ మున్సిపల్ పరిధిలోని 8వ వార్డు నుంచి 28వ వార్డు వరకు ఉన్న పోలింగ్ బూత్ ఏజెంట్లు, పార్టీ సభ్యులకు మంగళవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటర్ల జాబితాపై బూత్ స్థాయి ఏజెంట్లకు పూర్తి అవగాహన ఉండాలని, ఎస్.ఐ.ఆర్ కార్యక్రమంలో బూత్ లెవల్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ అర్హులందరి పేర్లు ఓటర్ల జాబితాలో నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఆగస్టు 3తో ఎస్. ఐ. ఆర్ కార్యక్రమం గడువు ముగియనున్న నేపథ్యంలో, గడువులోగా అర్హులైన ప్రతి ఓటరికి ఓటు హక్కు కల్పించే దిశగా క్షేత్రస్థాయిలో విస్తృతంగా పనిచేయాలని బూత్ ఏజెంట్లకు సూచించారు. సమావేశంలో పట్టణ సీనియర్ నాయకులు, మాజీ కౌన్సిలర్లు, వార్డు సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వరుణుడి కరుణకై ఆంజనేయ స్వామికి "అల్ఫోర్స్" నరేందర్ రెడ్డి ప్రత్యేక పూజలు



**కరీంనగర్ జులై 28 (వుదయం ప్రతినిధి):**

రాష్ట్రంలో సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి, రైతులు సుభిక్షంగా ఉండాలని, పాడిపంటలు పుష్కలంగా పండాలని ఆకాంక్షిస్తూ అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా. వి. నరేందర్ రెడ్డి స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ బాలుర రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల ప్రాంగణంలో కొలువై ఉన్న ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించిన సందర్భంగా వారు మాట్లాడారు. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య స్వామివారికి అభిషేకం, అర్చన, ప్రత్యేక నైవేద్యం తదితర పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించడం జరిగిందని వారు చెప్పారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని వరుణ దేవుని అనుగ్రహంతో సమృద్ధిగా వర్షాలు కురిసి, రైతాంగం సంతోషంగా ఉండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ప్రార్థించారు.ప్రకృతి అనుకూలంగా ఉండటం, సకాలంలో వర్షాలు కురవడం రైతాంగానికి ఎంతో కీలకమని, అన్నదాతలు అభివృద్ధి చెందితేనే సమాజం సుభిక్షంగా ఉంటుందని వారు పేర్కొన్నారు. భగవంతుని ఆశీస్సులతో ప్రజలందరికీ మంచి జరగాలని, తెలంగాణ రాష్ట్రం సస్యశ్యామలంగా, సుభిక్షంగా వర్ధిల్లాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వామివారి తీర్థప్రసాదాలను అందజేసి ఆశీర్వచనం చేశారు. భక్తులు, ఆలయ నిర్వాహకులు, స్థానిక ప్రముఖులు, పాఠశాల ప్రిన్సిపాల్, సిబ్బంది, విఎన్ఆర్ ఫౌండేషన్ కార్యకర్తలు, సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# ఊపిరితిత్తుల వ్యాధులకు శస్త్రచికిత్స అవసరం లేదు




**అత్యాధునిక ఇంటర్వెన్షనల్ పల్మనాలజీతో కోత లేకుండానే చికిత్స యశోదా ఆసుపత్రి వైద్యులు డాక్టర్ ప్రణయ్ సాయి చంద్రగిరి**

**ఖమ్మం వుదయం బ్యూరో, జూలై 28**

ఊపిరితిత్తుల క్యాన్సర్, శ్వాసనాళాల అవరోధం, ఊపిరితిత్తుల్లో నీరు చేరడం, దీర్ఘకాలిక దగ్గు, రక్తంతో దగ్గు, తీవ్రమైన శ్వాసకోశ వ్యాధులు వంటి సమస్యల నిర్ధారణ, చికిత్స కోసం గతంలో చాలాసార్లు పెద్ద శస్త్రచికిత్సలు అవసరమయ్యేవని, ఇప్పుడు ఆధునిక వైద్య సాంకేతికత అభివృద్ధితో ఇంటర్వెన్షనల్ పల్మనాలజీ ద్వారా శరీరాన్ని పెద్దగా కోయకుండా, అత్యల్ప గాట్లతోనే అనేక క్లిష్టమైన ఊపిరితిత్తుల వ్యాధులను గుర్తించి సమర్థవంతంగా చికిత్స చేయడం సాధ్యమవుతోందని హైదరాబాద్ మలక్‌పేట్ యశోదా ఆసుపత్రి వైద్యులు, ఎం.డి (రెస్పిరేటరీ మెడిసిన్), డి.ఎం (పల్మనరీ, క్రిటికల్ కేర్ స్లీప్ మెడిసిన్) డాక్టర్ ప్రణయ్ సాయి చంద్రగిరి పేర్కొన్నారు. ఖమ్మంలోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మలక్‌పేట్‌లోని యశోదా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్లో అత్యాధునిక ఇంటర్వెన్షనల్ పల్మనాలజీ సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఊపిరితిత్తుల క్యాన్సర్, శ్వాసనాళాల ఇరుకుదనం, పునరావృతమయ్యే ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్లు, ప్లూరల్ ఎఫ్యూషన్, ఎంపిసీమా వంటి క్లిష్టమైన శ్వాసకోశ వ్యాధులకు అత్యల్ప జోక్యంతో, తక్కువ నొప్పితో, వేగవంతమైన కోలుకునే విధంగా ఆధునిక చికిత్సలు అందిస్తున్నామని తెలిపారు.

ఇంటర్వెన్షనల్ పల్మనాలజీ అంటే...

ఇంటర్వెన్షనల్ పల్మనాలజీ అనేది శ్వాసకోశ వైద్యశాస్త్రంలో అత్యాధునిక సూపర్ స్పెషాలిటీ. ఇందులో ప్రత్యేక బ్రాంకోస్కోపీలు, అల్ట్రాసౌండ్ ఆధారిత సాంకేతికతలు, చిన్న రంధ్రాల ద్వారా చేసే చికిత్సా విధానాలను ఉపయోగించి ఊపిరితిత్తులు, శ్వాసనాళాలు, ఛాతీ లోపలి భాగంలోని అనేక క్లిష్టమైన వ్యాధులను నిర్ధారించి చికిత్స అందిస్తారు. సాంప్రదాయ శస్త్రచికిత్సలతో పోలిస్తే ఇవి అత్యల్ప జోక్యంతో పూర్తవుతాయి. ఫలితంగా రోగికి నొప్పి తక్కువగా ఉండటంతో పాటు త్వరగా కోలుకునే అవకాశం ఉంటుందని డాక్టర్ ప్రణయ్ సాయి తెలిపారు.అందుబాటులో ఉన్న అత్యాధునిక సేవలు :యశోదా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్లో ఫ్లెక్సిబుల్, రిజిడ్ బ్రాంకోస్కోపీ, శ్వాసనాళాల్లో ఏర్పడిన కణితులు, అవరోధాల తొలగింపు, ఎయిర్వే ద్వారా శ్వాసనాళాల చికిత్స, ఊపిరితిత్తుల చుట్టూ పేరుకునే ద్రవం తొలగింపు (ప్లూరల్ ఇంటర్వెన్షన్స్), మెడికల్ థొరాకోస్కోపీ, ఎంపిసీమా రోగులకు బ్రాంకోస్కోపిక్ లంగ్ వాల్యూమ్ రిడక్షన్, ఇమేజ్ గైడెడ్ బయాప్సీలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.రోగులకు కలిగే ప్రయోజనాలు :

ఈ ఆధునిక చికిత్సా విధానాల ద్వారా రోగులకు అనేక ప్రయోజనాలు లభిస్తున్నాయన్నారు. పెద్ద శస్త్రచికిత్స అవసరం తగ్గుతుంది, వ్యాధిని ప్రారంభ

'ఇంటర్వెన్షనల్ పల్మనాలజీ శ్వాసకోశ వైద్యంలో విప్లవాత్మక మార్పులకు నాంది పలికింది. గతంలో పెద్ద శస్త్రచికిత్స అవసరమైన అనేక ఊపిరితిత్తుల వ్యాధులను ఇప్పుడు అత్యాధునిక మినిమల్లీ ఇన్వేసివ్ విధానాలతో సురక్షితంగా నిర్ధారించి చికిత్స చేయగలుగుతున్నామన్నారు . ముఖ్యంగా ఎండోబ్రాంకియల్ అల్ట్రాసౌండ్, అడ్వాన్స్‌డ్ బ్రాంకోస్కోపీ, మెడికల్ థొరాకోస్కోపీ, ఎయిర్వే ఇంటర్వెన్షన్స్, ఇమేజ్ గైడెడ్ విధానాల ద్వారా వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించి, రోగికి తక్కువ నొప్పితో, తక్కువ రోజుల్లో కోలుకునేలా సమర్థవంతమైన చికిత్స అందించడం సాధ్యమవుతోందన్నారు. దీర్ఘకాలిక దగ్గు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, రక్తంతో దగ్గు వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా ప్రారంభ దశలోనే పరీక్షలు చేయించుకోవడం వల్ల ప్రాణాంతక వ్యాధులను కూడా సకాలంలో గుర్తించి విజయవంతంగా చికిత్స చేయవచ్చని తెలిపారు. ద్వారా చికిత్స :ఇంటర్వెన్షనల్ పల్మనాలజీ ద్వారా క్రింది సమస్యలకు సమర్థవంతమైన చికిత్స అందించవచ్చు. ఊపిరితిత్తుల క్యాన్సర్, దీర్ఘకాలిక దగ్గు, శ్వాసనాళాల అవరోధం, పదేపదే వచ్చే ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్లు, ఊపిరితిత్తుల చుట్టూ నీరు చేరడం, ఛాతీలో లింఫ్ గ్రంథుల ...

# సంక్షేమ నిలయమా.. యమకూపమా?




**మల్దకల్ జూలై 28 (వుదయం బ్యూరో)**

అది పేద, దళిత విద్యార్థులకు అండగా నిలవాల్సిన సంక్షేమ వసతి గృహం కాదు.. అధికారుల నిర్లక్ష్యానికి, పాలకుల నిష్క్రియాపరత్వానికి నిలువెత్తు శవంలా మారిన యమకూపం! మండల కేంద్రంలోని ఎస్సీ సంక్షేమ బాలుర హాస్టల్‌లో దయనీయ పరిస్థితులు చూస్తే గుండెతరుక్కుపోవాల్సిందే. మనుషులు ఉండేందుకు ఏమాత్రం యోగ్యం కాని అస్వస్థ వాతావరణంలో విద్యార్థులను పడేసి అధికారులు విలాసాల్లో మునిగితేలుతున్నారు. కనీస మౌలిక వసతులు కరువై, చీకటి గదుల్లో కంబళ్లు కప్పుకుని కన్నీళ్లు పెట్టుకుంటున్న విద్యార్థుల దుస్థితిపై ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) దండయాత్ర ప్రకటించింది. మంగళవారం హాస్టల్‌ను ఆకస్మికంగా ముట్టడించిన పీడీఎస్‌యూ బృందం అక్కడి పాపకూపాన్ని క్షేత్రస్థాయిలో బహిర్గతం చేసింది. నరకానికి నమూనా.. రోగాలకు అడ్డా! హాస్టల్‌లోని శౌచాలయాల వైపు వెళ్లాలంటేనే కడుపులో తిప్పేసేంత దుర్గంధం వెదజల్లుతోంది. ఏళ్ల తరబడి మరమ్మతులు లేక, పారిశుధ్యం పడకేసి కంపు కొడుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఇక తాగేందుకు చుక్క సురక్షిత నీరు లేక, అపరిశుభ్రమైన నీటినే తాగుతూ విద్యార్థులు రకరకాల ప్రాణాంతక వ్యాధుల బారిన పడుతున్నారు. పేద పిల్లల ప్రాణాలంటే అధికారులకు అంత చులకనా? అని పీడీఎస్‌యూ నాయకులు నిలదీశారు. చదువుకోవాల్సిన వయసులో, పొట్టచేతబట్టుకుని హాస్టల్‌కు వస్తే.. ఇక్కడ రోగాలను మూటగట్టుకోవాల్సి వస్తోందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులారా.. నిద్రమత్తు వీడండి! లేదంటే కలెక్టరేట్ ముట్టడే! ఈ సందర్భంగా పీడీఎస్‌యూ మల్దకల్ మండల అధ్యక్షుడు ప్రభువరుణ్ మాట్లాడుతూ.. "సంక్షేమ శాఖ అధికారులకు జీతాలు దండగ! ఎస్సీ హాస్టళ్ల బడ్జెట్ ఏమవుతోందో సమాధానం చెప్పాలి. కనీసం " యుద్ధ ప్రాతిపదికన శౌచాలయాలను పునర్మిర్మించి, శుభ్రమైన తాగునీటి సదుపాయం కల్పించకపోతే అధికారుల ఆఫీసుల ముందే విద్యార్థులతో ధర్నాకు దిగుతామని, కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని ఘాటుగా హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో పీడీఎస్‌యూ మల్దకల్ మండల కార్యదర్శి రాజ్‌కుమార్, నాయకులు హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# మాతృ, శిశు మరణాల నివారణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలి

**– జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**


**సంగారెడ్డి, జూలై 28:-వు దయం.**



జిల్లాలో ప్రసవాల సందర్భంగా మాతృ, శిశు మరణాలు ఎట్టి పరిస్థితుల్లోనూ చోటుచేసుకోకుండా అన్ని స్థాయిల్లో కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ వైద్యాధికారులను ఆదేశించారు. గర్భిణులకు గర్భధారణ ప్రారంభ దశ నుంచే క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వైద్య సేవలను సకాలంలో అందించడం ద్వారా మాతృ, శిశు మరణాలను పూర్తిగా నివారించే దిశగా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.సోమవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాతృ, శిశు మరణాల ఆడిట్‌తో పాటు జిల్లాలో గర్భధారణ పూర్వ మరియు గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టం-1994 అమలుపై సమగ్రంగా సమీక్ష ఏమిటి, వైద్య సేవలలో ఎక్కడైనా గుర్తించి తక్షణమే ఉన్నత వైద్య కేంద్రాలకు రిఫర్ చేయాలని సూచించారు.హై రిస్క్ గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, గైనకాలజిస్టులు, వైద్యాధికారులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ప్రతి గర్భిణికి, ప్రతి నవజాత శిశువుకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రసవానికి ముందు, ప్రసవ సమయంలో, ప్రసవానంతరం తల్లి-శిశువుల ఆరోగ్యంపై నిరంతర పర్యవేక్షణ ఉండేలా సమర్థవంతమైన కార్యాచరణ అమలు చేయాలని సూచించారు.అదేవిధంగా జిల్లాలో PC&PNDT చట్టం-1994ను కట్టుదిట్టంగా అమలు చేయాలని, లింగ నిర్ధారణ పరీక్షలను పూర్తిగా అరికట్టేందుకు నిరంతర తనిఖీలు, పర్యవేక్షణ చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ లలితా దేవి, ప్రోగ్రామ్ ఆఫీసర్ (ఎంసీహెచ్) డాక్టర్ నాగలక్ష్మి, డాక్టర్ శశాంక్, సంబంధిత వైద్యాధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# గ్రేటర్ హైదరాబాద్




దక్షిణ కోస్తా రైల్వే
విశాఖపట్నం
మమ్మల్ని అనుసరించండి @SCoRailway
వెబ్‌సైట్: www.scor.indianrailways.gov.in

బహిరంగ ఇ-టెండరు ప్రకటన నెం.డిఆర్ఎం/పనులు/బిజెడ్ఎ/26/2026 తేది:24.07.2026

భారత రాష్ట్రపతి తరఫున మరియు కొరకు దిగువ సంతకందారుచే దిగువ పనుల కొరకు ప్రతి దాని ముందు పేర్కొనబడిన తేదీన మరియు 15-00 గం.ల వరకు ఇ-టెండర్లు ఆహ్వానించబడుచున్నవి.

(క్ర.నెం.1.) టెండరు నెం.: ఇ-19-ఈస్ట్-బిజెడ్ఎ-2026. [illegible] పూర్తి చేయు కాలం: 12 (పన్నెండు నెలలు). టెండరు విలువ: రూ. 7,30,96,556/-, ఇ.ఎం.డి: రూ.14,61,900/-. ముగింపు తేది: 11/08/2026.

(క్ర.నెం.2.) టెండరు నెం.: ఇ-12-సౌత్-బిజెడ్ఎ-2026. [illegible] పూర్తి చేయు కాలం: 12 (పన్నెండు నెలలు). టెండరు విలువ: రూ. 2,74,38,259/-, ఇ.ఎం.డి: రూ. 5,48,800/-. ముగింపు తేది: 13/08/2026.

(క్ర.నెం.3.) టెండరు నెం.: ఇ-11-సౌత్-బిజెడ్ఎ-2026. [illegible] పూర్తి చేయు కాలం: 12 (పన్నెండు నెలలు). టెండరు విలువ: రూ. 3,04,04,488/-, ఇ.ఎం.డి:రూ. 6,08,100/-. ముగింపు తేది: 13/08/2026.

(క్ర.నెం.4.) టెండరు నెం.: ఇ-09- సెంట్రల్-బిజెడ్ఎ-2026. [illegible] పూర్తి చేయు కాలం: 12 (పన్నెండు నెలలు). టెండరు విలువ: రూ. 3,52,74,881/-, ఇ.ఎం.డి: రూ. 7,05,500/-. ముగింపు తేది: 14/08/2026.

(క్ర.నెం.5.) టెండరు నెం.: ఇ-21-ఈస్ట్- బిజెడ్ఎ-2026. [illegible] పూర్తి చేయు కాలం: 18 (పద్దెనిమిది నెలలు). టెండరు విలువ: రూ. 9,87,43,162/-, ఇ.ఎం.డి:రూ. 19,74,900/-. ముగింపు తేది: 14/08/2026.

(క్ర.నెం.6.) టెండరు నెం.:ఇ-20-ఈస్ట్- బిజెడ్ఎ-2026. [illegible] పూర్తి చేయు కాలం: 12 (పన్నెండు నెలలు). టెండరు విలువ: రూ. 1,75,88,137/-, ఇ.ఎం.డి:రూ. 3,51,800/-. ముగింపు తేది: 14/08/2026.

(క్ర.నెం.7.) టెండరు నెం.:ఇ-22-ఈస్ట్- బిజెడ్ఎ-2026. [illegible]

[illegible]

SCoR-A114
PUB/SCoR-097


## శ్రీవారి సేవలో గంగుల వెంకట్ రాజి రెడ్డి



తిరుమల తిరుపతి వెంకటేశ్వర స్వామి ఆశీస్సులతో శ్రీవారిని దర్శించుకున్న గంగుల వెంకట రాజి రెడ్డి తన జన్మదిన సందర్భంగా ఆ కలియుగ ప్రత్యక్ష దైవం వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు ఆయనతోపాటు తిమ్మాపురం మహేందర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు పున్నం జగన్మోహన్, పిట్ట వెంకట్, రెడ్డి శంబాల వెంకన్న, ఉన్నారు రాజిరెడ్డి అనంతరం ఆయన మాట్లాడుతూ నా జన్మ సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేసిన అభిమానులకు కార్యకర్తలకు పార్టీ పెద్దలకు వెంకటేశ్వర స్వామి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆయన అన్నారు.పార్టీలో కష్టపడి పనిచేస్తున్న వారికి ఏదో ఒక రోజు అవకాశాలుంటాయని అన్నారు. రాజిరెడ్డి చెప్పారు

## పెన్షనర్ల మహా ధర్నా: ఆరోగ్య భద్రతకు పోరు

ముషీరాబాద్,
జూలై 28. (వుదయం)

తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్లకు ప్రకటించిన EHCT ఆరోగ్య పథకాన్ని వెంటనే పూర్తిస్థాయిలో అమలు చేయాలని, లేకపోతే 2026 ఆగస్టు 7వ తేదీ శుక్రవారం హైదరాబాద్ ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద రాష్ట్రవ్యాప్త మహా ధర్నా నిర్వహిస్తామని తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ (TGPJAC) హెచ్చరించింది. బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్స్ జేఏసీ జనరల్ బాడీ సమావేశం చైర్మన్ శ్రీ కె. లక్ష్మయ్య అధ్యక్షతన జరిగింది.సమావేశంలో సెక్రటరీ జనరల్ శ్రీ తులసి సత్యనారాయణ వార్షిక నివేదికను, ఖజాంచి శ్రీ కృష్ణప్రసాద్ ఆర్థిక నివేదికను సమర్పించారు. అనంతరం రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన ధర్నా నిర్వహించాలి.EHCT పథకాన్ని వెంటనే పూర్తిస్థాయిలో అమలు చేయడంతో పాటు, ఇప్పటికే ఇతర ఆరోగ్య బీమా లేదా ఆరోగ్య పథకాలలో ఉన్న పెన్షనర్లకు EHCTలో చేరాలా పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ నివేదికను వెంటనే ప్రకటించాలి.పెండింగ్‌లో ఉన్నడీఏ/డీఆర్ బకాయిలను నగదు రూపంలో చెల్లించాలి. గతంలో రూ.398 నిర్ణీత వేతనంతో పనిచేసిన స్పెషల్ టీచర్లకు నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలి.పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా "పెన్షనర్స్ డైరెక్టరేట్" ఏర్పాటు చేయాలి.2024 మార్చి తర్వాత పదవీ రిమణ చేసిన పెన్షనర్లందరికీ పెండింగ్‌లో ఉన్న పెన్షనరీ బెనిఫిట్స్, బకాయిలను ఒకేసారి చెల్లించాలి.2026 డిసెంబర్ 17న జరనున్న పెన్షనర్స్ డేను జేఏసీ అనుబంధ సంఘాలన్నీ కలిసి రాష్ట్రస్థాయిలో ఘనంగా నిర్వహించాలి. ఈ సమావేశం అనంతరం ప్రభుత్వానికి తక్షణమే స్పందించి పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని, లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను మరింత ఉద్ధృతం చేస్తామని తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్స్ జేఏసీ నాయకత్వం హెచ్చరించింది.


టెండరు ప్రకటన నెం: డిఇఇసి-టిఆర్ఎస్-ఓటి-06-2026-27, తేది:24-07-2026

[illegible]

PUB/SCoR-098



టెండరు ప్రకటన నెం: [illegible] తేది: 24.07.2026

[illegible]

PUB/SCoR-100


# డ్రైవర్ల సమస్యలపై రవాణాశాఖ చర్చలు



**ఆగస్టు 8లోపు మరో సమావేశం.. లేకపోతే జేఏసీ ఆధ్వర్యంలో ఆమరణ నిరాహార దీక్షలు**

ముషీరాబాద్,
జూలై 28(వుదయం)

22072026న సమర్పించిన వినతిపత్రం నేపథ్యంలో, రవాణాశాఖ కమిషనర్ కార్యాలయం ఆహ్వానం మేరకు 27072026న టీజీ టాక్సీ డ్రైవర్స్ అండ్ ఓనర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ (JAC) ప్రతినిధులు అధికారులను కలిసి డ్రైవర్ల సమస్యలపై సుమారు మూడు గంటల పాటు సుదీర్ఘంగా చర్చించారు.ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం రూపొందిస్తున్న అగ్రిగేటర్ పాలసీ, యాప్ ఆధారిత టాక్సీ డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలు, వారి హక్కులు, సంక్షేమం, భద్రత వంటి కీలక అంశాలపై సమగ్రంగా చర్చలు జరిగాయి. జేఏసీ ప్రతినిధులు డ్రైవర్ల సమస్యలను అధికారుల దృష్టికి స్పష్టంగా తీసుకెళ్లగా, అధికారులు పలు కీలక హామీలు ఇచ్చారు.అగ్రిగేటర్ పాలసీకి సంబంధించిన నిబంధనలు ఇంకా పూర్తిస్థాయిలో ఖరారు కాలేదని, రాష్ట్రంలోని అన్ని డ్రైవర్ సంఘాలు, కార్మిక సంఘాలు, సంబంధిత వర్గాలతో ప్రత్యక్షంగా సమావేశాలు నిర్వహించి వారి అభిప్రాయాలు సేకరించిన అనంతరం తుది డ్రాఫ్ట్‌ను రూపొందిస్తామని కమిటీ స్పష్టం చేసింది.చర్చించిన ప్రధాన అంశాలు:డ్రైవర్లకు కనీస ఆదాయ భద్రత (కనీస ధరల నిర్ణయం) యాప్ కంపెనీల ఐడీ బ్లాక్ సమస్యలుమహిళా డ్రైవర్లకు భద్రత, కనీస వసతులుపార్కింగ్ స్థలాలు, రెస్ట్‌రూమ్‌ల ఏర్పాటుపని గంటల నియంత్రణడ్రైవర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటుయాప్ కంపెనీలు వసూలు చేస్తున్న అధిక కమిషన్‌పై నియంత్రణడ్రైవర్లు ఎదుర్కొంటున్న ఇతర కీలక సమస్యలు అధికారులు త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా డ్రైవర్లతో నేరుగా సమావేశాలు నిర్వహించి వారి అభిప్రాయాలు తెలుసుకుంటామని హామీ ఇవ్వడం పట్ల జేఏసీ సభ్యులు సంతృప్తి వ్యక్తం చేశారు. డ్రైవర్ల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి ఇది సానుకూల పరిణామమని వారు పేర్కొన్నారు. అయితే, ఆగస్టు 8లోపు మరోసారి సమావేశం ఏర్పాటు చేసి సమస్యల పరిష్కారంపై స్పష్టమైన నిర్ణయాలు తీసుకోవాలని జేఏసీ డిమాండ్ చేసింది. ఒకవేళ ఆ గడువులోగా ప్రభుత్వం స్పందించకపోతే, టీజీ టాక్సీ డ్రైవర్స్ అండ్ ఓనర్స్ జేఏసీ ఆధ్వర్యంలో ఆగస్టు 8 నుంచి ఆమరణ నిరాహార దీక్షలు ప్రారంభిస్తామని హెచ్చరించింది. ఈ సమావేశంలో టీజీ టాక్సీ డ్రైవర్స్ అండ్ ఓనర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు కిరణ్ కుమార్ గాజుల, సతీష్ కుమార్, బి. రాజు గౌడ్, వినయ్ భూషణ్, మహేందర్ గౌడ్, బి. రాజు పాల్గొన్నారు.

# ప్రతి నీటి బొట్టును కాపాడితేనే భావితరాలకు భద్రత: ఎంపీడీవో ప్రవీణ్ కుమార్

శంకర్‌పల్లి
జులై 28(వుదయం)



శంకర్‌పల్లి మండలంలోని కొండకల్, మోకిలా గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో ఎంపీడీవో వి. ప్రవీణ్ కుమార్ పాల్గొని తెలంగాణకు జలసిరి కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించారు. నీటి సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రతి నీటి బొట్టును కాపాడితేనే భావితరాలకు భద్రత ఉంటుందని అన్నారు.

ప్రతి ఇంటిలో మ్యాజిక్ సోక్‌పిట్, రైతులు తమ పొలాల్లో ఫామ్‌పాండ్‌లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అలాగే గ్రామాల్లో పర్‌కొలేషన్ ట్యాంకుల నిర్మాణం ద్వారా భూగర్భ జలాలను పెంపొందించవచ్చని వివరించారు.ఎల్‌నినో ప్రభావం దృష్ట్యా రైతులు అధిక నీటి అవసరమయ్యే పంటలకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. జలసిరి కార్యక్రమాన్ని ప్రజా ఉద్యమంగా విజయవంతం చేయాలని, ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు, మహిళా సంఘాలు, యువత సమిష్టిగా కృషి చేయాలని ఎంపీడీవో పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచులు, వార్డు సభ్యులు, అధికారులు, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# గుమ్మడిదల పీహెచ్‌సీలో డీఎంహెచ్‌వో ఆకస్మిక తనిఖీ

**పీహెచ్‌సీ సేవలపై సంతృప్తి**

గుమ్మడిదల,
జూలై 28 (వుదయం) :

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ లలితాదేవి మంగళవారం గుమ్మడిదల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలో అందుతున్న వైద్య సేవలు, సంబంధిత రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆస్పత్రికి వచ్చిన రోగులతో నేరుగా మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ప్రసూతి సేవలు, ఓపీ నిర్వహణ, టీహబ్ ద్వారా నిర్వహిస్తున్న ప్రయోగశాల పరీక్షలపై సమీక్ష నిర్వహించారు. ప్రజలకు అన్ని ఆరోగ్య సేవలు పూర్తి స్థాయిలో అందేలా కృషి చేయాలని, జాతీయ ఆరోగ్య కార్యక్రమాల ప్రయోజనాలు ప్రతి ఒక్కరికీ చేరేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఆరోగ్య సేవల అమలులో సంగారెడ్డి జిల్లాను రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలిపేందుకు ప్రతి ఉద్యోగి బాధ్యతతో పనిచేయాలని పేర్కొన్నారు. మాతాశిశు సంక్షేమ కార్యక్రమాల్లో తెలంగాణ దేశంలో ముందంజలో ఉండటానికి ఆరోగ్య సిబ్బంది కృషే కారణమని అభినందించారు. కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారి డాక్టర్ మధుకర్‌తో పాటు ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# శంకర్‌పల్లి–మర్పల్లి రహదారికి ₹43 కోట్ల మంజూరు: కాంగ్రెస్

శంకర్‌పల్లి
జులై 28(వుదయం)



శంకర్‌పల్లి-మర్పల్లి రహదారి అభివృద్ధి అంశంపై బీఆర్ఎస్ నాయకులు చేసిన విమర్శలకు కాంగ్రెస్ నాయకులు మీడియా సమావేశం ద్వారా స్పందించారు. శంకర్‌పల్లి మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాల యంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు చేకూర్త గోపాల్ రెడ్డి మాట్లాడుతూ, శంకర్‌పల్లి-మర్పల్లి రహదారి అభివృద్ధి పనుల కోసం రూ.43 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. టెండర్ ప్రక్రియ పూర్తయిన వెంటనే పనులు ప్రారంభమవుతాయని చెప్పారు.మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బొల్లారం వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ఈ రహదారి అభివృద్ధిని ఎందుకు చేపట్టలేదని ప్రశ్నించారు. ఇప్పుడు అదే అంశంపై విమర్శలు చేయడం రాజకీయ ప్రయోజనాల కోసమేనని వ్యాఖ్యానించారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డులు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500 గ్యాస్ సిలిండర్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు.ఈ సమావేశంలో మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు మడపతి చంద్రమౌళి, మున్సిపల్ చైర్మన్ సాత ప్రవీణ్ కుమార్, వైస్ చైర్మన్ శ్వేత పాండురంగారెడ్డి, కాశెట్టి చంద్రమోహన్, ఇతర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బుల్కాపూర్ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడొద్దు

శంకర్‌పల్లి
జులై 28(వుదయం)

శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని బుల్కాపూర్ 4వ వార్డులో నెలకొన్న రోడ్ల దుస్థితి, వర్షపు నీరు నిల్వ ఉండడం, దోమలు, ఈగల బెడదపై అడ్వకేట్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు శేఖర్ మద్దూరి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల ప్రాణాలు, ఆరోగ్యంతో మున్సిపల్ అధికారులు చెలగాటం ఆడుతున్నారని ఆయన మండిపడ్డారు. వర్షం పడిన ప్రతిసారి రోడ్లు చెరువులను తలపిస్తున్నప్పటికీ సమస్యను శాశ్వతంగా పరిష్కరించడంలో అధికార యంత్రాంగం పూర్తిగా విఫలమైందని విమర్శించారు.

బుల్కాపూర్ 4వ వార్డులో రోడ్లన్నీ బురదమయంగా మారి, భారీ గుంతల్లో వర్షపు నీరు నిలవడంతో ప్రజలు నిత్యం అవస్థలు పడుతున్నారని శేఖర్ మద్దూరి తెలిపారు. ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతుండగా, చిన్నారులు, మహిళలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులతో రాకపోకలు సాగిస్తున్నారని అన్నారు. ప్రజల నుంచి పన్నులు వసూలు చేసే మున్సిపాలిటీ కనీస మౌలిక వసతులు కల్పించకపోవడం బాధాకరమని పేర్కొన్నారు.రోడ్లపై నిలిచిన మురికి నీటి కారణంగా దోమలు, ఈగలు విపరీతంగా పెరిగి డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా, టైఫాయిడ్ వంటి అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఏర్పడిందని ఆయన హెచ్చరించారు. ప్రజారోగ్యాన్ని కాపాడాల్సిన అధికారులు ఫాగింగ్, దోమల మందు పిచికారీ వంటి నివారణ చర్యలను నిర్లక్ష్యం చేయడం బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని విమర్శించారు.అభివృద్ధి పేరుతో ప్రకటనలు చేసుకోవడం కాదు, ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించడమే ప్రజాప్రతినిధులు, అధికారుల అసలు బాధ్యత అని శేఖర్ మద్దూరి స్పష్టం చేశారు. ప్రతి వర్షాకాలంలో ఇదే సమస్య పునరావృతమవుతున్నా శాశ్వత డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయకపోవడం అధికారుల వైఫల్యాన్ని స్పష్టంగా చూపిస్తోందన్నారు. ప్రజల సమస్యలను విస్మరించడం తగదని, ఇప్పటికైనా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.బుల్కాపూర్ 4వ వార్డులోని రోడ్లను అత్యవసరంగా మరమ్మతులు చేసి, వర్షపు నీరు నిల్వకుండా శాశ్వత డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని, వారానికి ఒకసారి ఫాగింగ్, దోమల మందు పిచికారీ నిర్వహించాలని అడ్వకేట్, బీఆర్ఎస్ నాయకులు శేఖర్ మద్దూరి డిమాండ్ చేశారు. సమస్యను వెంటనే పరిష్కరించకపోతే ప్రజలతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు.



## విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని డీఈకి 16వ వార్డు కౌన్సిలర్ వినతి

**లో-వోల్టేజ్, విద్యుత్ కోతలు, పాత వైర్ల సమస్యలు పరిష్కరించాలని వినతి**

షాద్‌నగర్

పట్టణంలోని 16వ వార్డు క్రిస్టియన్ కాలనీలో నెలకొన్న విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ వార్డు కౌన్సిలర్ ఒగ్గు జయలక్ష్మి కిషోర్ విద్యుత్ శాఖ డీఈ శ్యామ్ సుందర్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ కాలనీలో తరచూ లోవోల్టేజ్ సమస్యతో పాటు ప్రతిరోజూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని తెలిపారు. విద్యుత్ నాణ్యతను మెరుగుపరచడంతో పాటు లోవోల్టేజ్ సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. అవసరమైన ప్రాంతాల్లో నూతన విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని, పెద్ద సామర్థ్యం కలిగిన ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే పాత కండక్టర్ వైర్లను తొలగించి నూతన కండక్టర్ వైర్లు ఏర్పాటు చేయాలని, అవసరమైన చోట విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని కోరారు. హైవే ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను వివరించిన కౌన్సిలర్ ఒగ్గు జయలక్ష్మి కిషోర్‌కు డీఈ శ్యామ్ సుందర్ రెడ్డి సానుకూలంగా స్పందించి, సమస్యలను పరిశీలించి వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు..


**SUMMONS TO DEFENDANTS IN THE COURT OF HON'BLE I JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT, AT:: SECUNDERABAD**

**O.S.NO.469 OF 2022**

**BETWEEN:**
**Indian Overseas Bank**
**Padmarao Nagar Branch, Secunderabad.**
**Rep.By its Branch Manager. ...PLAINTIFF**
**AND**
**M/s.A1 Fresh Mutton Market and Another**
**To**
**1.M/s.A1 Fresh Mutton Market, situated at H.No. 2-22-270, Swapnalok Aopartments, Near BSNL Office, Bhagya Nagar Colony, Kukatpally, Hyderabad, Telangana-500 072, Reptd. By its sole Proprietor Mr.M.D.Ajaz S/o.M.D.Chand Pasha,**
**2. Mr.M.D.Ajaz, S/o. M.D.Chand Pasha, Aged about: 33 years, Occ: Business, R/o.H.No.2-1-451, Yellama Banda, Kukatpally, Hyderabad-500 072. ...DEFENDANT**

Whereas the Plaintiff above named has filed the above O.S.No.469 of 2022 for Recovery of Money and the matter stands posted on 28-09-2026 for your appearance.

You are Concerned are hereby required to appear in this court in person or by a pleader on **28-09-2026 at 10.30.a.m.** failing which the matter would be decided in your absence in accordance with law

**(BY ORDER OF THE HON'BLE COURT)**

**M/s. M.V.S. PRASAD,**
**K.SUBBA RAO**
**ADVOCATES FOR PLAINTIFF**
**Plot No.135/5, Street No.5, M.J.Colony, Gayatri Nagar, Moula Ali, Hyderabad-500 040**
**Email: mvsprasad.advocate@gmail.com**



**IN THE COURT OF THE HON'BLE X JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURT AT: HYDERABAD.**
**O.S. NO 2065 OF 2026**

***Between:***
1. Milan Kumar Sheth S/o Saubhagyachand Sheth Aged 67 years Occ; Business R/o Flat No. 603/604, Pritam Apartments, H. No. 3-6-755,Street No. 13, Himayat Nagar, Hyderabad, T. S.
2. Nirav Yogesh Shah S/o Yogesh Mugatlal Shah Aged 46 years Occ; Business Both 2 and 3 R/o Building No. 6, Block No. 60 11th Floor, Navjeevan Society, Lamington Road, Mumbai Central (Mah.)
**.... Plaintiff/s**
**AND**
1. The M.R.O Himayatnagar
2. All Concerned
**...Defendants**

To
All Concerned
Please take notice that the plaintiff has filed the above O.S.No.2065 of 2026 for declaration as legal heir of deceased Late Jayawati Sheth W/o late Saubhagyachand Sheth before the Hon'ble X Junior Civil Judge, City Civil Court At: Hyderabad The said O.S.No.2062 of 2026 is stand posted to 25-08-2026 for your appearance, notice and counter if any.. If you fails to appear before the Hon'ble Court that day the matter shall be decided in your absence. This is for your information

***[By order of the court]***

***sd/-***
**M.K.Sharma**
**Harsh Raj Purohit**
**Pramodh Gondhle**
**Yash Chowdhary**
**Advocates,**
**4-4-834, Sultan Bazar, Hyderabad.**
**9490935534,7702511704**



**IN THE COURT OF THE HON'BLE XXVII ADDL. CHIEF JUDGE, CITY CIVIL COURT, AT :SECUNDERABAD**
**G.W.O.P No. 05 OF 2026**

Between:-
**1. M. Sangeetha,** W/o. Late M. Ravi, aged about 36 years, Occ: House wife,
**2. M. Vamshika,** D/o. Late M. Ravi, aged about : 8 years, Occ: Student,
Both are R/o. H. No. 10-36, Mary Matha Temple backside, Yapral, Alwal, Medchal-malkajgiri District, T.S.- 500087. [The present suit is filed in the interest of minor entitled share over petition schedule property] ...Petitioners

**A N D**

**All Concerned** ...Respondents

**Whereas**, the Petitioner has filed the above suit against Defendant seeking to declare the petitioner as guardian of the minor daughter M. Vamshika and to grant permission for the sale of entitled share of the minor daughter over Petition schedule property i.e., House bearing No.147, admeasuring 42.33 Sq. Yards or 35.38 Sq. Meters, situated at Mudfort, Secunderabad and the same is posted to **12-08-2026.** The **"ALL CONCERN"** is therefore directed to appear before the above court either in person or through your pleader with your defense if any at 10.30 AM on the above said date, failing which the above suit will be heard and determined ex-parte.

**//BY ORDER OF THE HON'BLE COURT//**

**M/S. N.S. CHAITANYA**
**K. RAVI KANTH,**
**V. SREENIVASULU**
**ADVOCATES & ASSOCIATES**
O/o Flat No. 203, 2nd Floor, D. No. 1-424-426, Sai Plaza, above Union Bank of India, Mettuguda, Secunderabad-17.
**M. No. 8712242942.**
Counsel for the Petitioner



**IN THE COURT OF THE HON'BLE XXVII ADDL. CHIEF JUDGE, CITY CIVIL COURT, AT :SECUNDERABAD**
**G.W.O.P No. 05 OF 2026**

Between:-
**1. M. Sangeetha,** W/o. Late M. Ravi, aged about 36 years, Occ: House wife,
**2. M. Vamshika,** D/o. Late M. Ravi, aged about : 8 years, Occ: Student,
Both are R/o. H. No. 10-36, Mary Matha Temple backside, Yapral, Alwal, Medchal-malkajgiri District, T.S.- 500087. [The present suit is filed in the interest of minor entitled share over petition schedule property] ...Petitioners

**A N D**

**All Concerned** ...Respondents

**Whereas**, the Petitioner has filed the above suit against Defendant seeking to declare the petitioner as guardian of the minor daughter M. Vamshika and to grant permission for the sale of entitled share of the minor daughter over Petition schedule property i.e., House bearing No.147, admeasuring 42.33 Sq. Yards or 35.38 Sq. Meters, situated at Mudfort, Secunderabad and the same is posted to **12-08-2026.** The **"ALL CONCERN"** is therefore directed to appear before the above court either in person or through your pleader with your defense if any at 10.30 AM on the above said date, failing which the above suit will be heard and determined ex-parte.

**//BY ORDER OF THE HON'BLE COURT//**

**M/S. N.S. CHAITANYA**
**K. RAVI KANTH,**
**V. SREENIVASULU**
**ADVOCATES & ASSOCIATES**
O/o Flat No. 203, 2nd Floor, D. No. 1-424-426, Sai Plaza, above Union Bank of India, Mettuguda, Secunderabad-17.
**M. No. 8712242942.**
Counsel for the Petitioner



**IN THE COURT OF THE HON'BLE III ADDL. CHIEF JUDGE CITY CIVIL COURT, AT HYDERABAD**
**MVOP.NO. 865 OF 2025**

***Between:***
Smt. Nanavath Shanthi
**.... Plaintiff/s**
**AND**
A.N. Sanitation, and others
**...Defendants**

To
1. A.N. Sanitation, rep. by its owner Amit Kumar S/o. Lakshmeshwer Roy, Aged: 40 years, Occ: Owner of Vehicle Br. No. TS08 HK 4141, R/o. Afcons Prestige Apartments, Plot No. 68 & 69, Padmanagar colony, Phase-I, Near Venkateshwara Temple, Chinthal, Jeedimetla, Post HMT Township, Hyderabad, Telangana, Pin No.500054.
**...Respondents 1**
2. Dhaneshwar Kumar S/o. Ravindra Ram Aged: 29 years, Occ: Driver of Vehicle Br. No. TS08 HK 4141, R/o. Afcons Prestige Apartments, Plot No. 68 & 69, Padmanagar colony, Phase-I, Near Venkateshwara Temple, Chinthal, Jeedimetla, Post HMT Township, Hyderabad, Telangana, Pin No.500054.
**...Respondent No.3 Contd...2...**

Please take notice that the above named Petitioners have filed above MVOP on the file of III Addl. Chief Judge, C.C.C., Hyderabad, against you and another for claiming compensation for the death of the deceased Smt. Nanavath Shanthi W/o. Nanavath Hemanth Kumar, in road accident caused by the driver of Vehicle Br. No. TS08 HK 4141. The Hon'ble court was pleased to posted the above case to 14-08-2026 for your appearance. Therefore, you are hereby requested to appear before the above said court on 14-08-2026 at 10.30 a.m. either in person or through an advocate duly instructed and file your counter if any. Failing which the matter will be heard in your absence.

***[BY THE ORDER OF COURT]***
***sd/-***
**Mr. P. NARASIMHA,**
**Advocate**
**Cell No.9100085959 Residence-cum-Office: H.No.13-68/A/1 Plot No.68, Road No.6, CMR colony, Almasguda village, Balapur Mandal, R.R.District, Hyderabad, T.S. Pin: No.500058.**




## ప్రతిఘటనే అసలైన మార్గం

"అమెరికా, ఇజ్రాయిల్‌ను ఎదుర్కోవాలంటే ప్రతిఘటన తప్ప వేరే మార్గం లేదు. లెబనాన్‌లో ఇజ్రాయిల్ సైనిక చర్య ఆగినప్పుడే అమెరికాతో ఇరాన్ సంఘర్షణ ముగుస్తుంది. అమెరికా నిరంకుశత్వం, అణచివేత ధోరణితో ప్రపంచదేశాలన్నీ విసిగిపోయాయి. దాని ఆగడాలను అరికట్టాలంటే ప్రతిఘటన, పోరాటాలే మార్గం. అందుకే హెజ్‌బొల్లా సెక్రటరీ జనరల్ షేక్ నయీమ్, ఆ సంస్థ సభ్యులనుద్దేశించి ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. దాన్ని వ్యూహాత్మకంగా అమలు చేయాలని ఆయన కోరారు. ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్‌కు విధేయులుగా ఉంటామంటూ హెజిబుల్లా ఒక లేఖను కూడా విడుదల చేశారు. దాన్ని నేను పూర్తిగా సమర్థిస్తున్నా."

–మొజ్తబా ఖమేనీ, ఇరాన్ సుప్రీం లీడర్

## వేమన పద్యం

**అన్నిదానములను నన్నదానమె**
**గొప్పకన్న తల్లికంటె ఘనములేదు**
**ఎన్న గురునికన్న నెక్కుడులేద**
**యావిశ్వదాభిరామ! వినురవేమ!**



## సంపాదకీయం

# నిరసనల నిప్పురవ్వ

వెలుగుతున్న ఆశ ఒకవైపు, కొనసాగుతున్న అల్పత్వము మరోవైపు. నేడు దేశ కదలికను గమనిస్తుంటే భవిష్యత్తు పట్ల ఆశలు చిగురిస్తున్నాయి. ఏం చేయలేమనే నిరాశ నుంచి ఏదైనా చేయగలమనే ధైర్యం నిండుతోంది. మాకిక తిరుగులేదనుకున్నవారికి తలలు తిరిగేట్టు జరగటం చూస్తుంటే సామాజిక శాస్త్రవేత్తలు చెప్పిన విషయాలు, సిదాంతాలు ఎంత వాస్తవికమైనవో అర్థమవుతున్నది. నిరసనల నిప్పురవ్వ అంటుకుంటే ఎంత దావానలమై ముంచెత్తుతుందో స్పష్టపరిచింది నేటి యువత తిరుగుబాటు. గత 38 రోజులుగా ఢిల్లీ జంతర్ మంతర్‌లో నిరవధికంగా జరుగుతున్న నిరసన అత్యంత పదునైన దీక్షతో కొనసాగటం అనేకమంది రాజకీయ నాయకులను, సామాజిక కార్యకర్తలను, సాధారణ ప్రజలను ఆశ్చర్యపరుస్తున్నది. నిర్మాణ రూపమే లేని ఒక సోషల్ మీడియా 'కాక్రోచ్' యువత, ఇంత నిబద్ధంగా, పట్టుదలతో,క్రమశిక్షణతో ఉద్యమాన్ని నిర్మించడం చూస్తే, ఎక్కడ అణచివేత, దోపిడీ వేదన ఉంటుందో అక్కడ తిరుగుబాటు తప్పదన్న సత్యం రుజువు తున్నది. నిర్మాణాత్మక వామపక్ష విద్యార్థి ఉద్యమమూ తోడుగా చేరటము మరింత పదునుతేరుతున్నది. ఇదో శుభపరిణామం. "పదిమంది ఉక్కు గుండెలుగల యువకులను నాకివ్వండి, నేను ఈ దేశాన్ని మార్చివేస్తాను" అని స్వామి వివేకానంద చెప్పిన మాటలు ఈ సన్నివేశాన్ని చూస్తే ఎంతో నిజమని అర్థమవుతున్నది.నిరసన చాలా సామాన్యంగానే ప్రారంభమ యింది. ప్రభుత్వమూ పెదగా పట్టించుకోకుండా తేలికగానే చూసింది. జూలై ఇరవై తర్వాత నిరసన ఉద్యమ రూపం అందుకుంది. దేశవ్యాప్తంగా యువత కదం తొక్కింది.బీజేపీ తిరుగులేని ఆధిపత్యం వహిస్తున్న రాష్ట్రాల నుంచి అన్ని ప్రాంతాలలోనూ ప్రశ్నతో, నినాదంతో మార్మోగింది. ఇక్కడేకాదు, దేశం వెలుపల, అనేక దేశాలలో యువత మద్దతును ఈ ఉద్యమం పొందింది. అప్పటిగానీ అయ్యావార్లకు అర్థంకాలేదు. ఎన్ని ఆటంకాలు ఎగదోసింది ప్రభుత్వం! ఎంత దుష్ప్రచారం మొదలైంది. ఎంత దారుణంగా క్రూరంగా అణచివేయటానికి పూనుకొంది. రక్తం పారించింది. తలలు పగలగొట్టింది. చేతులు, కాళ్లు విరగగొట్టింది. రబ్బరు బుల్లెట్లు, టియర్ గ్యాస్ లు, ముండ్ల కంచెలు, దేశద్రోహ కేసులు, నిర్దాక్షిణ్య నిర్బంధాలు అన్నీ ఉపయోగించింది. ఇంకోవైపు నైతికతను దెబ్బతీస్తూ, విదేశీయుల సహకారంతో, మద్దతుతో నడుస్తోందని, సంఘవిద్రోహ శక్తులని, దేశ సమగ్రతను, శాంతిని విచ్ఛిన్నం చేసే కుట్ర జరుగుతోందని, దొంగ దీక్షలు చేస్తున్నారని ఒక నీచ ప్రచారము చేసింది. నీళ్లను బంద్ చేసింది.
కరెంటునూ, ఇంటర్నెట్ నూ, రహదారులను, మెట్రో స్టేషన్లను బంద్ పెట్టి నిలిపివేసింది.ఇన్ని చేసినా, ఇంత విధ్వంసం ఒక రాజ్యం చేస్తున్నా... నిలకడగా నిబ్బరంగా వీటన్నింటినీ ఎదుర్కొని ఇన్ని రోజులుగా పోరాటం కొనసాగటం చరిత్రలో నిలిచిపోయే మహా సంఘటన. ఇది ఒక పరీక్ష పేపర్ లీకేజీ సమస్యే కాదు, విద్యావ్యవస్థ మొత్తం ప్రయివేటు, కార్పొరేట్ల చేతుల్లోకి పోవడం, పర్యవసానంగా వ్యాపారం, లాభాలు మాత్రమే లక్ష్యంగా మారింది. నిరుద్యోగం, పరిశ్రమల మూత, గ్రామీణ ప్రజల ఆదాయాల కోత, ధరల పెరుగుదల, హక్కుల అణచివేత అన్నిటి ప్రభావాల ప్రతిఫలనం ఈ ప్రతిఘటన. ప్రశ్నించినవాళ్లను , న్యాయం అడిగినవాళ్లను దేశద్రోహులుగా చూస్తూన్న ప్రభుత్వ నియంతృత్వ పోకడపై వెల్లువెత్తిన ఆగ్రహం ఇది. ముప్పయి రోజుల తర్వాత, యువత దేశానికి అతి ముఖ్యమైన శక్తి అని, వారి సమస్య దేశపు సమస్య అని ప్రధాని మాట్లాడటం సిగ్గులేనితనం. ఇన్ని ఆటంకాలు పెట్టింది ఎవరు? అప్పుడు ఏమైంది ఈ ఆలోచన.

వాళ్లు దేశద్రోహులని కూడా నిందలు వేశారు? మాట మారిందా! గుండె జారిందా! ఇక మన మోడీగారి అల్పత్వం గురించి ఒక సారి పరిశీలించండి.మొన్న అర్ధరాత్రి ఒక వీడియో చేసి పెట్టారాయన. ఏమని, యువత భవిత కన్నా ముఖ్యమైన అంశం లేదని పెట్టిన వీడియోకు అపార స్పందన వచ్చిందని థాంక్యూ ఫ్రెండ్స్ అని కృతజ్ఞతలు చెప్పారు. ఎంత అల్పత్వం! ఇప్పటికీ తెలంగాణలోని వారి పార్టీ నాయకులు, ఆ ఉద్యమాన్ని, యువతను కించచపరుస్తూ, దేశాన్ని విచ్ఛిన్నం చేయడానికి విదేశీ శక్తుల సహకారంతో చేస్తున్న ఉద్యమమని ఆరోపణలు ఒకవైపు చేస్తూనే ఉన్నారు. ఇది కదా ద్వంద్వ విధానం, కుట్రపూరిత ప్రవర్తన. ఇంకా మోడీగారు మంత్రిమండలి సమావేశంలో బోధన చేస్తూ, మంత్రులు ఇన్‌స్టాగ్రామ్ లో యువతతో సంబంధంలో ఉండాలనీ, రీల్స్ చేయాలనీ, సోషల్ మీడియాలో ప్రచారంలో ఉండమని కోరుతున్నాడు. అక్కడ పిల్లలు ఆందోళనలో ఉంటే పరిష్కారం కోసం ఆలోచన లేదు. ప్రచారం కావాలి ఆయనకు. గ్రాఫ్ పడిపోతున్నదని బెంబెలెత్తిపోతున్నారు గానీ అసలు విషయం మీద ఆసక్తి లేదు. అదీ మన పాలకుల అల్పత్వం!

## రచనలు పంపండి



వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.

voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

## విలువల ఎడారి

అంతరిక్షానికి
దూసుకుపోతూ...
ఆకాశాన్నంటే భవనాలు
కడుతూ...
అభివృద్ధి చెందానని
మురిసే ఓ మనిషీ!
నీలో శిథిలమయ్యే
మనిషితనం చూడు.

ఒకనాడు...
తల్లి ఒడి విలువలకు తొలి
బడియై,
తండ్రి నడక జీవితపు
పాఠ్యపుస్తకమై,
అక్షరాలు నేర్చి
ఎదుగుతూ...
మనసులను చదవడం
మరిచావా?

ఇప్పుడు...
అరచేతిలోని నీలితెరే
గురువై,
బతుకులో అంధకారాన్ని
నింపుతోంది.

పుస్తకాల మధ్య
పెరిగినా...
మదిలో మనిషితనం
మొలకెత్తని
విలువల ఎడారివైనావు!

మార్కుల మెట్లపై
ఎదుగుతున్న...
ఓ ర్యాంకుల వేటగాడా!
విలువల వేరు
ఎండుతున్న...
నీ ఎదుగుదల ఏ
పతనానికి నాంది?

చీమల క్రమశిక్షణ, నదుల
పట్టుదల,
చెట్ల నిస్వార్థం, నేల
సహనం...
ప్రకృతి పాఠంగా
నేర్వలేదా?

నిజాయితీ నవ్వులపాలై,
మోసానిది పైచేయై...
ఓడిపోతోంది
మానవత్వం!

చట్టాలెన్ని వచ్చినా...
మేల్కొనని మనస్సాక్షి,
నేరాలకు మూలబీజం.

పుస్తకాలలో చదివేవి కావు
విలువలు...
తల్లి కళ్లలో, పెద్దల
నడకలో...
గురువుల మాటలో,
సమాజపు స్పందనలో...
మొలిచే జీవబీజాలు
ఎండిన నాడు...
మిగిలేది మనుషుల
గుంపే...
మనిషి కాదు!



డా. ఆవుల రేణుక
9398268976

# ప్రజల దృష్టిని మరల్చే పన్నాగం

ఇండియాలో హిందూ రాజ్యాన్ని ('హిందూ రాష్ట్ర') స్థాపించడం రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆరెస్సెస్) లక్ష్యం. అయితే ఈ హిందూ రాజ్యం అంటే ఏమిటి? ప్రస్తుతం పౌరులందరికీ, వారి వారి మత విశ్వాసాలతో నిమిత్తం లేకుండా సమానత్వాన్ని గ్యారంటీ చేస్తోంది రాజ్యాంగం. దానికి బదులు, హిందువులకు ఎక్కువ స్థాయిని కల్పిస్తూ తక్కిన మతాల ప్రజలకు తక్కువ స్థాయిని కల్పించేదే హిందూ రాజ్యం అని వెంటనే సమాధానం వస్తుంది. ముఖ్యంగా ఆ హిందూ రాజ్యంలో దేశంలో అధిక సంఖ్యలో ఉన్న మైనారిటీలు 'ముస్లింలు' హిందువులకన్నా దిగువ స్థాయిలో ఉంటారు. ప్రత్యేకమైన అణచివేత స్వభావం కలిగిన రాజ్య వ్యవస్థ లేకుండా ఇటువంటి అసమానతను ఆచరించడం సాధ్యం కాదు. నిజానికి వర్ణాధిపత్యం చెలాయించే సమాజాలన్నీ అణచివేత స్వభావంతోనే ఉంటాయి. కాని ఇలా అసమానతను వ్యవస్థీకతం చేసే రాజ్యం కొనసాగా లంటే అందులో అణచివేత స్వభావం మరింత ప్రత్యేకమైన తీవ్రత కలిగి వుండాలి. అటువంటి హిందూ రాజ్యం అంటే హిందువు లందరూ తక్కిన మతాల ప్రజల మీద నియంతత్వాన్ని ఉమ్మడిగా చెలాయించే వీలుంటుందా?ఈ ప్రశ్నకు వెంటనే సమాధానం 'ఉండదు' అనే వస్తుంది. ఒక రిక్షా కార్మికుడు, అతడి మతం ఏదైనప్పటికీ, హిందూ రాజ్యంలో కూడా రిక్షా కార్మికుడిగానే కొనసాగుతాడు. ఒక ప్యూన్ హిందూ రాజ్యంలో కూడా ప్యూన్‌గానే ఉంటాడు, అతడు హిందువైనా, ముస్లిం అయినా. ఒక గిగ్ వర్కర్ అదే విధంగా గిగ్ వర్కర్ గానే ఉంటాడు. ఈ 'హిందూ రాజ్యం' అన్నది మెజారిటీ హిందువుల భౌతిక, వాస్తవ జీవిత పరిస్థితులను ఏ విధంగానూ మార్చదు. మరి, అటువంటప్పుడు, ఈ తరహా నియంతృత్వ స్వభావంతో ఉండే రాజ్యం ఎవరి ప్రయోజనాల కోసం నియంతృత్వాన్ని చెలాయిస్తుంది? గుత్త పెట్టుబడిదారీవర్గ ప్రయోజనాల కోసమన్న సమాధానం వెంటనే స్ఫురిస్తుంది. హిందూ రాజ్యం అంటే, దాని పేరు సూచించే విధంగా కాకుండా, వాస్తవానికి గుత్తపెట్టుబడిదారీ వర్గ నియంతత్వమే.హిందూ రాజ్యంలో హిందూ మత ఆచారాలను, సాంప్రదాయాలను అధికారిక కార్యక్రమాల సందర్భంగా పాటించడం జరుగుతుంది. ఉద్యోగాల ఎంపికలో తక్కిన మతాల వారికన్నా హిందువలకు ఇప్పటికన్నా ఎక్కువ ప్రాధాన్యతని స్తారు. అయితే, ఇప్పుడు కొత్త ఉద్యోగాలేవీ లేనట్టే, హిందూ రాజ్యంలో కూడా అదనంగా, కొత్త ఉద్యోగాలు ఏవీ ఉండవు. నిజానికి ఇప్పటికన్నా ఎక్కువ మోతాదులో ఉన్న ఉద్యోగాలు అదృశ్యమై పోతాయి. ఎందుకంటే కార్పొరేట్లు ఎ.ఐ ని ప్రవేశపెడుతున్నారు. ముస్లింలు, ఇతర మైనారిటీలు బహు విధాలుగా తీవ్రమైన అణచివేతను ఎదుర్కొనవలసి వస్తుంది. అదే సమయంలో హిందువుల మీద ప్రస్తుతం సాగుతున్న అణచివేత నుంచి వారికి ఎటువంటి ఊరటా లభించదు. గుత్త పెట్టుబడిదారీ వర్గం బ్రహ్మాండంగా బలపడుతుంది. వాళ్లలో కూడా ఒక కొత్త గ్రూపు మరింత ఎక్కువ బలపడుతుంది. అంటే హిందూ రాజ్యంలో భారతీయ బడా కార్పొరేట్ల పెత్తనం బాగా పెరుగుతుంది. అందులో అదానీ, అంబానీల పెత్తనం మరింత ఎక్కువ బలపడుతుంది.ఇది 1930ల నాటి జర్మనీ పరిస్థితిని తలపిస్తోంది. ఆర్యేతర ప్రజా సమూహాలను అణచివేయడం ద్వారా 'ఆర్య జాతి ఆధిక్యత'ను స్థాపించడం తమ లక్ష్యం అని నాజీలు ప్రకటించారు. వాళ్ళ దష్టిలో అక్కడ ఉండే యూదులు, జిప్సీలు (సంచార జాతులు) ఆర్య జాతికి చెంది వుండే అవకాశమే లేదు! అయితే, అక్కడ వాస్తవానికి ఏర్పడిన ఆర్య రాజ్యం స్వభావం ఏమిటి? అది "అత్యంత ప్రతీఘాత స్వభావం కలిగిన, అత్యంత విద్వేషపూరితమైన, ఫైనాన్స్ పెట్టుబడిలోని అత్యంత సామ్రాజ్యవాద దురాక్రమణ కాంక్ష కలిగిన శక్తులు బహిరంగ భయోత్పాత చర్యలతో చెలాయించే నియంతృత్వం" అని జార్జి డిమిట్రోవ్ అన్నాడు. 1935లో జరిగిన కమ్యూనిస్ట్ ఇంటర్నేషనల్ ఏడో మహాసభలో దాని అధ్యక్షుడిగా ఆయనపై నిర్వచనాన్ని ప్రతిపాదించాడు.రాజ్య వ్యవస్థ మీద పెత్తనం చేసే శక్తులు తమ రాజ్యాన్ని ఏ విధంగా వర్ణిస్తాయో, ఆ విధంగా వాస్తవానికి ఆ రాజ్య వ్యవస్థ వ్యవహరించదు. ఆ రాజ్యాన్ని అడ్డం పెట్టుకుని ఏ వర్గం తన స్వంత ప్రయోజనాలను నెరవేర్చు కోజూస్తోంది అన్నది ఇక్కడ ప్రశ్న. ఇక్కడే కాదు, వర్తమాన ప్రపంచంలో మైనారిటీలుగా ఉండే జాతులనో, మైనారిటీ మతాల వారినో, మైనారిటీ భాషల ప్రజలనో తాము లక్ష్యంగా చేసుకుని వ్యవహరిస్తున్నామని, వారిని రెండవ తరగతి పౌరులుగా పరిగణిస్తామని చెప్పుకునే ఏ రాజ్యంలోనైనా, నిజానికి వాళ్లు గుత్త పెట్టుబడిదారీ వర్గ ప్రయోజనాలను మాత్రమే నెర వేరుస్తున్నారు.
రాజ్య వ్యవస్థ ఇప్పటిదాకా కొనసాగిన రూపం తీవ్రమైన సవాలును ఎదుర్కొ న్నప్పుడే, అలా కొనసాగడం కష్టతరమౌతున్న ప్పుడే, ఇటువంటి ఒక కొత్త రూపంలో నియంతత్వాన్ని తీసుకురావలసిన అవశ్యకత కలుగుతుంది. ఇప్పుడు ఆర్థిక వ్యవస్థ మాంద్యంలో చిక్కుకుపోతోంది. నిరుద్యోగం విపరీ తంగా పెరుగుతోంది. ఈ మాంద్యానికి కారణం గుత్త పెట్టుబడిదారీ వర్గ ఆధిపత్యంలో రాజ్యం అమలు చేసిన నయా ఉదారవాద విధానాలే. ఆ విధానాలు ఇదే మాదిరిగా ఇక ముందు కొనసాగడం సాధ్యం కావడం లేదు. ముందు దారి మూసుకుపోయింది. పైగా ఆ విధానాల వల్లే నిరుద్యోగం విపరీతంగా పెరిగిపోయింది. అత్యధిక ప్రజానీకం దుర్భరమై పేదరికంలో కూరుకుపోతున్నారు.శ్రామిక ప్రజలు ప్రతిఘటించడానికి, పోరాడడానికి ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎక్కువ అవకాశం ఉంటుంది. అందుకనే సంక్షోభ పరిస్థితి తలెత్తినప్పుడు పాలకవర్గాలు ప్రజాస్వామ్యాన్ని కుదించివేయడానికి ప్రయత్ని స్తాయి. తద్వారా గుత్త పెట్టుబడిదారీ ఆధిపత్యం నిలబెట్టుకోడానికి చూస్తాయి. అయితే, ఆ సంక్షోభం దీర్ఘకాలంగా కొనసాగుతున్నప్పుడు, తన ఆధిపత్యానికి ముప్పు పెరుగుతున్నప్పుడు, గుత్త పెట్టుబడిదారీ వర్గం మరింత తీవ్ర చర్యలకు పూనుకుంటుంది. ప్రజానీకాన్ని చీల్చి బలహీన పరచడంలో ఎక్కువ సామర్థ్యంగల శక్తులతో అది జత కడుతుంది. తద్వారా ప్రజల మధ్య చర్చను పక్కదోవలకు మళ్లిస్తుంది. శ్రామిక ప్రజానీకం ఐక్యంగా ప్రతిఘటనకు పూనుకుంటున్నప్పుడు 'హిందూ రాజ్య స్థాపన' పేరుతో విద్వేషపూరిత భావనను ముందుకు తెస్తుంది.ఇప్పుడు ఆరెస్సెస్ 'బీజేపీ ముందుకు తెస్తున్న చర్చ ప్రజానీకపు దృష్టిని ఏ విధంగా పక్కదోవ పట్టిస్తున్నదీ మనకు స్పష్టంగా తెలుస్తూనే వుంది. దేశంలోని శ్రామిక ప్రజలు, ముఖ్యంగా యువత నిరుద్యోగంతో కుంగిపోతున్నప్పుడు, అందునా చదువుకున్న వారిలో నిరుద్యోగం మరీ ఎక్కువగా ఉన్నప్పుడు, ఈ తీవ్ర సమస్య గురించి పాలకులు ఒక్క ముక్క కూడా మాట్లా డడం లేదు. కాని బంగ్లాదేశ్ నుండి 'చొరబాటు దారులు' వచ్చేస్తున్నారంటూ గొంతులు చించుకుంటున్నారు.ఒకానొక దేశపు జీడీపీ వృద్ధి అనేదే ఆ దేశ పురోగతికి ప్రమాణం అని బీజేపీ వాదిస్తూ వుంటుంది. ఆ ప్రకారమే చూసినప్పుడు బంగ్లాదేశ్‌లో తలసరి ఆదాయం భారతదేశపు తలసరి ఆదాయం కన్నా ఎక్కువగా ఉందని ఐఎంఎఫ్ వెల్లడించింది. ఎక్కువ ఆదాయం వచ్చే బంగ్లాదేశ్‌ను వదిలిపెట్టి ప్రజలు తక్కువ ఆదాయం వచ్చే ఇండియాలోకి ఎందుకు 'చొరబడు తున్నారో' బీజేపీ వివరించగలదా? ఇండియాలో హిందూత్వ శక్తులు ఎందుకు ముందుకు తోసుకు వస్తున్నాయో వివరించడానికి ఉదారవాద మేథావులు చాలా ప్రయత్నాలైతే చేస్తున్నారు. కాని ఈ హిందూత్వ అనేది ప్రపంచవ్యాప్తంగా నయా ఫాసిజం పెరుగుతున్న క్రమంలో అంతర్భాగ మేనన్న వాస్తవాన్ని వాళ్లు గుర్తించడం లేదు. ఇదేదో కేవలం ఇండియాకు సంబంధించినదే అనుకుంటున్నం తవరకూ దీని స్వభావం అర్థం కాదు. గుత్త పెట్టుబడిదారీ వర్గం నయా ఫాసిస్టు శక్తులకు ఆర్థికంగా, మీడియా పరంగా పూర్తి తోడ్పాటు అందిస్తున్నాయి.



ఈ విధంగా పెట్టుబడిదారీ ప్రపంచంలో చాలా దేశాల్లో సాగుతోంది. అర్జెంటినా, అమెరికా, ఇటలీ, ఫ్రాన్స్, జర్మనీ, బ్రిటన్ వంటి దేశాలలో ఇది చూస్తున్నాం. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ముందు దారి లేకుండా మూసుకుపోయే దశకు నెట్టిన నయా ఉదారవాద పెట్టుబడిదారీ విధానమే దీనికి కారణం.ఈ మధ్యనే ఆరెస్సెస్ వందేళ్ల ఉత్సవాలను జరుపుకుంది. గత వందేళ్లుగా అది అధికారానికి చేరువగా ఎన్నడూ లేదు. ఇప్పుడు ఒక్కసారి అది "ప్రపంచంలోనే అత్యంత ధనవంతమైన రాజకీయ పార్టీ" తమ వద్ద ఉందని చెప్పుకుంటోంది. దీనికి కారణం గుత్త పెట్టుబడిదారీ వర్గం నుంచి ప్రస్తుతం దానికి బ్రహ్మాండమైన స్థాయిలో మద్దతు అందుతూ వుండడమే.గుత్త పెట్టుబడిదారీ వర్గం హిందూత్వ పట్ల అంతకు ముందు ఉండిన వైఖరిని మార్చుకుని దానితో జత కట్టడం అన్నది మాత్రమే కాదు మనం చూడవలసినది. ఇక్కడ హిందూత్వ శక్తులు కూడా గుత్త పెట్టుబడిదారీ వర్గం పట్ల తమ వైఖరిని మార్చుకున్నాయి. కాని, దానికి ప్రధానమైన మద్దతు సాంప్రదాయంగా చిన్న వ్యాపార వర్గాల వారి నుంచి, చిన్న పెట్టుబడిదారుల నుంచి, పట్టణ మధ్యతరగతి నుంచి లభించేది. ఆరెస్సెస్ ఎన్నడూ గుత్త పెట్టుబడిదారీ వర్గానికి వ్యతిరేకంగా మాట్లాడలేదు. అలాగని అది ప్రత్యేకంగా గుత్త పెట్టుబడిదారీ వర్గం కోసం కూడా గతంలో మాట్లాడినది లేదు. అయితే ఆర్థిక విధానాల మీద చర్చ అన్నది హిందూత్వ శక్తులకు ఎప్పుడూ అంత ప్రధానంగా లేదు. జర్మనీలో నాజీలు అధికారంలోకి వచ్చే వరకూ గుత్త పెట్టుబడిదారీ వర్గాన్ని వ్యతిరేకిస్తూ మాట్లాడేవారు. అధికారం వచ్చాక వారి తీరు మారింది. అచ్చంగా అలాగే కాకపోయినా ఇక్కడ హిందూత్వ శక్తుల వైఖరిలో కూడా అటువంటి మార్పే

# రగిలే ఆగ్రహానికి దిశా నిర్దేశం



చరిత్రలో కొన్ని సమయాలు శరవేగంతో పరుగులు పెడతాయి. మన ప్రజలు ఇంకా ఎందుకు కోపంతో రగిలిపోవడం లేదనే సందేహం చాలామంది భారతీయులలో వుండేది. అధికార వర్గం, చట్టసభలు ఆఖరుకు న్యాయ వ్యవస్థ కూడా కట్టగట్టుకు కలగలసి పోయాయనిపించే... దాదాపు బ్రిటిష్ వలస పాలన పునరావృతం అవుతున్నదేమో అనిపించే పరిస్థితులలో... ఈ పరిణామాలు వారికి ఉపశమనం కలిగించుతాయి. స్వాతంత్ర్య పోరాటం, ఆ త్యాగాలు, ప్రజా స్వామ్య, లౌకిక రాజ్యాంగం అన్నీ తీవ్ర ఒత్తిడికి గురవుతున్నాయి. జులై 20న పార్లమెంటుకు నిరసన యాత్ర జరపాలని కాక్రోచ్ జనతా పార్టీ (సి.జె.పి) పిలుపునిచ్చింది. అయితే ఆచరణలో అది సంఘటిత ఆకస్మిక విద్యార్థి ఉద్యమాల సంగమంగా మారిపోయి దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. మేం ఇదివరకు చెప్పినట్టుగా సైబర్ స్పేస్‌లో సిజెపి ఉప్పెనలా పెరగడం చాలా మందిని ఆశ్చర్యపరచింది. జాతీయ విద్యా విధానం (ఎన్.ఇ.పి) 2020 నుంచి నేరుగా ముందుకొచ్చిన కేంద్రీకృత పరీక్షలు, ప్రవేశాల విధానం వల్ల ఆ పరీక్షలు నేరుగా నేషనల్ టెస్టింగ్ ఏజన్సీ (ఎన్.టి.ఎ) ఆధ్వర్యంలోనే రిగ్గింగు చేయబడే పరిస్థితి దాపురించింది. మన మొత్తం విద్యా వ్యవస్థను ఆరెస్సెస్ కార్పొరేట్ నియంత్రణలోకి అప్పగించే ఒక ముసుగు తప్ప ఎన్ఇపి మరేమీ కాదనేది ఇప్పుడు సుస్పష్టం. వినాశకరమైన జాతీయ పరీక్షా విధానం దీన్ని ఒక కొలిక్కి తెచ్చిన చివరి సాధనమైంది. దాని ఫలితంగా వచ్చిన విషమ పరిస్థితులు, ఆశావహులైన విద్యార్థుల బలవంతపు ఆత్మహత్యలు దేశం మనసును వికలం చేశాయి.ఈ మొత్తం వైఫల్యం ఎంత తీవ్ర ప్రభావం చూపిందంటే చివరకు ప్రభుత్వం, విద్యా మంత్రిత్వశాఖ మళ్లీ పరీక్ష పెట్టడానికి అంగీకరించవలసి వచ్చింది. కానీ ఈ విషయంలో కించిత్తు బాధ్యత కూడా తీసుకున్న దాఖలాలు లేవు. ఈ విషయంలో తర్కబద్ధంగా ముందు కొచ్చే కనీస కోర్కెలు విద్యామంత్రి రాజీనామా, ఎన్‌టిఎ రద్దు. కానీ కార్పొరేట్, ఆరెస్సెస్ దుష్ట ద్వయం నరేంద్ర మోడీ సర్కారును సాధనంగా చేసుకొని జవాబుదారీ తనం ఊసే వుండకూడదనేది తమ తాత్వికతగా మార్చాయి. కుట్ర పూరిత నిశ్శబ్దం వహించాయి. మోడీ స్వయంగా పరీక్షలకు పర్యవేక్షణ చేయడం, భారత వైమానిక దళం (ఐ.ఎ.ఎఫ్) ద్వారా ప్రశ్నాపత్రాలు పంపడం వంటి విడ్డూరపు ఆలోచనలు బిగ్గరగా వినిపించాయి.దావానలంలా వ్యాప్తి ప్రశ్నలు వేసిన వారూ నిరసనలు తెల్పిన వారూ అందరూ బొద్దింకలని భారత ప్రధాన న్యాయమూర్తి చేసిన వ్యాఖ్యలు బహుశా ఇందుకు ఆఖరి ప్రేరణ అయ్యాయి. బొద్దింకల పార్టీ అనే భావన దావానలంలా శరవేగంగా వ్యాపించింది. అందువల్లనే సైబర్ స్పేస్‌లో సిజెపి వేగంగా వ్యాపించిన తీరు వాస్తవంలో ఎప్పటికీ నిజం కాదని కొందరు భావించారు. అయితే బొద్దింకల పార్టీ అనేది సమిష్టి ఆగ్రహానికి ఒక ప్రతిరూపమనీ, విస్ఫోటనం చెందేందుకు మార్గాల కోసం నిరీక్షిస్తున్నదనీ గుర్తించడంలో వారు విఫలమైనారు. జవాబుదారీ తనాన్ని పున:ప్రతిష్ఠించడమే దాని లక్ష్యం. అందరికన్నా ఘోరంగా దెబ్బతిన్న భారతీయ యువత ఆగ్రహం ఒక్కసారిగా బద్దలవడం తప్ప మరో గత్యంతరం లేని స్థితికి నెట్టబడ్డారనే దానిపై రెండు అభిప్రాయాలకు అవకాశమే లేదు.ఉత్తర ప్రదేశ్‌లో బిటెక్ బంగారు పతక గ్రహీత ప్రభుత్వోద్యోగం కోసం యాభై సార్లు విఫల యత్నాలు చేసిన తర్వాత ఆత్మహత్య చేసుకున్నాడని కొద్ది రోజుల కిందట 'టైమ్స్ ఆఫ్ ఇండియా' రాసింది. విపరీతంగా పెరిగిపోయిన నిరుద్యోగ సమస్య కారణంగా యువతకు జీవనోపాధి గురించిన ఏ కొద్దిపాటి ఆశను కూడా లేకుండా లాగేస్తున్నది. ఏదైనా పని సంపాదించిన వారికి కూడా అసలైన వేతనాలు నిరంతరం హరించుకుపోతున్నాయి. అన్ని రంగాలలో అన్ని స్థాయిలలో చొచ్చుకు వస్తున్న నూతన సాంకేతిక ప్రక్రియలపై ఎలాంటి ప్రభుత్వ జోక్యం లేకపోవడంతో ఆ అరకొర పనులు, తక్కువ స్థాయి ఉద్యోగాలు కూడా లేకుండా పోయే ప్రమాదం వెంటాడుతున్నది.మోసకారి పరీక్షల మాయవిద్యారంగంలో పరిస్థితి కూడా ఇంతే ఘోరంగా తయారైంది. అసలు ప్రవేశ పరీక్షలన్నవే విద్యార్థుల పాలిట పెద్ద మోసంగా తయారై కూర్చున్నాయి. ఇది అసాధారణ సవాలు గనక స్పందన కూడా అలాగే వుంటుంది.
దేశంలో సంఘటిత విద్యార్థి యువజన ఉద్యమాలు ఈ సమస్యలపై దీర్ఘ కాలంగా పోరాడుతూనే వస్తున్నాయి. ప్రభుత్వ విధానాలపై సువిశాల ఐక్య ప్రతిఘటనకు అవకాశముందని ఈ సంఘటిత ఉద్యమాల క్రమంలోనే గుర్తించబడింది. కొత్త లేబర్ కోడ్‌ల కారణంగా కార్మికులలో పెరిగిన అశాంతి ఢిల్లీ చుట్టుపక్కల హఠాత్తుగా నిరసనలు పెల్లుబుకడానికి కారణమైంది.మొదటి నుంచి కార్మికోద్యమాలు తక్కువగా వున్న చోట్ల కూడా ఎం.జి.ఎన్.ఆర్.ఇ.జి.ఎ కింద వంద రోజుల పని లేకుండా చేయడంపై అసమ్మతి భావన వ్యక్తమైంది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన అన్యాయమైన టారిఫ్‌లు, తమ రక్షణ కోసం చర్యలు తీసుకోకుండా కేంద్రం దారుణంగా లొంగిపోవడం రైతాంగంలోనూ అనిశ్చితిని సృష్టించింది.గోడీ మీడియా పాట్లుకార్పొరేట్ యాజమాన్యంలోని గోడీ మీడియా అసహ్యకర ధోరణి వల్ల కూడా యువతలో నిస్సహాయత మరింత ముదురు తున్నది. సత్యానంతర వాదం పేరిట అవి మోడీ సర్కారును ఏవో లేనిపోని గొప్పల కథలతో పైకి లేపడానికి తంటాలు పడుతున్నాయి. బీజేపీ దగ్గర పోగు పడిన భారీ డబ్బు నిల్వలతో ఎమ్మెల్యేలు, ఎంపీలు సంతలో పశువుల్లా అమ్ముడు పోవడం వల్ల ప్రజాస్వామ్యం పచ్చి బూటకంగా మార్చివేయ బడటం యువతలో కలవరాన్ని మరింత తీవ్రం చేస్తున్నది. కనుక పరిస్థితులు అన్ని హద్దులూ దాటిపోయాయి. ఎన్నో ఏండ్లుగా ప్రశ్నించే హక్కు, విమర్శించే హక్కు, ప్రజాస్వామ్యంలో ప్రాథమిక మైనవని గౌరవిస్తూ వచ్చాం. కానీ ఈ చీకటి కాలాలలో అదే ఒక నిషిద్ధ భావనగా తయారైంది. అందుకే యువజనులు జులై ఇరవైన ఢిల్లీలో అలా చేశారు. వారు భయాన్ని అధిగమించేశారు. వారి చర్యలే వారి తరపున మాట్లాడాయి.వారి సమిష్టి ధైర్యం ద్యోతకమైంది. వారితో సంభాషణలకు తిరస్క రించడం, దానికి బదులు భయానక హింసాకాండకు దిగడం నెతన్యాహు నేర్పిన పాఠం ఫలితమే. ఢిల్లీలో చూసింది ఏదో చెదురుమదురు సంఘటన కాదు. ఇప్పటికే అది దేశమంతా నిరసనలను రగిలించింది. అంతటా ప్రదర్శనలకు కారణమైంది. అవి కొనసాగ బోతున్నాయి. కనకనే మొదట మొండిగా చర్చలకు నిరాకరించిన ప్రభుత్వం తర్వాత ఏదో చర్చల తంతు లాంటిది నడిపింది.అనూహ్య పరిణామాలు ఏమైనా ఎప్పట్లాగే ఏదో కాలం గడిపేయగలిగితే తన తంటాలు తగ్గుతాయన్నది కేంద్ర ప్రభుత్వం అంచనా వేసుకుంటున్నది. కానీ సంఘటనల పరంపర బద్దలవుతున్నది. ఊహించని పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తున్నది. చివరకు వాటికి వారే బాధ్యత తీసుకోవలసి వుంటుంది తప్ప మరెవరూ కాదు. సోనమ్ వాంగ్‌చుక్ అతి ముఖ్యమైన ఆ అంశంపైనే దృష్టి కేంద్రీకరింపజేసేందుకు గౌరవ ప్రదమైన ప్రయత్నాలు చేస్తున్నా పరిస్థితి ఇప్పుడు ఆయన చేయి దాటిపోయిందనీ, సమిష్టి నాయకత్వంలోకి వచ్చేసిందని గుర్తించడం చాలా అవసరం. గోడీ మీడియా కూడా ఏదో కప్పిపుచ్చే కథనాలు వదులుతున్నది.క్షేత్ర స్థాయిలో ఏం జరిగిందనేది తెలియకుండా కప్పిపుచ్చేందుకు ఎలాంటి కట్టు కథలతో ముందుకు రావచ్చునో వాటికి అంతు పట్టడం లేదు. రాజుగారు బట్టల్లేకుండా దిగంబరంగా వున్నాడనే నిజం ప్రజలు చూడగలుగుతున్నారు. అంతిమంగా ప్రజాస్వామ్యం ఎంతటి ప్రమాదంలోనైనా వుండవచ్చుగాని చచ్చిపోలేదనే నిజం మనం చూడగలగాలి. అది సజీవంగా వుంది. అణచివేసేవారిని ప్రతిఘటిస్తున్నది.
ఎవరో అన్నట్టు అసలైన సౌందర్యం వీధుల్లోనే వ్యక్తమవుతున్నది.1968 మే నెలలో ఫ్రాన్స్‌లో విద్యార్థులు ఉద్యమించినప్పుడు పుట్టిన మాట ఇది, నాడు ఆ విద్యార్థులు స్తబ్దత నుంచి మేల్కొన్నారు. వియత్నాంలో అధర్మ ఆక్రమణ యుద్ధం కారణంగా విద్యా రంగాన్ని సైనికీకరణ చేస్తున్న తీరును నాడు వారు వెనక్కు కొట్టారు. వీధులూ బజార్లకున్న సత్తా అది. రానున్న రోజుల్లో యువతలో ఆకస్మికంగా పెల్లుబికే శక్తులు, సంఘటితంగా పనిచేస్తున్న వారు కూడా సమన్వయంతో వ్యవహరించాలి. రగిలే ఆగ్రహానికి సరైన దిశా నిర్దేశం చేయాలి. వారి భవిష్యత్ కార్యాచరణలూ ప్రయత్నాలతో పాటు...లౌకిక, ప్రజాస్వామిక పార్టీలు వుండనే వుంటాయనడం నిస్సందేహం.




# జాతీయం-అంతర్జాతీయం



## 24 గంటల్లో 10 మంది మిస్సింగ్

- **వారిలో ఇద్దరు మైనర్లు**
- **పోలీసుల గాలింపు చర్యలు**

**భోపాల్, జులై 28 (ఎ.ఎం.ఎస్):** మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో 24 గంటల వ్యవధిలో 10 మంది అదృశ్యం కావడం ఆందోళన కలిగిస్తోంది. వీరిలో ఇద్దరు మైనర్లు కూడా ఉన్నారు. నగరంలోని పలు పోలీస్ స్టేషన్ పరిధుల్లో కుటుంబ సభ్యులు ఫిర్యాదులు చేయడంతో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. కొందరి మొబైల్ ఫోన్లు ఇంటి నుంచి వెళ్లిన కాసేపటికే స్విచ్ ఆఫ్ కావడంతో వారి ఆచూకీ కనిపెట్టడం కష్టంగా మారింది. కోలార్, అయోధ్యా నగర్ పోలీస్ స్టేషన్ పరిధుల్లో అత్యధికంగా మూడు చొప్పున మిస్సింగ్ కేసులు నమోదయ్యాయి. అశోక్




గార్డెన్, టీటీ నగర్, రతీబాద్, అవధ్‌పురి పోలీస్ స్టేషన్ పరిధుల్లోనూ కేసులు నమోదయ్యాయి. అశోక్ గార్డెన్‌లో 17 ఏండ్ల విద్యార్థిని ట్యూషన్‌కు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు స్వయంగా వెతికినా సమాచారం లభించకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు.

అయోధ్యా నగర్ పరిధిలో గరిమా, తను, మనీశ్ అదృశ్యమైనట్లు ఫిర్యాదులు అందాయి. కోలార్ పరిధిలో శివకాంత్, అమర్‌జీత్, తులసీరామ్ కనిపించకుండా పోయారు. టీటీ నగర్‌కు చెందిన ముస్కాన్, రతీబాద్‌కు చెందిన అన్మోల్ సోనీ, అవధ్‌పురి పరిధిలోని బాలిక అదృశ్యమైన వారి జాబితాలో ఉన్నారు. ప్రతి మిస్సింగ్ కేసును అత్యంత ప్రాధాన్యంతో దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. కుటుంబ సభ్యులను ప్రశ్నించడంతో పాటు సీసీటీవీ దృశ్యాలను పరిశీలిస్తున్నారు. రైల్వే స్టేషన్లు, బస్ స్టాండ్లు, ఇతర రద్దీ ప్రాంతాల్లో గాలింపు కొనసాగుతోంది. మొబైల్ ఫోన్ లొకేషన్లు, కాల్ వివరాలను సైబర్ బృందం విశ్లేషిస్తోందని అదనపు పోలీస్ కమిషనర్ శైలేంద్ర సింగ్ చౌహాన్ వెల్లడించారు.

## విద్యార్థులందర్నీ తక్షణం విడుదల చేయాలి

- **సుప్రీంకోర్టు ఆదేశాలు**
- **నిరసనల పేరుతో జైల్లో పెట్టకూడదంటూ వార్నింగ్**

**న్యూఢిల్లీ, జులై 28(ఎ.ఎం.ఎస్):** నీట్ ప్రశ్నపత్రం లీక్‌కు వ్యతిరేకంగా జంతర్ మంతర్ వద్ద, వివిధ రాష్ట్రాల్లో జరిగిన విద్యార్థుల నిరసనల సందర్భంగా అరెస్టు చేసిన, గతంలో ఎలాంటి నేర చరిత్ర లేని విద్యార్థులందరినీ తక్షణం విడుదల చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. గతంలో ఎలాంటి నేర చరిత్ర లేని వారిని కేవలం నిరసనల పేరుతో జైలులో పెట్టకూడదని కోర్టు పేర్కొంది. హింసా ఘటనలు, పోలీసుల అరాచకాలపై నిష్పక్షపాతంగా, పారదర్శకంగా దర్యాప్తు జరిగేలా చూసేందుకు ఒక ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసే విషయాన్ని కూడా పరిశీలించవచ్చని కోర్టు పేర్కొంది. పిటిషన్లను విచారిస్తున్న సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, జస్టిస్ జయమల్య బాగ్చి, జస్టిస్ వి. మోహ



నలతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం ఈ కీలక ఆదేశాన్ని జారీ చేసింది.

\ నిరసనల సమయంలో అదుపులోకి తీసుకున్న లేదా అరెస్టు చేసిన 18 ఏళ్లలోపు విద్యార్థులను, నేర చరిత్ర లేని వారిని విడుదల చేయాలని మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విషయంలో నిర్ణయం తీసుకోవాలని వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను కూడా కోరారు. కేంద్ర ప్రభుత్వానికి, మహారాష్ట్ర, బీహార్, అస్సాం, పశ్చిమ బెంగాల్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. పోలీసుల క్రూరత్వ ఆరోపణలపై స్వతంత్ర, నిష్పాక్షిక విచారణ జరగడం అత్యవసరం అని ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం అభిప్రాయపడింది.

## బెడిసికొడుతున్న ట్రంప్ వ్యూహాలు

- **ఇరాన్ యుద్ధంలో అన్నీ చేదు అనుభవాలే**
- **రోజుకో మాటతో తడబాటు**
- **ఏం చేయాలో పాలుపోని దుస్థితి**
- **రాజుకుంటున్న రాజకీయ వేడి**
- **ఇంటా బయటా తప్పని ఎదురీత**

**వాషింగ్టన్, జులై 28 :** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మరోసారి ఓ సంక్లిష్టమైన పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. ఇలాంటి పరిస్థితి ఎదురైన ప్రతిసారీ ఆయనకు ఉన్న అవకాశాలు సన్నగిల్లుతున్నాయి. ఆయన ఏ చర్య తీసుకున్నా భారీ మూల్యం చెల్లించాల్సి వస్తోంది. వరుసగా 13 రాత్రులు ఇరాన్‌పై దాడులు చేసిన తర్వాత వైమానిక దాడులకు విరామం ఇవ్వాలని ట్రంప్ నిర్ణయించారు. దౌత్య ప్రయత్నాలకు అవకాశం ఇచ్చేందుకే ఈ నిర్ణయం తీసుకున్నామని చెబుతున్నారు. దౌత్య యత్నాలు కొనసాగుతున్నాయని చెప్పడానికి కొన్ని సంకేతాలు కల్పిస్తున్న మాట నిజమే.

ఒమన్‌తో ఇటీవలే ఇరాన్ చర్చలు జరిపింది. అయితే అమెరికాతో తాజా ఉద్రిక్తతలకు కారణమైన హార్ముజ్ జలసంధి విషయంలో మాత్రం టెహ్రాన్ ఏ మాత్రం వెనక్కి తగ్గడం లేదు. దాడులను తీవ్రతరం చేస్తానని ఒకసారి, భూతల దాడులు జరుపుతానని మరోసారి సంకేతాలు ఇచ్చిన ట్రంప్ ఆ పనులు చేయలేకపోయారు. భూతల దాడులు జరిపితే ప్రాణ నష్టం అధికంగా ఉంటుందన్న హెచ్చరికల నేపథ్యంలో ఆయన వెనకడుగు వేశారు.



ఇంటా బయటా సంక్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్న ట్రంప్ ముందు ఇప్పుడు దారులు మూసుకుపోతున్నాయి. రోజుకో మాట మాట్లాడుతున్న ట్రంప్‌లో తడబాటు స్పష్టంగా కన్పిస్తోంది. మౌలిక సదుపాయాలు, విద్యుత్ కేంద్రాలపై దాడుల ద్వారా ఇరాన్ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీయడానికి ట్రంప్ ఇప్పుడు ప్రయత్నించవచ్చు. అయితే దీనివల్ల వ్యతిరేకత పెరుగుతుందే తప్ప తగ్గదని, పైగా ఇరాన్ నాయకత్వ పోరాట పటిమ మరింత ద్విగుణీకృతం అవుతుందని సన్నిహితులే హెచ్చరిస్తున్నారు. గత శుక్రవారం అధ్యక్షభవనంలో ఓ సమావేశం జరిగింది. ఆయుధ నిల్వలు అడుగంటుతున్న వేళ యుద్ధాన్ని తీవ్రతరం చేయడంపై ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ చైర్మెన్ డాన్ కెయిన్ ఈ సమావేశంలో ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల అమెరికా జరిపిన బాంబు దాడులు సంప్రదింపులపై ఇరాన్ వైఖరిని మార్చబోవని సీఐఏ, డిఫెన్స్ ఇంటెలిజెన్స్ సంస్థ అంచనా వేశాయి.

### ఏ చర్య తీసుకున్నా ఇబ్బందే

ఇరాన్ ప్రభుత్వానికి నిధులు అందకుండా చేయడం, ఐఆర్‌జీసీ సైనిక యంత్రాంగానికి డబ్బు చేరకుండా అడ్డుకోవడం, ఇరాన్ ఓడరేవులపై దిగ్బంధనాన్ని పొడిగించడం వంటి చర్యలు కూడా ట్రంప్ పరిశీలనలో ఉన్నాయి. ఒకవేళ ఈ చర్యలన్నీ తీసుకున్నా ఇరాన్ ఆలోచనా విధానంలో మార్పు రాకపోవచ్చు. పైగా అమెరికా తీసుకునే చర్యలకు ప్రతిగా హార్ముజ్ జలసంధిలో వాణిజ్య నౌకలపై ఇరాన్ దాడి చేసే అవకాశం ఉంది. అప్పుడు ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై యుద్ధ ప్రకంపనలు తీవ్రమవుతాయి. అమెరికాలో రాజకీయ ఒత్తిడి కూడా పెరుగుతుంది. ఇక్కడ అమెరికాకు మరో మార్గం కూడా ఉంది. ఇప్పటికే అటకెక్కిన ఎంఓయూ బూజు దులిపి దాన్ని తిరిగి తెర పైకి తెచ్చేందుకు ప్రయత్నించవచ్చు. అయితే హార్ముజ్‌పై తనకు నియంత్రణ కల్పిస్తే తప్ప ఇరాన్ దానికి అంగీకరించదు. ముందుకు వెళ్లేందుకు ఏదైనా దారి ఉన్నదా అని రిపబ్లికన్ సెనెటర్ బిల్ కాసిడి అడిగిన ప్రశ్న పరిస్థితికి అద్దం పడుతోంది. ఏదేమైనా ఐదు నెలలు దాటినా యుద్ధానికి ఎలా ముగింపు పలకాలన్న దానిపై ఆచరణయోగ్యమైన సూచనతో ఎవరూ ముందుకు రాకపోవడం ట్రంప్ ఎదుర్కొంటున్న గందరగోళానికి నిదర్శనం.

అమెరికాలో ఇటీవల నిర్వహించిన ఓ పోల్‌లో ఆశ్చర్యకరమైన ఫలితాలు వచ్చాయి. హార్ముజ్ జలసంధిలో పరిస్థితిపై తమకు స్పష్టమైన అవగాహన ఉన్నదని కేవలం 31 శాతం మంది అమెరికన్లు మాత్రమే చెప్పారు. ఈ సంఘర్షణలో అమెరికాదే పైచేయి అని చెబుతున్న వారి సంఖ్య 40 శాతమే. ఇరాన్‌తో యుద్ధం ట్రంప్ ఊహించిన దానికంటే కష్టంగా ఉన్నదని ఏకంగా 76 శాతం మంది చెప్పారు. భూతల యుద్ధంలో అమెరికా చిక్కుకోకుండా చేయడానికి, లొంగిపోయేలా ఇరాన్‌ను బలవంతం చేయడానికి ట్రంప్ ప్రయత్నిస్తున్నారు. కానీ తన చర్యలపై స్వయంగా విధించుకున్న పరిమితుల కారణంగా ఈ యుద్ధంలో అమెరికా విజయం సాధించడం అసంభవమని గత అనుభవాలు చెబుతున్నాయి. ఉద్రిక్తతను పెంచడం ట్రంప్‌ను ఇబ్బందికరమైన సంకటంలోకి నెట్టవచ్చు. అమెరికా లక్ష్యాలను నెరవేర్చే శాంతి ఒప్పందానికి స్పష్టమైన మార్గం ఏదీ కల్పించడం లేదు. ఎలా చూసినా విజయం సాధించలేని పరిస్థితే కనిపిస్తోంది. యుద్ధం కొన్ని వారాలలోనే ముగుస్తుందని చెప్పిన ట్రంప్ ఇప్పుడు ఐదు నెలలు దాటినా దాని నుంచి బయటపడలేక పోతున్నారు. అటు దేశంలో రాజకీయ వేడి కూడా పెరిగిపోతోంది. పెరుగుతున్న చమురు ధరలతో ప్రజలలో తీవ్ర వ్యతిరేకత వస్తోంది. ఎర్ర సముద్రం ద్వారా చమురు సరఫరాలు జరుగుతాయని అనుకుంటే హౌతీల హెచ్చరికలు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ముడి చమురు నిల్వలు అడుగంటుతున్నాయి. ఇంధన సంక్షోభం మరింత తీవ్రమవుతుందేమోనన్న ఆందోళన సర్వేసర్వత్రా కనిపిస్తోంది. మరోవైపు మధ్యంతర ఎన్నికల వేడి రాజుకుంటోంది. ఇప్పటికే అత్తెసరు మెజారిటీతో నెట్టుకొస్తున్న అధికార రిపబ్లికన్లకు ఈ ఎన్నికలు అగ్నిపరీక్ష కాబోతున్నాయి.





## ఎవ్వరినీ ఒంటరిని చేయబోం
## సీజేపీ అధికార ప్రతినిధి సౌరవ్ దాస్

**న్యూఢిల్లీ, జులై 28(ఎ.ఎం.ఎస్):** తమతో కలిసి పోరాడిన ఏ నిరసనకారుడిని ఒంటరిని చేయబోమని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) అధికార ప్రతినిధి సౌరవ్ దాస్ తెలిపారు. ప్రభుత్వ ప్రతినిధులతో సోమవారం అర్ధరాత్రి చర్చలు జరిపిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. నిరసనకారులపై భవిష్యత్తులో ఎలాంటి చర్యలు తీసుకోబోమని వారు తమకు హామీ ఇచ్చారన్నారు. బిహార్, అస్సాంలో ఆందోళనలో పాల్గొన్న వారిపై కేసులను ఆయా ప్రభుత్వాలు ఉపసంహరించుకున్నాయని తెలిపారు. నిర్బంధంలో ఉన్నవారిని విడుదల చేయడంపైనా కేంద్రం సానుకూలంగా స్పందించిందన్నారు. అన్ని రాష్ట్రాల్లో ఆందోళనకారులపై రేపటిలోగా కేసులు ఎత్తివేయాలని కోరామన్నారు. అందుకు వారు అంగీకరించారని వెల్లడించారు.

## రెండు వారాల్లోగా సమగ్ర నివేదిక

- **అయోధ్య రామాలయ విరాళాల చోరీపై సుప్రీం**
- **సిట్‌లో ఐదో సభ్యుడిగా ఫోరెన్సిక్ ఆడిటర్‌ను కూడా చేర్చాలని ఆదేశం**
- **కేసును రాజకీయం చేయొద్దని హితవు**

**న్యూఢిల్లీ, జులై 28 (ఎ.ఎం.ఎస్) :** అయోధ్య రామాలయంలో విరాళాల చోరీ ఆరోపణలపై విచారణ సందర్భంగా సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ ఘటనపై రెండు వారాల్లోగా సమగ్ర నివేదిక సమర్పించాలని ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఆదేశించింది. ఐజీ ఎస్. కిరణ్ నేతృత్వంలో నలుగురు సభ్యుల బృందం విరాళాల దుర్వినియోగంపై దర్యాప్తు చేస్తోందని ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా జోక్యం చేసుకున్న సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, సిట్‌లో ఐదో సభ్యుడిగా ఫోరెన్సిక్ ఆడిటర్‌ను కూడా చేర్చాలని ఆదేశించారు. విరాళాల నిధుల మళ్లింపు, రికార్డుల తనిఖీకి ఫోరెన్సిక్ నిపుణుడి అవసరం ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై దర్యాప్తును వేగవంతం చేయాలని సిట్‌ను ఆదేశించిన ధర్మాసనం, రెండు వారాల్లో దర్యాప్తు పురోగతిపై సమగ్ర నివేదిక సమర్పించాలని ఆదేశించింది. అయితే విరాళాల వివరాలను వెబ్‌సైట్‌లో పెట్టాలన్న పిటిషనర్ విజ్ఞప్తిని ధర్మాసనం తోసిపుచ్చింది. సిట్ ఇచ్చే నివేదిక




ఆధారంగా తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేసింది. తదుపరి విచారణ రెండు వారాలకు వాయిదా వేసింది.రాష్ట్ర ప్రభుత్వం తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా విచారణ సందర్భంగా సుప్రీంకోర్టుకు కీలక విషయాలు వెల్లడించారు. "మేము ఇన్స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ కిరణ్ ఎస్ నేతృత్వంలో సిట్ ఏర్పాటు చేశాం. ఇందులో ఒక డిప్యూటీ ఇన్స్పెక్టర్ జనరల్ (డీఐజీ), ఒక సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (ఎస్ఎస్పీ), ఒక అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (ఏఎస్పీ) ఉన్నారు. ఈ బృందంలో ఫోరెన్సిక్ ఆడిటర్ను కూడా భాగం చేస్తాం. జులై 25న ఏర్పాటైన ఈ సిట్ ప్రస్తుతం ఈ కేసును దర్యాప్తు చేస్తోంది " అని చెప్పారు. ఇక పిటిషనర్లలో ఒకరి తరఫున హాజరైన సీనియర్ అడ్వకేట్ దేవదత్ కామత్ తన వాదనలు వినిపిస్తూ, "ప్రజలు రూ.500, రూ.1000 నోట్లను విరాళాలుగా ఇచ్చారు. కానీ ఆ డబ్బు ట్రస్టుకు చేరలేదు. ట్రస్టుకు లభించిన మొత్తాన్ని వెబ్సైట్లో ఉంచితే, తమ డబ్బు ఎక్కడకు చేరిందో ప్రజలు తెలుసుకుంటారు. ఇదేమీ లిటిగేషన్ వ్యాజ్యం కాదు" అని అన్నారు. దీనిపై స్పందించిన న్యాయస్థానం సిట్కు అన్ని వివరాలు పరిశీలించే అవకాశం ఉంటుందని, పైగా ప్రస్తుతానికి ఈ కేసును క్లోజ్ చేయడం లేదని పేర్కొంది. "ప్రస్తుతానికి మీరంతా సమస్యలను నోట్ చేసుకోండి. ఇప్పుడు మా పూర్తి దృష్టి దర్యాప్తుపైనే ఉంది. మనకు వేగవంతమైన, నాణ్యమైన దర్యాప్తు అవసరం. మాకు నివేదిక సమర్పించమని వారిని అడుగుతున్నాం. మిగిలిన విషయాలను మేము తర్వాతి దశలో నిర్ణయిస్తాం" అని బెంచ్ స్పష్టం చేసింది.

ఇంతకు ముందు అయోధ్య రామ మందిర విరాళాల కేసుపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ కేసును రాజకీయం చేయవద్దని, కోర్టులు రాజకీయాలకు వేదిక కాదని స్పష్టం చేసింది. ఇది ఒక సాధారణ నేరమని, తాము సరైన మార్గంలో దర్యాప్తు జరిగేలా చూస్తామని తెలిపింది. కాగా, ఈ కేసు దర్యాప్తునకు యూపీ గవర్నమెంట్ ఓ సిట్ను ఏర్పాటు చేసిందని, ప్రస్తుతం ఆ రాష్ట్ర పోలీసులు దానిపై క్షుణ్ణంగా దర్యాప్తు చేస్తున్నారని సుప్రీంకోర్టుకు సొలిసిటర్ జనరల్ వెల్లడించారు. దీనితో సుప్రీంకోర్టు తదుపరి విచారణను జులై 27కు వాయిదా వేసింది. సీజేఐ సూర్యకాంత్, జస్టిస్ జోయ్మాల్య బాగ్చీ, జస్టిస్ వి.మోహనాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఈ కేసుపై విచారణ చేసింది. ఈ సందర్భంగా అయోధ్య రామమందిర విరాళాల అక్రమాలపై విచారణ సిట్ చేయవచ్చా? అని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వాన్ని సర్వోన్నత న్యాయస్థానం ప్రశ్నించింది. అంతకుముందు సొలిసిటర్ జనరల్ మెహతా మాట్లాడుతూ, కోర్టు గతంలో ఇచ్చిన ఆదేశాల మేరకు ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం స్టేటస్ రిపోర్టు దాఖలు చేసిందని తెలిపారు. "దర్యాప్తు కొనసాగుతోంది. ఇప్పటి వరకు 8 మందిని అరెస్టు చేశారు. నేను అంత కంటే ఎక్కువ వివరాలు వెల్లడించలేను" అని అన్నారు. దీనితో కేసును సిట్ దర్యాప్తు చేస్తోందా? అని కోర్టు ప్రశ్నించగా, "నిజానిజాలను తెలుసుకోవడానికి మాత్రమే సిట్ ఏర్పాటు చేశారు. ఇప్పుడు దీనిని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఇందులో ఒక నేరం జరిగిందని మాత్రమే సిట్ కనిపెట్టింది" అని తుషార్ మెహతా కోర్టుకు తెలిపారు.



## 150 ఏండ్ల తర్వాత స్పెయిన్‌కు తొలి రాణి

- **చరిత్ర సృష్టించిన లియోనోర్**

**మాడ్రిడ్, జులై 28:** స్పెయిన్ రాజు ఫిలిప్, రాణి లెటిజియాల పెద్ద కుమార్తె యువరాణి లియోనోర్ చిన్న వయసులోనే ప్రపంచ దృష్టిని ఆకర్షించారు.

13 ఏండ్లు వయసులో స్పెయిన్ రాజ్యాంగ వార్షికోత్సవంలో ఆమె చేసిన ఆత్మవిశ్వాసపూరిత ప్రసంగం ప్రశంసలు అందుకుంది. 12 ఏండ్లకే ప్రతిష్ఠాత్మక 'ఆర్డర్ ఆఫ్ గోల్డెన్ ఫ్లీస్' పురస్కారం అందుకున్నారు. 150 ఏండ్ల తర్వాత స్పెయిన్‌ను పాలించే తొలి రాణిగా చరిత్ర సృష్టించనున్నారు. త్రివిధ దళాల్లో శిక్షణ పొందుతున్న ఆమె స్పానిష్‌తో పాటు ఇంగ్లీష్, ఫ్రెంచ్, అరబిక్, మాండరిన్ భాషల్లో అనర్గళంగా మాట్లాడగలరు. మహిళా సాధికారత, యువత అభివృద్ధికి ఆమె ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నారు.

## అమెరికాలో రంగారెడ్డి జిల్లా మహిళ మృతి

**న్యూజెర్సీ, జులై 28:** అమెరికాలోని న్యూజెర్సీలో సోమవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు మండలం ఆకుతోటపల్లి గ్రామానికి చెందిన శ్రీపాతి దీపారెడ్డి (44) మృతి చెందారు. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు అయిన దీపారెడ్డి, ఆమె భర్త రామకృష్ణారెడ్డి 20 ఏళ్ల క్రితం అమెరికాలో స్థిరపడ్డారు. దీపారెడ్డి కారు సిగ్నల్ వద్ద ఆగి



ఉన్నప్పుడు, మరో కారు వేగంగా వచ్చి ఢీకొనడంతో ఈ దుర్ఘటన జరిగింది. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

## ఫ్లై ఓవర్‌పై ప్రమాదం




- **ఇద్దరు వ్యక్తులు మృతి**

**చెన్నై, జులై 28 (ఎ.ఎం.ఎస్):** తమిళనాడులో విల్లుపురం సమీపంలోని ఫ్లైఓవర్‌పై మంగళవారం ఉదయం జరిగిన వాహనాల ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మరణించగా, మరికొందరు గాయపడ్డారని పోలీసులు తెలిపారు. ఒక ద్విచక్రవాహనం అదుపుతప్పి జారిపడి, ఎదురుగా వస్తున్న లగ్జరీ బస్సును ఢీకొట్టింది. వెనకనుంచి వేగంగా వస్తున్న ఓ కారు బస్సు వెనక భాగాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో విల్లుపురం నివాసి అయిన భూపతి అక్కడికక్కడే మరణించగా, కారులో ప్రయాణిస్తున్న జాన్ అన్బళగన్ తీవ్రంగా గాయపడి ప్రాణాలు కోల్పోయారు.

## చార్‌ధామ్ యాత్రకు బ్రేక్

**డెహ్రాడూన్, జులై 28 (ఎ.ఎం.ఎస్):** చార్‌ధామ్ యాత్ర ను రెండు రోజులపాటు నిలిపివేశారు. ఉత్తరాఖండ్ లో భారీ వర్షాలు కురుస్తున్నాయి.

దానికితోడు పలుచోట్ల కొండచరియలు విరిగిపడుతున్నాయి.

ఫలితంగా యాత్ర మార్గాలు పలుచోట్ల దెబ్బతిన్నాయి. యాత్రికుల భద్రత దృష్ట్యా మంగళ, బుధవారాల్లో యాత్రను పూర్తిగా నిలిపివేస్తున్నట్లు అధికారులు తెలిపారు.



## జపాన్‌లో తీవ్ర భూకంపం

- **10 కిలోమీటర్ల లోతులో నమోదు**

**కుమమోటో, జులై 28:** జపాన్ దక్షిణ ప్రధాన ద్వీపమైన క్యుషులోని కుమమోటో ప్రాంతంలో మంగళవారం మధ్యాహ్నం 7.1 తీవ్రతతో భూకంపం సంభవించింది. తీరప్రాంతాలకు సునామీ హెచ్చరికను జపాన్ వాతావరణ శాఖ (జెఎంఎ) జారీ చేసింది. జపాన్ కాలమానం ప్రకారం సాయంత్రం 4:29 గంటలకు సంభవించిన ఈ భూకంపం భూమికి 10 కిలోమీటర్ల లోతులో నమోదైనట్లు జేఎంఏ వెల్లడించింది. భూకంప కేంద్రం టోక్యోకు నైరుతి దిశలో సుమారు 900 కిలోమీటర్ల దూరంలో ఉన్న కుమమోటో పశ్చిమ ప్రాంతంలో గుర్తించారు. భూకంపం సంభవించిన వెంటనే సునామీ హెచ్చరికలు జారీ చేసినప్పటికీ, ఎటువంటి ప్రాణనష్టం, గాయాలు లేదా ఆస్తినష్టం జరిగినట్లు సమాచారం అందలేదని అధికారులు తెలిపారు. అమెరికాకు చెందిన పసిఫిక్ సునామీ హెచ్చరిక కేంద్రం (పిటిఎంసి) కూడా స్పందిస్తూ, ఈ భూకంపం కారణంగా స్థానిక తీరప్రాంతాలకు ఆవల ఇతర ప్రాంతాలకు సునామీ ముప్పు లేదని స్పష్టం చేసింది. అయితే, తీర ప్రాంత ప్రజలు అధికారుల సూచనలను పాటించాలని, పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు జపాన్ వాతావరణ శాఖ వెల్లడించింది.

## అది ధనవంతులకే అనుకూలం

- **పెట్టుబడిదారీ వ్యవస్థపై అమెరికన్లలో అసంతృప్తి**
- **బడా వ్యాపార సంస్థలపై ప్రతికూలత**
- **పలువురు రిపబ్లికన్లదీ అదే మాట**

**వాషింగ్టన్, జులై 28 :** డెమొక్రాట్లను 'సోషలిస్టులు'...ఇంకా చెప్పాలంటే 'కమ్యూనిస్టులు' అని పిలవడమే మధ్యంతర ఎన్నికలకు తన ప్రధాన వ్యూహమని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చెబుతున్నారు. అయితే ప్రస్తుతం అమెరికా రాజకీయాలలో కనిపిస్తున్న దృశ్యం ఏమిటంటే సోషలిజం ఉద్ధానం కంటే పెట్టుబడిదారీ విధానం, ఆర్థిక సమానత్వంపై విశ్వాసం సడలడమే. ఇటీవల దేశంలో నిర్వహించిన వివిధ పోల్స్ ఈ వాదనను బలపరుస్తున్నాయి. ఇటీవల ఫాక్స్ న్యూస్ నిర్వహించిన పోల్ ముఖ్యమైన విషయాలలో గత సంవత్సరపు గ్యాలప్ డేటాతో ఏకీభవిస్తోంది. సోషలిజంపై ప్రజలలో సదభిప్రాయం ఏర్పడుతున్నప్పటికీ పెట్టుబడిదారీ విధానంపై మాత్రం వారిలో విశ్వాసం పెద్ద ఎత్తున సడలిపోతోందని ఈ పోల్స్ చెబుతున్నాయి. పెట్టుబడిదారీ విధానంపై 2019లో 30 పాయింట్ల (నమోదైన ఓటర్లలో 57 శాతం అనుకూలత వ్యక్తం చేయగా 27 శాతం మంది వ్యతిరేకించారు) సానుకూలత కనిపించగా ప్రస్తుతం అది నాలుగు పాయింట్లకు పడిపోయింది. ప్రస్తుతం ఈ విధానాన్ని 50 శాతం మంది సమర్థిస్తుంటే 46 శాతం మంది వ్యతిరేకిస్తున్నారు. పెట్టుబడిదారీ వ్యవస్థ ధనవంతులకు అనుకూలంగా ఉండే లా రూపొందించబడిందని 65 శాతం మంది చెప్పారు. ట్రంప్ మొదటిసారి అమెరికా అధ్యక్షుడు అయినప్పుడు ఇది 56 శాతంగా ఉంది. ఇక్కడ గమనించాల్సిన ఆశ్చర్య కరమైన విషయమేమింటే రిపబ్లికన్లు సైతం పెట్టుబడిదారీ వ్యవస్థపై నమ్మకాన్ని కోల్పో తున్నారు. 2019లో 72 శాతం మంది రిపబ్లి కన్లు ఈ వ్యవస్థపై నమ్మకాన్ని కలిగి ఉంటే ఇప్పుడది 61 శాతానికి పడిపోయింది. అలాగే పెట్టుబడిదారీ వ్యవస్థపై బలమైన సానుకూల దృక్పథం కలిగిన వారి సంఖ్య కూడా 54 శాతం నుంచి 41 శాతానికి తగ్గింది.

పెట్టుబడిదారీ వ్యవస్థ ధనవంతులకు అనుకూలంగా ఉండేలా రూపొందిందని చెప్పే రిపబ్లికన్ల సంఖ్య 2018లో 30 శాతం ఉంటే ఇప్పుడు 42 శాతానికి పెరిగింది. స్వేచ్ఛా మార్కెట్లకు అనుకూలమని చెప్పుకునే రిపబ్లికన్లలో కూడా ఇప్పుడు సగం కంటే తక్కువ మంది మాత్రమే పెట్టుబడిదారీ వ్యవస్థపై గట్టి సానుకూల దృక్పథంతో ఉన్నారు.

## నాలుగు రెట్లు పెరిగిన శతకోటీశ్వరులు

- **కేంద్ర ఆర్థికశాఖ నివేదికలో వెల్లడి**
- **నిరుద్యోగ రేటు 3.1 శాతం**

**న్యూఢిల్లీ. జులై 28 (ఎ.ఎం.ఎస్) :** దేశంలో ఒకవైపు నిత్యావసరాలు, అధిక ధరలతో సామాన్యుల సగటు ఆదాయం హరించుకుపోతుంటే మరోవైపు అత్యున్నత స్థాయి సంపన్నుల సంపద మాత్రం అంతకంతకూ పెరుగుతోంది. గడిచిన ఐదేండ్ల లో శత కోటీశ్వరుల సంఖ్య దాదాపు నాలుగు రెట్లు ఎగిసింది. సోమవారం కేంద్ర ఆర్థిక శాఖ సహాయమంత్రి పంకజ్ చౌదరీ లోక్‌సభకు వెల్లడించిన గణాంకాల ప్రకారం.. 202526 ఐటీ రిటర్న్స్ అసెస్మెంట్ ఇయర్‌లో రూ. 100 కోట్లకు పైగా స్థూల వార్షిక ఆదాయాన్ని ప్రకటించిన వారి సంఖ్య రికార్డు స్థాయిలో 576కి చేరింది. అంతకుముందు ఏడాది



ఈ సంఖ్య 415గా ఉండగా ఒక్క ఏడాదిలోనే అత్యధిక ఆదాయం ఆర్జించే ఈ వర్గం దాదాపు 39 శాతం మేర పెరగడం గమనార్హం.ఆదాయపు పన్ను చట్టాల ప్రకారం బిలియనీర్ అనే పదానికి నిర్దిష్ట చట్టపరమైన నిర్వచనం లేనప్పటికీ గత ఐదేండ్ల ఐటీఆర్ గణాంకాలను పరిశీలిస్తే ఈ అధిక ఆదాయం కలిగిన పన్ను చెల్లింపు దారుల సంఖ్య ఏకంగా 300 శాతానికి పైగా ఎగబాకింది. 202122లో కేవలం 142 మందిగా ఉన్న ఈ సంఖ్య క్రమంగా పెరుగుతూ ప్రస్తుత స్థాయికి చేరుకుంది. 202223 నాటికి ఆ సంఖ్య 301కి చేరగా, 202324లో 284 తగ్గగా, 202425 నాటికి 415కి చేరింది. మరోవైపు దేశంలో ఆర్థిక అసమానతలు తగ్గుముఖం పడుతున్నాయని ప్రభుత్వం చెప్పడం గమనార్హం. తాజా గృహ వినియోగ వ్యయ సర్వే (202324) ప్రకారం గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య వినియోగ వ్యయం అంతరం తగ్గిందని ఆర్థిక శాఖ పేర్కొంది. పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే (పీఎల్ఎఫ్ఎస్) ఆధారంగా 2025 నాటికి నిరుద్యోగ రేటు 3.1 శాతానికి పడిపోయిందని తెలిపింది.

# వరంగల్ | ఖమ్మం | నల్లగొండ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, సౌకర్యాలు కల్పించాలి: కలెక్టర్



**జనగామ, జూలై 28 (వుదయం ప్రతినిధి):**

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ఉపాధ్యాయులు ముందస్తు ప్రణాళికతో, సన్నద్ధమై తరగతి గదిలోకి రావాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సూచించారు. మంగళవారం దేవరుప్పుల మండల పరిధిలోని జెడ్పీహెచ్ఎస్ (ZPHS) పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా 8, 10వ తరగతి గదులను సందర్శించి విద్యార్థుల అభ్యాస స్థాయిని పరిశీలించారు. సాంఘీక శాస్త్రంలో ఆర్కిటిక్, అంటార్కిటిక్ వలయాల గురించి విద్యార్థులకు స్వయంగా బోధించి క్లిష్టమైన పాఠాలను సులభ శైలిలో వివరించారు. అకాడమిక్ ఫ్రేమ్ వర్క్‌ను తప్పనిసరిగా పాటిస్తూ, నిరంతర మూల్యాంకనం నిర్వహించాలని ఆదేశించారు. పాఠశాల ఆవరణలోని పాత ఇనుప సామగ్రి, చెట్లను వేలం ద్వారా తొలగించాలని, ఆటపాటల కోసం వాలీబాల్ కోర్టును ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఏకరూప దుస్తుల పంపిణీ వేగవంతం చేయాలి. అనంతరం దేవరుప్పులలో స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో జరుగుతున్న ఏకరూప దుస్తుల (యూనిఫామ్స్) కుట్టు పనులను కలెక్టర్ పరిశీలించారు. కుట్టు ప్రక్రియను వేగవంతం చేసి, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ గడువులోగా పూర్తి చేయాలన్నారు. పూర్తి చేసిన దుస్తులను వెంటనే పాఠశాలల వారీగా విద్యార్థులకు పంపిణీ చేయాలని డీఆర్‌డీఓను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ భాస్కర్, సంబంధిత అధికారులు, SHG ప్రతినిధులు పాల్గొన్నారు.

## నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డికి గుండెపోటు

### యశోద ఆసుపత్రిలో పరామర్శించిన మంత్రి పొంగులేటి, ఎమ్మెల్యే దొంతి



**నల్లబెల్లి, జులై 28 (వుదయం):**

ఇటీవల గుండెపోటుకు గురై హైదరాబాద్ నగరంలోని యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డిని మంగళవారం రాష్ట్రాదాయ, సమాచార పౌరసంబంధాల శాఖ, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, నర్సంపేట శాసనసభ్యుడు దొంతి మాధవరెడ్డి పరామర్శించారు.ఈ సందర్భంగా ఆసుపత్రి వైద్యులతో మాట్లాడి సుదర్శన్‌రెడ్డికి అందుతున్న వైద్యసేవలు, ఆయన ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీశారు. అనంతరం అక్కడే ఉన్న ఆయన కుటుంబ సభ్యులను కలిసి, సుదర్శన్‌రెడ్డి త్వరగా కోలుకుంటారని ధైర్యం చెప్పారు. ఆయన వేగంగా కోలుకుని పూర్తి ఆరోగ్యంతో తిరిగి ప్రజల్లోకి రావాలని ఆకాంక్షించారు. ఈ పరామర్శ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట నల్లబెల్లి పిఏసిఎస్ చైర్మన్ ఎర్రబెల్లి రఘుపతిరావు. మాజీ మండల అధ్యక్షులు తేజావత్ సమ్మయ్య నాయక్. మండల యూత్ ప్రెసిడెంట్ పురుషోత్తం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## అనారోగ్యానికి గురైన మాజీ ఎమ్మెల్యే పెద్ది కుటుంబాన్ని పరామర్శించిన

### మాజీ ఎంపీపీ, మాజీ ఓడిసిఎంఎస్ చైర్మన్



**ఖానాపురం, జూలై 28 (వుదయం ప్రతినిధి):**

నర్సంపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి తీవ్ర అనారోగ్యానికి గురై సికింద్రాబాద్ లోని యశోద ఆసుపత్రిలో వెంటిలేషన్ పై చికిత్స పొందుతున్న మాజీ ఎమ్మెల్యే పెద్దిని మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాష్‌రావు, మాజీ ఓడిసిఎంఎస్ చైర్మన్ గూగులోతు రామస్వామినాయక్ సందర్శించి యశోద వైద్య బృందాన్ని మాజీ ఎమ్మెల్యే ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని మాజీ ఎమ్మెల్యే కుటుంబాన్నికి మనోదేశం కల్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ ఎంపీ మాలోత్ కవిత,నాయకులుభూక్యవెంకన్న, బాదావత్ బాలకిషన్, కాస ప్రవీణ్ కుమార్, తీగల యాదగిరిరావు, ఇరుకు దేవేందర్ రావు, డెంకల వెంకటేశ్వర్లు, బానోత్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పలుగుల రహదారికి మోక్షమెప్పుడో..?

### గుంతలతో ప్రజల అవస్థలు నాయకుల చిత్తశుద్ధి ఏది.?



**మహాదేవపూర్ జులై 28 (వుదయం ప్రతినిధి):**

పలుగుల రహదారికి మోక్షమెప్పుడో అంటూ గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జయశంకర్ జిల్లా మహాదేవపూర్ మండలంలోని పలుగుల గ్రామ ప్రధాన రహదారి సంవత్సరాలుగా అధ్వాన్నంగా మారి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఈ రోడ్డుకు మోక్షం ఎప్పుడు?" అంటూ ప్రజలు ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. .వర్షం పడితే చాలు బురదమయమై గుంతలు నీటితో నిండి పెద్ద పెద్ద చెరువులను తలపిస్తున్నాయి ద్విచక్ర వాహనదారులు కిందపడి గాయపడుతున్నారు.వాహనాలు నెమ్మదిగా వెళ్లాల్సి వస్తోంది. దుమ్ము, బురదతో ఊపిరాడని పరిస్థితి నెలకొంది.

సరైన రోడ్డు లేక పిల్లలను స్కూల్‌కు పంపాలంటేనే భయంగా ఉందని ఎప్పుడూ ఎలాంటి ప్రమాదం చోటు చేసుకుంటుందోనని భయపడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## రోడ్ల అభివృద్ధిపై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి ఎంపీ కావ్య, ఎమ్మెల్యే శ్రీహరి వినతి



**వరంగల్, జూలై 28 (వుదయం ప్రతినిధి):**

వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో పెండింగ్‌లో ఉన్న కీలక రహదారుల అభివృద్ధి, జాతీయ రహదారులపై అసంపూర్తిగా ఉన్న సర్వీస్ రోడ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కోరారు. మంగళవారం న్యూఢిల్లీలో కేంద్ర మంత్రిని కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. కరుణాపురం నుండి ఎల్కతుర్తి వరకు ఉన్న కీలక రహదారిని విస్తరించి బలోపేతం చేయాలని కోరారు. ఇది NH-163, NH-563 ల మధ్య అనుసంధానంగా ఉంటూ నిత్యం వేలాది మంది ప్రయాణికులకు ఉపయోగపడుతుందని వివరించారు.సర్వీస్ రోడ్ల అనుసంధానం: యాదాద్రి–వరంగల్ జాతీయ రహదారి (NH-163) పరిధిలోని నిడిగొండ, రఘునాథపల్లి, చాగల్, స్టేషన్ ఘన్‌పూర్, చిన్నపెండ్యాల, కరుణాపురం వద్ద సర్వీస్ రోడ్ల మధ్య మిగిలిపోయిన లింకులను వెంటనే పూర్తి చేసి ప్రమాదాలను నివారించాలని విజ్ఞప్తి చేశారు.CRIF నిధుల మంజూరు: కేంద్ర రోడ్డు మరియు మౌలిక సదుపాయాల నిధి (CRIF) 2025–26 కింద నర్సంపేట–నందిగామ, భట్టుపల్లి–హంటర్ రోడ్ల విస్తరణ పనులకు త్వరిత గతిన ఆమోదం తెలపాలని ప్రతిపాదించారు.ఈ ప్రతిపాదనలపై సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఎంపీ కావ్య, ఎమ్మెల్యే శ్రీహరి తెలిపారు.

## పంట కాల్వల అభివృద్ధికి 31 కోట్ల నిధులు మంజూరు

### ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**జయశంకర్ భూపాలపల్లి జులై 28 (వుదయం జిల్లా ప్రతినిధి)**

ఘన్పూర్ రిజర్వాయర్ పంట కాల్వల అభివృద్ధికి నాలుగు ప్రధాన కాల్వలు 31 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసినట్లు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. మంగళవారం గన్ పూర్ రైతు వేదికలో రైతు నేస్తం 100 ఎపిసోడ్స్ పూర్తి అయిన సందర్భంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హైదరాబాద్ నుండి పాల్గొన్న కార్యక్రమంలో ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూఈ పనులకు టెండర్ ప్రక్రియ పూర్తయ్యాక 12 నెలల్లో పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.ప్రస్తుతం ఎల్నినో ప్రభావం కారణంగా వర్షపాతం అనిశ్చితంగా ఉండే అవకాశం ఉందని, నీటి లభ్యతపై స్పష్టత లేని పరిస్థితిలో రైతులు పంటల ఎంపికలో జాగ్రత్తగా వ్యవహరించాలని ఆయన సూచించారు. నీటి ఆధారిత పంటలకు బదులుగా తక్కువ నీటితో పండే పెసర్లు, కందులు, కూరగాయలు, వంటి పంటలను సాగు చేయాలని రైతులకు విజ్ఞప్తి చేశారు ప్రపంచవ్యాప్తంగా వాతావరణ మార్పులు ప్రభావం చూపుతున్నాయని, ఈ పరిస్థితుల్లో రైతులే తమ అనుభవంతో సరైన నిర్ణయాలు తీసుకోవాలని ఎమ్మెల్యే అన్నారు. గ్రామస్థాయి సమావేశాలు నిర్వహించి నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని ఏ పంటలు వేసుకోవాలన్న దానిపై సామూహికంగా రైతులు నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. గతంలో మక్క పంటకు ప్రభుత్వం మంచి ధర కల్పించి రైతులకు లాభాలు చేకూర్చిందని, ఎకరాకు రూ.1 లక్షకు పైగా ఆదాయం వచ్చినట్లు తెలిపారు. బ్రోకర్ల దోపిడీని అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకుని రైతులకు న్యాయం చేశామని అన్నారు. అదేవిధంగా, ఎస్ఆర్ఎస్పి ప్రాజెక్టు నీటిని దేవాదుల ద్వారా 44,000 ఎకరాలకు చేరేలా చర్యలు చేపట్టామని, గన్పూర్ చెరువు అభివృద్ధికి కూడా ప్రత్యేక నిధులు మంజూరు చేయించామని వివరించారు. రెండు జిల్లాల కలెక్టర్లతో సమన్వయం చేసుకొని తాగునీరు, సాగునీరు సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ సందర్భంగా రైతు సోదరులు వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని పంటల ఎంపికలో జాగ్రత్తగా నిర్ణయాలు తీసుకోవాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు కోరారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలు తట్టుకొని అధిక ఆదాయం వచ్చే ప్రత్యామ్నయ పంటలు సాగు చేయాలని ఆయన రైతులకు సూచించారు. భూగర్భ జలాలు సైతం అడుగంటి పోతున్నాయని అందువల్ల తక్కువ నీటితో పండే పంటలు చేపట్టాలని తెలిపారు. ఉద్యానవన పంటలలో అంతర పంటలు సాగు కూడా చేపట్టి అధిక ఆదాయం పొందవచ్చునని ఆయన సూచించారు. వాతావరణ శాఖ సలహాలు సూచనలు పాటించాలని రైతులు ఆయన స్పష్టం చేశారు. పంటలు ఎంపికను ఒక పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టాలని అందుకు తగిన ప్రణాళికలు రచించుకోవాలని సూచించారు. నీళ్లు అందకపోతే రైతులు నష్టపోతారని కరువును సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ఉద్యానవన పంటలు సాగు చేపట్టాలన్నారు ఎల్లేనో ప్రభావం వల్ల వర్షాధార పంటలు సాగు చేయటం ప్రస్తుత పరిస్థితుల్లో ఎంతో లాభదాయకమని సూచించారు. అనంతరం రైతులకు కూరగాయల విత్తనాలు పంపిణీ చేశారు.ఈ సమావేశంలో వ్యవసాయ అధికారి బాబురావు, ఏ డి ఏ రమేష్, తహసిల్దార్ రాజేశ్వరరావు, ఎంపీడీవో భాస్కర్, తెలంగాణ రైతు విజ్ఞాన వేదిక శాస్త్ర వేత్త డా విశ్వతేజ, సర్పంచ్,సింగిల్ విండో చైర్మన్ కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## పర్వతగిరి లో రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ లో వరంగల్ కలెక్టర్, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు







**పర్వతగిరి జూలై 28:**

రైతు సంక్షేమం, అభ్యున్నతే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అన్నారు. మంగళవారం వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన "రైతు నేస్తం" వీడియో కాన్ఫరెన్స్‌లో పర్వతగిరి మండల కేంద్రంలోని రైతు వేదికలో వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారదా దేవితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు అనుసరించాల్సిన వ్యవసాయ వ్యూహాలపై అధికారులు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. నీటి సంరక్షణ పద్ధతులు, ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన పెంపొందించాలని కోరారు.ప్రస్తుత పరిస్థితుల్లో జొన్న, సజ్జ, పెసర, మినుము, కంది వంటి ఆరుతడి పంటలను సాగు చేయాలని రైతులకు విజ్ఞప్తి చేశారు. రాబోయే రోజుల్లో నీటి ఎద్దడి మరింత పెరిగే అవకాశం ఉన్నందున అధిక నీటి అవసరమయ్యే వరి సాగుకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవాలని సూచించారు. కలెక్టర్ సత్య శారద దేవి మాట్లాడుతూ భూగర్భ జలాల పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలించి రైతులకు సరైన సమాచారం అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే పండ్లు,కూరగాయలు, ఆయిల్ పామ్ వంటి ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించేలా వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ఆరుతడి పంటల సాగుకు ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రోత్సాహం అందిస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా వరి సాగుకు బదులుగా ఆరుతడి పంటలు సాగు చేస్తున్న రైతులను శాలువాలతో సత్కరించి, మెమెంటోలు అందజేసి అభినందించారు.ఈ కార్యక్రమంలో మండలఅధ్యక్షురాలు సావిత్రి, జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్, స్థానిక సర్పంచ్ శంకర్, పర్వతగిరి గ్రామశాఖ అధ్యక్షుడు కుసం రామచందర్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, ఏనుమాముల మార్కెట్ డైరెక్టర్ గొడుగు బిక్షపతి, ఐనవోలు దేవస్థానం డైరెక్టర్ వెంకన్న, మండల, గ్రామస్థాయి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, వ్యవసాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రైతు నేస్తంతో ప్రపంచ సమాచారం రైతు ముంగిటికి- కలెక్టర్





**సూర్యాపేట, జులై 28: వుదయం ప్రతినిధి**

వ్యవసాయాన్ని సులభంగా, లాభసాటిగా మార్చేందుకు సాంకేతికతను జోడించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుంచి రైతు నేస్తం 100వ ఎపిసోడ్ సందర్భంగా వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల మండలాల రైతు వేదికల ద్వారా అధికారులు, రైతులతో ఆయన ప్రత్యేకంగా మాట్లాడారు.మంత్రి తుమ్మల కీలక సూచనలు"ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ఆరుతడి పంటలు సాగు చేయాలి. ఉద్యానవన పంటలపై రైతులు దృష్టి పెట్టాలి" అని మంత్రి తుమ్మల సూచించారు.ఆయిల్ పామ్ సాగు వల్ల అధిక లాభాలు వస్తాయని, నేల స్వభావం, నీటి లభ్యత, దిగుబడి, మార్కెటింగ్ సౌకర్యాలను దృష్టిలో ఉంచుకొని పంటలు ఎంచుకోవాలని పేర్కొన్నారు."ప్రతి రైతు పంట మార్పిడి విధానాలు పాటించాలి. మోతాదుకు మించి ఎరువులు వాడొద్దు" అని స్పష్టం చేశారు.రైతు నేస్తం – రైతు ముంగిటికి జ్ఞానం"రైతు నేస్తం కార్యక్రమం ద్వారా ప్రపంచ సమాచారాన్ని మొత్తం రైతు ముంగిట్లో ఉంచుతున్నాం. అధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తల ద్వారా పంటలపై అవగాహన కల్పిస్తున్నాం" అని మంత్రి తెలిపారు. ముమ్మందు మరింత మంది రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొనేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మండల స్థాయి వ్యవసాయ అధికారులు తప్పనిసరిగా ప్రతిరోజు రైతుల మధ్య ఉండాలని సూచించారు.వీడియో కాన్ఫరెన్స్‌లో పలువురు రైతులు పంట మార్పిడి విధానాలు, పొందిన లబ్ధి వివరాలను పంచుకున్నారు. అదే సమయంలో పలువురు ఆదర్శ రైతులను మంత్రి సన్మానించారు.సూర్యాపేటలో కలెక్టర్ పాల్గొన్నారుఈ నేపథ్యంలో జిల్లాలోని నడిగూడెం మండల కేంద్రంలోని రైతు వేదిక నుంచి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ హాజరయ్యారు."రైతు నేస్తం ద్వారా వ్యవసాయ సంబంధ అంశాలపై రైతులకు విస్తృత అవగాహన కలుగుతుంది. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలు సాగు చేసుకోవాలి" అని కలెక్టర్ సూచించారు.అనంతరం ఉత్తమ రైతులు, వ్యవసాయ అధికారులను అభినందించి జ్ఞాపికలు, రైతులకు విత్తనాల ప్యాకెట్లు అందజేశారు.పాల్గొన్నవారుఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి దామోదర్ రెడ్డి, తహసిల్దారు మంగ, ఎంపీడీవో మల్సూర్ నాయక్, ఎడిఎ జ్ఞానేశ్వరి, ప్రశాంతి, ఎంఏఓ జీ మల్సూర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంచడమే లక్ష్యం: మంత్రి సీతక్క

### జలసిరి కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలి



**ములుగు, జూలై 28 (వుదయం ప్రతినిధి) :**

వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'జలసిరి' కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) పిలుపునిచ్చారు. మంగళవారం ములుగు, మల్లంపల్లి మండలాల సర్వసభ్య సమావేశాలు, జలసిరి అవగాహన సదస్సుల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ఎల్ నినో ప్రభావంతో ఏర్పడే వర్షాభావ పరిస్థితులను అధిగమించేందుకు ప్రభుత్వం "ఇంటింటికి ఇంకుడు గుంత – ఊరి కోసం ఊటకుంట – పంట కోసం పంటకుంట" అనే నినాదంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. నీటి ఎద్దడిని నివారించేందుకు ప్రజలు స్వచ్ఛందంగా ఇంకుడు గుంతల నిర్మాణానికి ముందుకు రావాలని కోరారు. గ్రామసభల నిర్వహణకు రాబోయే రెండు రోజుల్లో గ్రామసభలు నిర్వహించి ఉపాధి హామీ కింద గ్రామ పంచాయతీ, మహిళా భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పంటకుంటల నిర్మాణాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఆరుతడి పంటల సాగు, మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు ఆరుతడి పంటలు సాగు చేయాలని, నీటిని పొదుపుగా వాడుకోవాలని విజ్ఞప్తి చేశారు.సమిష్టి కృషితో ప్రతి గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాలు సమన్వయంతో పని చేయాలని స్పష్టం చేశారు. అనంతరం 'జలసిరి' కార్యక్రమ పోస్టర్‌ను మంత్రి ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎం. సంపత్ రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, పంచాయతీరాజ్ డైరెక్టర్ భగవాన్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## ఎల్‌నినో ప్రభావాన్ని తగ్గించేందుకు జలసిరి కార్యక్రమాన్ని విస్తృతంగా అమలు చేయాలి

### అదనపు కలెక్టర్ భాస్కర్ రావు



**యాదాద్రి భువనగిరి జిల్లా, తేది: 28.07.2026**

ప్రతి ఇంటికి ఇంకుడు గుంత – ప్రతి రైతుకు పంటకుంట – ప్రతి ఊరికి ఊటకుంట లక్ష్యంగా పనిచేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు.మంగళవారం ఆలేరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఎల్‌నినో ప్రభావం వల్ల భవిష్యత్తులో నీటి కొరత ఏర్పడకుండా ముందస్తు చర్యల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జలసిరి కార్యక్రమంపై అధికారులు, ప్రజాప్రతినిధులకు అవగాహన కల్పించారు."ప్రతి ఇంటికి ఇంకుడు గుంత – ప్రతి రైతుకు పంటకుంట – ప్రతి ఊరికి ఊటకుంట" అనే లక్ష్యంతో మండలంలోని ప్రతి ఇంటిలో ఇంకుడు గుంతలు, ప్రతి వ్యవసాయ పొలంలో పంటకుంటలు నిర్మించేలా చర్యలుచేపట్టాలనిఅదనపు కలెక్టర్ సూచించారు. భూగర్భ జలాల పెంపునకు బోర్‌వెల్ రీఛార్జ్ పిట్స్, గ్రామాల్లో కమ్యూనిటీ సోక్ పిట్స్ నిర్మాణానికి ప్రత్యేకంగా చర్యలు తీసుకోవాలని సర్పంచులను కోరారు. మహిళా సంఘాల సభ్యులు కూడా జలసిరి కార్యక్రమంలో భాగస్వాములు కావాలని, తమ ఇళ్లలో, వ్యవ సాయ పొలాల్లో ఇంకుడు గుంతలు, పంటకుంటలు నిర్మించుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. నీటి సంరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని తెలిపారు.అనంతరం ఘన వ్యర్థాల నిర్వహణ–2026 నిబంధనలు, సూర్య ఘర్ యోజన ద్వారా అందుబాటులో ఉన్న సౌర విద్యు త్ అవకాశాలపై అవగాహన కల్పిం చారు. గ్రామాల్లో ఘన వ్యర్థాలను సక్రమంగా నిర్వహించడంతో పాటు, సౌర విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులు, సర్పంచులకు సూచిం చారు. నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపు, పర్యావరణ పరిరక్షణ కోసం ప్రజాప్రతినిధులు, అధికారులు, మహి ళా సంఘాలు సమన్వయంతో పనిచేసి జలసిరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అదనపు కలెక్టర్ భాస్కర్ రావు కోరారు.ఈ సమావేశంలో క్లస్టర్ స్పెషల్ ఆఫీసర్, డీపీఓ శ్రీనివాస్ రెడ్డి, మండల స్పెషల్ ఆఫీసర్ వెంకటరమణారెడ్డి, ఎంపీడీవో సత్యంజనేయ ప్రసాద్, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ మహిళా సంఘాల బుక్ కీపర్లు, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## తక్కువ నీటి వినియోగంతో ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి

### - జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి

### - వైభవంగా 'రైతు నేస్తం' 100వ ఎపిసోడ్



**హనుమకొండ/ఎల్కతుర్తి, జూలై 28 (వుదయం ప్రతినిధి) :**

వర్షాభావ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని రైతులు తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ, ఆరుతడి పంటలను సాగు చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి సూచించారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'రైతు నేస్తం' 100వ ఎపిసోడ్ వీసీ కార్యక్రమం ఎల్కతుర్తి రైతు వేదికలో ఘనంగా జరిగింది. హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు పాల్గొని రైతులతో మాట్లాడారు. రైతులకు శాస్త్రీయ విజ్ఞానాన్ని అందించడంలో 'రైతు నేస్తం' కీలక పాత్ర పోషిస్తోందని మంత్రి పేర్కొన్నారు.అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, వర్షాలు తక్కువగా ఉన్నందున పెసర, కందులు, నువ్వులు, మినుములు వంటి తక్కువ కాలపరిమితి కలిగిన పంటలను ఎంచుకోవాలని కోరారు. ఖాళీ భూములను ఉంచకుండా ప్రత్యామ్నాయ పంటలు వేయడం ద్వారా ఆదాయంతో పాటు భూసారం పెరుగుతుందన్నారు. రైతు వేదికల ద్వారా శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ సందర్భంగా 100వ ఎపిసోడ్ పురస్కరించుకుని ప్రగతిశీల రైతులకు సన్మానం చేసి, విత్తనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్కతుర్తి సర్పంచ్ లావణ్య, జిల్లా వ్యవసాయ అధికారి విజయ్ చంద్ర, ఏడీఏ ఆదిరెడ్డి, ఉద్యాన శాఖ అధికారి కమలాకర్ రెడ్డి, తహసీల్దార్ ప్రసాదరావు, ఎంపీడీవో విజయ్ కుమార్, వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## కరీంనగర్ |అదిలాబాద్ | నిజామాబాద్ - ఉమ్మడి జిల్లాల వార్తలు

# 100వ వారంలోకి అడుగుపెట్టిన రైతు నేస్తం కార్యక్రమం విజయవంతం చేయాలి: కలెక్టర్

**పెద్దపల్లి, జూలై-28 (వుదయం ప్రతినిధి)**

**99 వారాలు విజయవంతంగా పూర్తి చేసుకున్న రైతు నేస్తం కార్యక్రమం**

**ఉత్తమ రైతులు, వ్యవసాయ విస్తరణ అధికారులను సన్మానించిన కలెక్టర్**

**రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా అధికారులు, రైతులు**

**రైతు నేస్తం 100వ వారోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్**



రైతులకు ఆధునిక సాగు పద్ధతులు, సాంకేతిక పరిజ్ఞానం, పంటల నిర్వహణపై నిరంతర అవగాహన కల్పిస్తున్న రైతు నేస్తం కార్యక్రమం విజయవంతంగా 99 వారాలు పూర్తి చేసుకుని 100వ వారంలోకి అడుగుపెట్టడం సంతోషకరమని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు.మంగళవారం పెద్దపల్లి మండలంలోని రాఘవపూర్ రైతు వేదికలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన రైతు నేస్తం ప్రత్యేక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, రైతులకు ప్రతి వారం వ్యవసాయ నిపుణుల ద్వారా అందుతున్న సూచనలు వ్యవసాయ రంగంలో సానుకూల మార్పులకు దోహదపడుతున్నాయని అన్నారు. రైతులు శాస్త్రీయ సాగు విధానాలను అవలంబించి అధిక దిగుబడులు సాధించాలని, ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజూ, వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి సురేంద్ర మోహన్, వ్యవసాయ శాఖ సంచాలకులు గోపీ, ఉద్యానవన శాఖ సంచాలకులు యాస్మిన్ బాషా పాల్గొని రైతులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా జిల్లాలో వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన రైతులు, వ్యవసాయ విస్తరణ అధికారులను జిల్లా కలెక్టర్ జ్ఞాపికలు అందించి సన్మానించారు. సన్మానం పొందిన రైతులు: మాదాసు భూమయ్య, పాలకుర్తి గ్రామం, పాలకుర్తి మండలం – బహుళ పంటల సాగులో ప్రతిభ కనబరిచిన రైతు. జునేని శ్యాంసుందర్ రావు, శివపల్లి గ్రామం, ఎలిగేడు మండలం – ఆయిల్‌పామ్ సాగులో ఉత్తమ రైతు. గుర్రాల రాజయ్య, గుండారం గ్రామం, కమాన్‌పూర్ మండలం – ఆయిల్‌పామ్‌తో పాటు కాజురినా అంతర పంటల సాగులో ఆదర్శ రైతు. సన్మానం పొందిన వ్యవసాయ విస్తరణ అధికారులు (AEOలు): ఎం. ఈశ్వర్ రెడ్డి – ఏఈఓ, శ్రీరాంపూర్. ప్రత్యూష – ఏఈఓ, మంథని.అనంతరం పెద్దపల్లి మండలం రాఘవపూర్ లో నూతనంగా నిర్మించబోయే జిల్లా కోర్టు భవన స్థలాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్, అదనపు సంచాలకులు శ్రీనాథ్, మండల వ్యవసాయ అధికారి నాగార్జున, వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యం:


**రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**




**నిర్మల్ జిల్లా 28 జూలై 2026 (వుదయం ప్రతినిధి)**

వ్యవసాయ రంగాన్ని మరింత సులభతరం చేసి, రైతులకు లాభదాయకంగా తీర్చిదిద్దడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. మంగళవారం హైదరాబాద్ నుంచి నిర్వహించిన 'రైతు నేస్తం' 100వ ఎపిసోడ్ ప్రత్యేక కార్యక్రమంలో మంత్రి పాల్గొని రాష్ట్రవ్యాప్తంగా రైతులను ఉద్దేశించి ప్రసంగించారు. అన్ని జిల్లాల మండల కేంద్రాల్లోని రైతు వేదికల ద్వారా అధికారులు, రైతులు ఈ కార్యక్రమంలో వర్చువల్‌గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు పంటల సాగులో మార్పులు చేసుకోవాలని సూచించారు. ఆరుతడి పంటలు, ఉద్యానవన పంటలు, ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహిస్తూ, నేల స్వభావం, నీటి లభ్యత, మార్కెట్ అవకాశాలను దృష్టిలో ఉంచుకుని పంటల మార్పిడి విధానాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. రసాయన ఎరువులను మోతాదుకు మించి వినియోగించకుండా శాస్త్రీయ పద్ధతులను అనుసరించాలని కోరారు.'రైతు నేస్తం' కార్యక్రమం ద్వారా ప్రపంచ స్థాయి వ్యవసాయ సాంకేతికత, శాస్త్రీయ సూచనలను రైతులకు అందిస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని, మండల స్థాయి వ్యవసాయ అధికారులు రైతులకు నిరంతరం అందుబాటులో ఉంటూ క్షేత్రస్థాయిలో మార్గనిర్దేశం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో పంట మార్పిడి ద్వారా విజయాలు సాధించిన ఆదర్శ రైతులను మంత్రి సన్మానించారు. సోన్ మండల రైతు వేదిక నుంచి జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రైతులు 'రైతు నేస్తం' కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులను అవలంబించాలని సూచించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ప్రణాళికాబద్ధంగా పంటల సాగు చేపట్టాలని రైతులకు విజ్ఞప్తి చేశారు.అనంతరం ఉత్తమ సేవలందించిన రైతులు, వ్యవసాయ అధికారులను అభినందించి జ్ఞాపికలు అందజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, ఉద్యానవన శాఖ అధికారి రమణ, పీఏసీఎస్ ఛైర్మన్ కృష్ణప్రసాద్ రెడ్డి, తహశీల్దార్ సంతోష్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తగిలి మేకపోతు మృతి



**ధర్మపురి, జూలై 28 (వుదయం ప్రతినిధి):**

విద్యుత్ షాక్‌తో మేకపోతు మృతిచెందిన సంఘటన ధర్మపురి మండలంలోని జైన శివారులో చోటు చేసుకుంది. బాధితుని కథనం ప్రకారం రాజారాం గ్రామానికి చెందిన తాడుక తిరుపతి తన మేకలను మేపేందుకు గ్రామానికి సమీపం లోని జైన శివారుకు తీసుకెళ్లాడు. మేత మేస్తున్న క్రమంలో అక్కడే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వైర్లు తగలడంతో విద్యుదాఘాతానికి గురై మేకపోతు అక్కడికక్కడే మృతిచెందింది. చనిపోయిన మేకపోతు విలువ సుమారు 20 వేల రూపాయలు ఉంటుందని, ప్రభుత్వం స్పందించి పరిహారం అందించి తనను ఆదుకోవాలని బాధితుడు కోరాడు. ఈ వర్షా కాలంలో మూగజీవాలకు ఇలాంటి ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువ ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి ఘటనలు మరోసారి పునరావృతం కాకుం డా విద్యుత్ శాఖ అధికారులు వెంటనే స్పందించి, ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ రక్షణ కంచెలను ఫెన్సిం గ్ ఏర్పాటు చేయాలని కోరుతు న్నారు.

# వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి

**రైతు నేస్తం కార్యక్రమంలో మంత్రి తుమ్మల సూచన**

**మారుపాక రైతు వేదికలో పాల్గొన్న కలెక్టర్**

**వేములవాడ, జూలై 28 (వుదయం ప్రతినిధి) :**



రైతులు వరికి బదులుగా నీటి వినియోగం తక్కువగా ఉండే ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. రైతులకు వ్యవసాయంపై శాస్త్రీయ అవగాహన కల్పించేందుకు నిర్వహిస్తున్న 'రైతు నేస్తం' 100వ ఎపిసోడ్ కార్యక్రమంలో మంగళవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన మాట్లాడారు. వేములవాడ అర్బన్ మండలం మారుపాక రైతు వేదిక నుంచి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పాల్గొన్నారు.మంత్రి మాట్లాడుతూ వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వం ఆధునిక సాంకేతికతను అందుబాటులోకి తీసుకొస్తోందన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఆరుతడి, ఉద్యానవన పంటల సాగుపై రైతులు దృష్టి పెట్టాలని సూచించారు. ఆయిల్‌పామ్ సాగు లాభదాయకమని, నేల స్వభావం, నీటి లభ్యత, మార్కెట్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని పంటల ఎంపిక చేసుకోవాలని తెలిపారు. పంట మార్పిడి విధానాన్ని తప్పనిసరిగా పాటించాలని, అధికంగా ఎరువులు వినియోగించరాదన్నారు. రైతు నేస్తం కార్యక్రమం ద్వారా వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలు రైతులకు చేరుతున్నాయని, మండల వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు.అనంతరం కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది జిల్లాలో సాధారణంతో పోలిస్తే 36 శాతం తక్కువ వర్షపాతం నమోదైందన్నారు. భూగర్భ జలాలు తగ్గుముఖం పట్టాయని, ప్రస్తుత పరిస్థితుల్లో వరి సాగుకు బదులుగా ఆయిల్‌పామ్, రాగులు, సజ్జలు, కొర్రలు, జొన్నలు, నువ్వులు, మొక్కజొన్న వంటి ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని రైతులకు సూచించారు.ఎగువ మానేరు, శ్రీ రాజ రాజేశ్వర (మిడ్ మానేరు), మల్కపేట, అన్నపూర్ణ రిజర్వాయర్లలో తాగునీటికి సరిపడా నీరు ఉందన్నారు. తెలంగాణ జలసిరి కింద బోర్‌వెల్ రీచార్జ్, ఫామ్ పాండ్ల నిర్మాణం, జల సంరక్షణ పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాలంలో ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టాలని, తద్వారా రబీ సీజన్‌లో నీటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. సీజనల్ వ్యాధుల నివారణకు వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ, మరిగించి చల్లార్చిన నీటినే తాగాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వేములవాడ మార్కెట్ కమిటీ ఛైర్మన్ రొండి రాజు, ఆత్మ కమిటీ అధ్యక్షుడు ముస్కు ముకుందరెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం, రైతు విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త సాయికుమార్, తహసీల్దార్ జయంత్ కుమార్, వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

## భారీ నుంచి అత్యంత భారీ వర్షాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్



**ఆసిఫాబాద్ (వుదయం ప్రతినిధి)**

భారత వాతావరణ శాఖ ప్రాంతీయ వాతావరణ కేంద్రం, నాగ్‌పూర్ విడుదల చేసిన తాజా వాతావరణ హెచ్చరికల ప్రకారం ఈ నెల 28 నుండి 31వ తేదీ వరకు పలు ప్రాంతాలలో ఉరుములు, మెరుపులు, గంటకు 40–50 కి.మీ. వేగంతో ఈదురుగాలులతో కూడిన భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కె.హరిత ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, లోతట్టు ప్రాంతాలు, నీరు నిలిచే ప్రాంతాలు, వాగులు, వంకలు, నదుల సమీపాలకు వెళ్లకుండా ఉండాలని, ఉరుములు, మెరుపుల సమయంలో చెట్ల కింద, విద్యుత్ స్తంభాల సమీపంలో ఉండరాదని తెలిపారు. భారీ వర్షాల కారణంగా రహదారులపై నీరు నిలువడం, రవాణాకు అంతరాయం కలగడం, లోతట్టు ప్రాంతాలు జలమయం కావడం, బలహీన నిర్మాణాలకు నష్టం కలిగే అవకాశం ఉందని, రైతులు పంటలు, వ్యవసాయ పరికరాల రక్షణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజలు స్థానిక అధికార యంత్రాంగం, వాతావరణ శాఖ జారీ చేసే తాజా హెచ్చరికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ తగిన జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. ప్రజారక్షణలో అధికార యంత్రాంగం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని తెలిపారు.

# గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణను ప్రాధాన్యతగా తీసుకోవాలి... కలెక్టర్

**కోరుట్ల జులై 28 (వుదయం ప్రతినిధి)**

**సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకు ఘన వ్యర్థాల నిర్వహణను పకడ్బందీగా అమలు చేయాలి...**

**చెత్తను నాలుగు రకాలుగా వర్గీకరించే విధానంపై ప్రతి కుటుంబానికి అవగాహన కల్పించాలి...**

**వీబీజీఆర్ఏఎం నిధులతో శాశ్వత ఆస్తుల నిర్మాణానికి ప్రాధాన్యత ఇవ్వాలి...**



గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణను అత్యున్నత ప్రాధాన్యతగా తీసుకొని సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకు ఘన వ్యర్థాల నిర్వహణను సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ బి సత్య ప్రసాద్ అధికారులను సర్పంచ్ లను ఆదేశించారు. మంగళవారం కోరుట్ల పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్ లకు ఎల్‌నినో ప్రభావం ప్రత్యామ్నాయ పంటల సాగు గ్రామీణ పారిశుద్ధ్యం ఘన వ్యర్థాల నిర్వహణ వీబీజీఆర్ఏఎం నిధుల వినియోగంపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ పాల్గొని పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ మాట్లాడుతూ ఇటీవల సిద్దిపేట ఖమ్మం జిల్లాల్లో ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ ఫ్యాక్టరీలు ప్రారంభమయ్యాయని భవిష్యత్తులో జగిత్యాల జిల్లాలో కూడా ప్రత్యేక ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ఏర్పాటు కానుందని తెలిపారు. ఎల్‌నినో పరిస్థితుల దృష్ట్యా రైతులు నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. గ్రామాల్లో ఘన వ్యర్థాల నిర్వహణను సుప్రీంకోర్టు ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తోందని సుప్రీంకోర్టు తాజా తీర్పుల మేరకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతుండగా వాటి అమలుపై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రతి వారం అఫిడవిట్ సమర్పిస్తున్నారని తెలిపారు. అందువల్ల గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలను అత్యంత బాధ్యతాయుతంగా నిర్వహించాలని సూచించారు. ప్రతి గ్రామంలో నిర్మించిన సెగ్రిగేషన్ షెడ్లను కేవలం ప్రదర్శన కోసమే కాకుండా పూర్తి స్థాయిలో వినియోగించాలని కలెక్టర్ ఆదేశించారు ప్రతి గ్రామంలో పొడి వ్యర్థాలు (డ్రై వేస్ట్) తడి వ్యర్థాలు (వెట్ వేస్ట్) ఎలక్ట్రానిక్ వ్యర్థాలు (ఈ వేస్ట్) వైద్య వ్యర్థాలు (మెడికల్ వేస్ట్) అనే నాలుగు రకాలుగా చెత్తను వర్గీకరించే విధానాన్ని తప్పనిసరిగా అమలు చేయాలని తెలిపారు. ప్రతి కుటుంబానికి చెత్తను వేర్వేరుగా అందించే అలవాటు ఏర్పడేలా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. నాలుగు రకాల వ్యర్థాల సేకరణ నిర్వహణకు అవసరమైన డంపింగ్ ప్రదేశాలను జిల్లా యంత్రాంగం గుర్తిస్తోందని వాటి సేకరణకు అవసరమైన సామగ్రిని గ్రామపంచాయతీలపై ఎలాంటి అదనపు ఆర్థిక భారం లేకుండా ప్రభుత్వం అందజేస్తుందని తెలిపారు. రాబోయే ఒక నెల రోజుల పాటు గ్రామసభలు నిర్వహిస్తూ నిత్య చెత్త సేకరణ చెత్త వర్గీకరణపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు అనంతరం వర్గీకరించని చెత్తను సేకరించబోమనే సందేశాన్ని ప్రతి ఇంటికి చేరేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ విధానం సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారమే అమలు చేయబడుతోందని స్పష్టం చేశారు స్వయం సహాయక సంఘాల మహిళలు ప్రజాప్రతినిధులు ఘన వ్యర్థాల నిర్వహణ కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు మండల అభివృద్ధి అధికారులు గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలను నిరంతరం పర్యవేక్షిస్తూ సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. వీబీజీఆర్ఏఎం నిధులను కేవలం రహదారులు డ్రైన్ల నిర్మాణానికే పరిమితం చేయకుండా గ్రామాలకు శాశ్వత ప్రయోజనం చేకూర్చే పాఠశాల ప్రహరీ గోడలు గ్రామపంచాయతీ భవనాలు సైన్స్ ల్యాబ్‌లు ఇతర మౌలిక వసతులు శాశ్వత భవనాల నిర్మాణానికి వినియోగించాలని సూచించారు. సర్పంచ్‌ల పదవీకాలం చివరి సంవత్సరంలో పనులు ప్రారంభిస్తే పూర్తి చేయడం కష్టమవుతుందని ఇప్పటి నుంచే గ్రామాభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా చేపట్టి శాశ్వత ఆస్తుల సృష్టికి ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు ఈ సమావేశంలో కోరుట్ల ఆర్డీవో జీవాకర్ రెడ్డి తహసీల్దార్ కృష్ణ చైతన్య ఎంపిడివో రామకృష్ణ సంబంధిత శాఖల అధికారులు సర్పంచ్ లు స్థానిక ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# మద్యం తాగి వాహనం నడిపితే ఇక జైలే

**డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వ్యక్తికి 3రోజులు శిక్ష**

**జగిత్యాల సబ్ జైలుకు తరలింపు**




**బుగ్గారం, జూలై 28(వుదయం ప్రతినిధి):**

మద్యం సేవించి వాహనాలు నడిపితే జైలు శిక్ష తప్పదని బుగ్గారం ఎస్సై జి.సతీష్ హెచ్చరించారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన మద్దు నూరు గ్రామానికి చెందిన గజ్జెల మొండయ్యకు ధర్మపురి ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ జానకి మూడు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఆయన తెలిపారు. జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, డీఎస్పీ పురుషో త్తం రెడ్డి, ధర్మపురి సీఐ ఎ.రాంనర్సింహరెడ్డి సూచనలతో బుగ్గారం పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన తనిఖీల్లో మొండయ్య మద్యం తాగి వాహనం నడుపు తూ పట్టుబడ్డాడు.మంగళవారం ఆయనను మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా, న్యాయమూర్తి మూడు రోజుల జైలు శిక్ష ఖరా రు చేశారు.దీంతో ఆయనను జగిత్యాల సబ్‌జైలుకు తరలిం చినట్లు ఎస్సై పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ వాహనదారులు ప్రయా ణాల్లో తప్పనిసరిగా హెల్మెట్, సీటుబెల్టు ధరించాలని, అతి వేగం ముప్పని సూచించారు. మైనర్ పిల్లలకు వాహనాలు ఇచ్చే తల్లిదండ్రులపైనా కఠినచర్యలుఉంటాయని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించా లని కోరారు.

# సహజ సేద్యంతోనే నేలకు, పంటలకు రక్షణ

**- రసాయన ఎరువుల వినియోగం తగ్గించాలి: - కలెక్టర్**

**ఆదిలాబాద్, జూలై 28:**



రసాయనిక ఎరువుల అధిక వినియోగాన్ని తగ్గించి ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు మొగ్గు చూపాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా పిలుపునిచ్చారు. మంగళవారం వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఉన్నతాధికారులతో నిర్వహించిన రైతు నేస్తం 100వ ఎపిసోడ్ కార్యక్రమాన్ని ఉట్నూర్ రైతు వేదిక నుంచి ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, అధికారులు, రైతులతో కలిసి కలెక్టర్ వీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యూరియా, డీఏపీ వంటి ఎరువుల మితిమీరిన వినియోగం వల్ల నేల ఆరోగ్యం దెబ్బతింటుందని అన్నారు. ఆవు పేడ, సేంద్రియ ఎరువుల వినియోగంతో భూసారం పెరుగుతుందని తెలిపారు. వర్షపాతం లోటు నేపథ్యంలో అంతరసేద్యం, మల్చింగ్ పద్ధతులతో తేమను కాపాడుకోవాలని సూచించారు. నీటి సంరక్షణకు ప్రాధాన్యం ఫార్మ్ పాండ్లు, ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా భూగర్భ జలాలను పెంచుకోవచ్చని తెలిపారు. ప్రత్యామ్నాయ పంటలు, ఆయిల్‌పామ్ సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని, మైక్రో ఇరిగేషన్‌కు భారీ సబ్సిడీలు అందిస్తున్నామని చెప్పారు. జిల్లాకు మరో 1,350 మెట్రిక్ టన్నుల డీఏపీ రానుందని, పట్టా లేని రైతులకు కూడా యాప్ ద్వారా ఎరువులు అందించే అవకాశం కల్పించామని పేర్కొన్నారు. నానో ఎరువుల వినియోగం ప్రయోజనకరమని, జొన్న కొనుగోలు బకాయిలు రూ.130కోట్లు త్వరలో రైతుల ఖాతాల్లో జమ చేస్తామని తెలిపారు.సేంద్రియ పద్ధతులతోనే భవిష్యత్ వ్యవసాయం సేంద్రియ సాగు వైపు రైతులు అడుగులు వేయాలి:ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుశాస్త్రవేత్తల సూచనలు పాటిస్తూ రైతులు సాగు చేయాలని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు సూచించారు. వాతావరణ మార్పులకు అనుగుణంగా పంటల విధానాల్లో మార్పులు తీసుకురావాలని, పూర్వకాలపు సేంద్రియ వ్యవసాయ పద్ధతుల వైపు మళ్లాలని కోరారు.
ప్రైవేట్ వ్యాపారులు చెప్పే ఆచరణ సాధ్యం కాని విత్తనాలు, ఎరువుల విషయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తక్కువ నీటితో అధిక ఆదాయం ఇచ్చే ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించేందుకు ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు కృషి చేస్తామని తెలిపారు.రైతులకు సన్మానంఉత్తమ ప్రతిభ కనబరిచిన వ్యవసాయ అధికారులను, ఆదర్శ రైతులను కలెక్టర్, ఎమ్మెల్యేలు మెమెంటోలతో సత్కరించారు. అనంతరం రైతులకు మొక్కలు పంపిణీ చేసి, రైతువేదికలో ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ మోహన్‌సింగ్, జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్, అధికారులు, ప్రజా ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

## ప్రత్యామ్నాయ పంటలతో రైతులు ఆర్థిక లబ్ది పొందాలి-కలెక్టర్



**మంచిర్యాల/జూలై 28 (వుదయం ప్రతినిధి)**

రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావంతో వరి సాగు కష్టతరమైన నేపథ్యంలో రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసి ఆర్థికంగా లబ్ది పొందాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని కాసిపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన రాయితీ విత్తనాలు, ఎరువుల పంపిణీ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సాగులో ఉన్న భూములకు మాత్రమే రైతు భరోసా పథకం వర్తిస్తుందని, రైతులు ప్రభుత్వ సూచనలను పాటిస్తూ ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసి ఆర్థికంగా లబ్ధి పొందాలని తెలిపారు. వరి సాగు మినహా పంట రకాన్ని ఎంచుకోవాలని, తక్కువ నీటి అవసరం గల పంటలను సాగు చేసి లబ్ధి పొందాలని తెలిపారు. ఈ క్రమంలో రైతులకు రాయితీ విత్తనాలు, ఎరువులు అందించడం జరుగుతుందని, రైతులు తమ సాగు విస్తీర్ణానికి అనుగుణంగా ఎరువులు, విత్తనాలు పొందాలని తెలిపారు. మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి అదనపు గదులు, భోజనశాల నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. వంటశాలను పరిశీలించి ఆహారం తయారీ సమయంలో వంట సిబ్బంది శుభ్రత నిబంధనలు పాటించాలని, విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలని తెలిపారు. వర్షాకాలం దృష్ట్యా విద్యార్థుల ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## తప్పుడు ఆధారాలతో భూపట్టా - ప్రజావాణిలో ఫిర్యాదు

**విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్న తహసీల్దార్**



**జన్నారం, జూలై 28 (వుదయం విలేఖరి)**

జన్నారం మండలం ధర్మారం గ్రామానికి చెందిన దుర్గం చంద్రశేఖర్ తన తాత ముత్తాతల నుండి అనుభవిస్తున్న తన సొంత భూమిని తప్పుడు ఆధారాలతో భూ పట్టా పొందారని ఆరోపిస్తూ బాధితుడు సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో తహసిల్దార్ బక్కయ్యకు ఫిర్యాదు చేశారు.అదే గ్రామానికి చెందిన తన తమ్ముడు, వదిన అధికారులకు తప్పుడు ధృవపత్రాలు సమర్పించి దొంగ పట్టా చేసుకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఫిర్యాదును స్వీకరించిన తహసీల్దార్ బక్కయ్య మాట్లాడుతూ, సంబంధిత రికార్డులను పరిశీలించి పూర్తి విచారణ జరిపి నివేదికను కలెక్టర్‌కు పంపిస్తామని తెలిపారు. అక్రమాలు తేలితే నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# మహబూబ్‌నగర్ | మెదక్ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## జాతీయ సదస్సు విజయవంతానికి విస్తృత ఏర్పాట్లు

- అధికారులు, ఐక్య విద్యార్థి సంఘాలతో ఉపకులపతి, రిజిస్ట్రార్ సమీక్ష సమావేశాలు

**మహబూబ్‌నగర్ జిల్లా 28,జూలై (వుదయం బ్యూరో)**




పాలమూరు యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఆగస్టు 7, 8 తేదీలలో నిర్వహించనున్న ప్రతిష్ఠాత్మక రెండు రోజుల జాతీయ సదస్సు విజయవంతం కోసం యూనివర్సిటీ యంత్రాంగం విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేపట్టింది. ఈ నేపథ్యంలో ఉపకులపతి ఆచార్య జి.ఎన్. శ్రీనివాస్, రిజిస్ట్రార్ ఆచార్య పి. రమేష్‌బాబు, విశ్వవిద్యాలయ అధికారులతో కలిసి ఐక్య విద్యార్థి సంఘాల ప్రతినిధులతో పలు దఫాలుగా సమావేశాలు నిర్వహించి సదస్సు నిర్వహణకు సంబంధించిన అన్ని అంశాలపై సమగ్రంగా సమీక్షించారు.సదస్సుకు దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి ప్రముఖ విద్యావేత్తలు, విశ్వవిద్యాలయాల ఉపకులపతులు, రిజిస్ట్రార్లు, శాస్త్రవేత్తలు, విధాన రూపకర్తలు, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరుకానున్న నేపథ్యంలో వసతి, రవాణా, ఆతిథ్యం, భద్రత, నమోదు ప్రక్రియ, వేదికల నిర్వహణ, స్వచ్ఛంద సేవలు, రాకపోకల సమన్వయం తదితర అంశాలపై విద్యార్థి సంఘాల ప్రతినిధులతో సవివరంగా చర్చించారు. సదస్సు నిర్వహణలో విద్యార్థులు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ సంపూర్ణ సహకారం అందించాలని అధికారులు కోరారు.

ఈ సందర్భంగా ఉపకులపతి ఆచార్య జి.ఎన్. శ్రీనివాస్ మాట్లాడుతూ, ఆగస్టు 7వ తేదీన జాతీయ సదస్సు ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని కన్హా శాంతి వనంలో ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆగస్టు 8వ తేదీన రెండో రోజు సాంకేతిక సమావేశాము, క్యాంపస్ విజిట్, విద్యార్థులతో సమావేశము, ప్రత్యేక ఉపన్యాసాలు, వివిధ అకడమిక్ కార్యక్రమాలను పాలమూరు యూనివర్సిటీ ప్రాంగణంలో నిర్వహిస్తామని వెల్లడించారు.ఈ రెండు రోజుల జాతీయ సదస్సులో దేశంలోని ప్రముఖ విశ్వవిద్యాలయాల ఉపకులపతులు, రిజిస్ట్రార్లు, ప్రముఖ విద్యావేత్తలు, శాస్త్రవేత్తలు, పరిశ్రమల ప్రతినిధులు, అధ్యాపకులు, పరిశోధకులు పాల్గొని ఉన్నత విద్యాభివృద్ధి, పరిశోధన, నైపుణ్యాభివృద్ధి, యువత సాధికారత, అభివృద్ధి చెందిన భారత నిర్మాణంలో విశ్వవిద్యాలయాల పాత్ర వంటి సమకాలీన అంశాలపై తమ ఆలోచనలు, అనుభవాలను పంచుకోనున్నారని తెలిపారు.ఈ జాతీయ సదస్సు పాలమూరు యూనివర్సిటీకి జాతీయ స్థాయిలో విశిష్ట గుర్తింపును తీసుకురావడంతో పాటు విద్యార్థుల్లో పరిశోధనా దృక్పథం, నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యతను పెంపొందించేందుకు దోహదపడుతుందని ఉపకులపతి పేర్కొన్నారు.ఐక్య విద్యార్థి సంఘాల ప్రతినిధులు సదస్సు విజయవంతానికి తమ సంపూర్ణ సహకారాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు. జాతీయ సదస్సును ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించి పాలమూరు యూనివర్సిటీ ప్రతిష్ఠను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు అధ్యాపకులు, విద్యార్థులు, అధికారులు సమన్వయంతో కృషి చేయాలని ఉపకులపతి ఆచార్య జి.ఎన్. శ్రీనివాస్, రిజిస్ట్రార్ ఆచార్య పి. రమేష్‌బాబు పిలుపునిచ్చారు.

కార్యక్రమం లో ఓ ఎస్ డి టూ వీసీ డా మధుసూదన్ రెడ్డి ,ఎస్సీ ఎస్టీ డైరెక్టర్ నాగం కుమార స్వామి , ప్రొఫెసర్ ఎం. నూర్జహాన్, MSF అధ్యక్షులు కార్తీక్, జేఏసీ చైర్మన్ బత్తిన రాము, జేఏసీ కన్వీనర్ సాయి అభినయ్, బి ఆర్ ఎస్ వి భరత్, తయాప్ప, బి ఆర్ ఎస్ వి వైస్ ప్రెసిడెంట్ సుదీప్ రెడ్డి, పిడిఎసు జిల్లా అధ్యక్షులు మారుతీ తదితరులు పాల్గొన్నారు.

## చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

- అక్రమ లావాదేవీలు నడుపుతున్న వారిపై చర్యలు తీసుకోవాలి
- జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేసిన అఖిలపక్ష నాయకులు

**నారాయణపేట జూలై 28 (వుదయం ప్రతినిధి)**

చేనేత సహకార సంఘాలలో కొంతమంది కోట్ల రూపాయల అక్రమ లావాదేవీలు నడుపుతున్నారని వారి పైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మంగళవారం నారాయణపేట జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంకకి అఖిలపక్ష నాయకులు ఫిర్యాదు చేశారు . సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ నారాయణపేట పట్టణ కార్యదర్శి కించే నారాయణ , బీఎస్పీ జిల్లా నాయకులు అశోక్ ఎంఐఎం పట్టణ నాయకులు తహేర్, తెలుగుదేశం పార్లమెంట్ స్థాయి కార్యదర్శి రాఘవరావు చౌదరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు కలెక్టర్ తో మాట్లాడుతూ ముడి సర్కుల ధరలు పెరగడం, .నారాయణ పేట పట్టణంలో 1951 సంవత్సరం నుంచి అనగా 75 సంవత్సరాలుగా సహకార సంఘాలు ఉన్నప్పటికీ కార్మికులకు ఎలాంటి ప్రయోజనం చేకూరా లేదన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు కార్మికుల సంక్షేమమును కాపాడడం లేదన్నారు. చేనేత కార్మికుల పొదుపు, పిఎఫ్, నేతన్న చేయూత భీమా కింద ఐదు లక్షల బీమా పథకం వంటి సంక్షేమ పథకాలాన్ని సొసైటీ అధ్యక్షుల వారి దయ దక్షిణ మీద ఆధారపడే పరిస్థితి ఏర్పడుతుందన్నారు.నారాయణపేట పట్టణంలో గాంధీ నగర్ కాలనీ చేనేత కార్మికులకు సొసైటీ ద్వారా 100 మంది కార్మికులకు ఇండ్లు నిర్మించి ఇచ్చారని గుర్తు చేశారు.నిర్మాణ వ్యయం ఖర్చులు కూడా కార్మికులు కిస్తుల ప్రకారం సొసైటీలకు చెల్లించి ఎలాంటి బాకీ లేకుండా ఉన్నారు. అయితే నేటి వరకు సొసైటీ వారు కార్మికులకు ఇంటి యాజమాన్యపు హక్కులు కల్పించలేదని అన్నారు. ఎన్నికలు నిర్వహించిన 11 సొసైటీలో కూడా కార్మికులు లేకున్నప్పటికిని సహకార సంఘాల అధ్యక్షులు ఏడిని ,ఏడిఓను మేనేజ్ చేసి ఎన్నికలు నిర్వహించారని వివరించారు. 2009 నుండి 2024 వరకు సొసైటీ రికార్డుల ప్రకారం 51 కోట్ల లావాదేవీలు జరిగినట్లు తెలుస్తోందని అన్నారు.అయితే చేనేత కార్మికులు ఉత్పత్తి చేస్తున్న ఉత్పత్తులను సొసైటీలు ఏనాడు కూడా తీసుకోలేదు అన్నారు. పట్టణంలో ఉన్న బట్టల షాపు యజమానుల ద్వారా పూనే, మహారాష్ట్రలలో పవర్ లూమ్స్ ద్వారా తయారైన బట్టను అతి తక్కువ ధరకు తెచ్చి సొసైటీల పూరితంగా ఉత్పత్తి అయిందని పూరితంగా రాష్ట్ర జౌళి శాఖ టెస్కోకి అమ్మేసి కోట్ల రూపాయలు సొమ్ము చేసుకుంటున్న వైనం నారాయణపేట జిల్లా చేనేత సొసైటీలో జరుగుతున్నట్లు గుర్తు చేశారు. గాంధీనగర్ సొసైటీ ఆస్తులు ఒక్కొక్కటి అన్యాక్రాంతం అవుతున్నదని సొసైటీ ఆస్తులను కాపాడాలని కోరారు.



కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సొసైటీల అక్రమాలపై ప్రత్యేక విచారణ చేపట్టాలని కలెక్టర్ కి అఖిలపక్షం నేతలు కోరారు .ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు సిపిఎం సోషల్ మీడియా పట్టణ కన్వీనర్ సోఫీ మజార్ హుస్సేన్, తెలుగుదేశం నాయకులు యాబన్న చౌదరి ,కాంగ్రెస్ నాయకులు తుల్జారం, చేనేత కార్మిక సంఘం పట్టణ అధ్యక్షులు తులసి, బీఎస్పీ నాయకులు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



## అల్ట్రా రన్ విజేత కు ఘన సన్మానం

- పూణే–బారామతి అల్ట్రా రన్ పూర్తి చేసి సిద్ధిపేటకు గుర్తింపు తెచ్చిన రన్నర్ రాజు

**వుదయం , సిద్ధిపేట ప్రతినిధి**

మహారాష్ట్రలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన పూణే-బారామతి 100 కిలోమీటర్ల అల్ట్రా రన్ విజయవంతంగా పూర్తి చేసి పతకం సాధించిన సిద్ధిపేట జిల్లా రన్నర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, సీనియర్ జర్నలిస్టు నునిగాని రాజును మిత్రులు ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ 100 కిలోమీటర్ల అల్ట్రా రన్ పూర్తి చేయడం సాధారణ విషయం కాదని, రాజు సాధించిన విజయం సిద్ధిపేట జిల్లాకు గర్వకారణమని కొనియాడారు. ఆయన విజయం నేటి యువతతో పాటు రన్నర్లకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి ఆరోగ్యంపై దృష్టి సారించాలని,

రన్నింగ్, యోగా, వ్యాయామాన్ని నిత్య జీవితంలో భాగం చేసుకుంటే శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని సూచించారు.ఈ కార్యక్రమంలో పల్లె వంశీకృష్ణ గౌడ్, జీవన్ రెడ్డి, అర్జున్, దూలం భైరా గౌడ్, మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి: డీఈవో రోహిణి

**సంగారెడ్డి వుదయం.**



సంగారెడ్డి పోతిరెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుల శిక్షణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో రోహిణి మాట్లాడుతూ శిక్షణను పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రధానోపాధ్యాయుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు, విధులపై అవగాహన కల్పించేందుకు మూడు రోజుల శిక్షణ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

### సేవలోనే కన్నుమూసిన

## హోంగార్డుకు ప్రభుత్వ అండ



- కుటుంబానికి రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా
- ఎస్పీ చేతుల మీదుగా బాండ్ అందజేత.. పోలీస్ శాఖ
- అండగా ఉంటుందని భరోసా

**గద్వాల జూలై 27 (వుదయం బ్యూరో)**

విధి నిర్వహణలో పోలీస్ శాఖకు సేవలందిస్తూ అనారోగ్యంతో మృతి చెందిన హోంగార్డు ఎం. ప్రవీణ్ కుమార్ కుటుంబానికి ప్రభుత్వం మంజూరు చేసిన రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా బాండ్‌ను జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు అందజేశారు. మృతుడి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ సహాయాన్ని అందించింది. గత ఏడాది ఏప్రిల్ 18న ప్రవీణ్ కుమార్ అనారోగ్యంతో మృతి చెందగా, ప్రభుత్వం మంజూరు చేసిన ఎక్స్‌గ్రేషియా కింద ఈ నెల 22న ఆయన భార్య వి. కవిత బ్యాంకు ఖాతాలో రూ.5 లక్షల మొత్తాన్ని జమ చేశారు. అనంతరం హోంగార్డు ఇన్‌చార్జ్ ఆర్ఐ టి. వెంకటేష్ సమక్షంలో సంబంధిత బాండ్‌ను కుటుంబ సభ్యులకు అందజేశారు. ప్రవీణ్ కుమార్ 2003 డిసెంబర్ 29న హోంగార్డుగా విధుల్లో చేరారు. అనంతరం 2021లో నారాయణపేట జిల్లా నుంచి రొటేషన్ విధానంలో జోగుళాంబ గద్వాల్ జిల్లాకు బదిలీ అయి పోలీస్ శాఖలో సేవలందించారు. సేవలో ఉండగానే అనారోగ్యంతో మృతి చెందడంతో, ఆయన కుటుంబానికి ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా రూపంలో ఆర్థిక సహాయాన్ని అందించింది. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ శాఖ తరపున అధికారులు మృతుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. పోలీస్ సిబ్బంది, హోంగార్డుల సంక్షేమానికి ప్రభుత్వం, పోలీస్ శాఖ కట్టుబడి ఉన్నాయని, అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని పేర్కొన్నారు.

# సీఎంఆర్ కథ కంచికేనా..!

- ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్న రైస్ మిల్లర్లు
- 450కి పైగా డిఫాల్ట్ మిల్లులు... కోట్ల రూపాయల సీఎంఆర్ బకాయిలు...
- తనిఖీలకే పరిమితమైన అధికారులు...
- రికవరీపై మౌనం... ప్రజాధనం కాపాడేది ఎవరు?

**వికారాబాద్ జూలై 29 (వుదయం బ్యూరో)**



రాష్ట్రంలో రైతుల నుంచి ప్రభుత్వ యంత్రాంగం సేకరిస్తున్న ధాన్యం చివరకు ప్రభుత్వ గోదాములకు బియ్యంగా చేరే ప్రక్రియలో తీవ్ర లోపాలు, నిర్లక్ష్యం, అక్రమాలు చోటుచేసుకుంటున్నాయనే ఆరోపణలు రోజురోజుకూ బలపడుతున్నాయి. రైతుల కష్టార్జిత ధాన్యాన్ని రైస్ మిల్లులకు అప్పగించిన తర్వాత ప్రభుత్వానికి తిరిగి రావాల్సిన కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) భారీగా పెండింగ్‌లో పడుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ప్రతి ఏడాది కోట్ల రూపాయల విలువైన సీఎంఆర్ బకాయిలు పేరుకుపోతున్నా, వాటి వసూళ్లలో మాత్రం అధికారులు ఆశించిన స్థాయిలో పురోగతి సాధించలేకపోతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.ప్రభుత్వం ధాన్యం సేకరణ కోసం వేల కోట్ల రూపాయలు వెచ్చిస్తోంది. రైతులకు మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేసిన ధాన్యాన్ని రైస్ మిల్లర్లకు మిల్లింగ్ కోసం అప్పగిస్తోంది. ఆ ధాన్యాన్ని బియ్యంగా మార్చి నిర్ణీత గడువులో ప్రభుత్వానికి అప్పగించడం మిల్లర్ల చట్టబద్ధమైన బాధ్యత. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి పూర్తిగా భిన్నంగా కనిపిస్తోంది. గడువులు ముగిసినా బియ్యం ప్రభుత్వ గోదాములకు చేరడం లేదు. దీంతో ప్రభుత్వ ఖజానాకు భారీ నష్టం వాటిల్లుతోందనే ఆందోళన వ్యక్తమవుతోంది.

**తనిఖీలు జరుగుతున్నాయి... కానీ ఫలితం ఎక్కడ?**

రాష్ట్రవ్యాప్తంగా టాస్క్‌ఫోర్స్ బృందాలు తరచూ రైస్ మిల్లులపై తనిఖీలు నిర్వహిస్తున్నాయి. ఈ తనిఖీల్లో నిల్వల వ్యత్యాసాలు, రికార్డుల్లో అక్రమాలు, ధాన్యం మళ్లింపు, సీఎంఆర్ లోటు వంటి అనేక అంశాలు వెలుగులోకి వస్తున్నాయి. అయితే తనిఖీల తర్వాత చర్యలు మాత్రం నోటీసులు ఇవ్వడం, కేసులు నమోదు చేయడం వరకే పరిమితమవుతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అసలు ప్రభుత్వానికి రావాల్సిన బియ్యం ఎంత? అందులో ఎంత పెండింగ్‌లో ఉంది? ఎంత మేరకు రికవరీ జరిగింది? ఎంతమందిపై క్రిమినల్ చర్యలు తీసుకున్నారు? అనే ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు కనిపించడం లేదు. దీంతో తనిఖీలు కేవలం అధికారిక ప్రక్రియగానే మారిపోయాయా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**రికార్డుల్లో ఒకలా... మిల్లుల్లో మరోలా...**

క్షేత్రస్థాయిలో నిర్వహించిన తనిఖీల్లో రికార్డుల్లో చూపిస్తున్న నిల్వలకు, వాస్తవంగా మిల్లుల్లో ఉన్న నిల్వలకు భారీ వ్యత్యాసాలు బయటపడుతున్నట్లు సమాచారం. ప్రభుత్వ ధాన్యం పూర్తిగా మిల్లింగ్ కాకముందే ఇతర మార్గాలకు మళ్లించబడుతోందా? ప్రైవేట్ వ్యాపారాలకు ఉపయోగపడుతోందా? అనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. పలుచోట్ల నిల్వల లెక్కలు సరిపోకపోయినా, సంబంధిత మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకున్న ఉదాహరణలు చాలా తక్కువగా ఉన్నాయని విమర్శలు వినిపిస్తున్నాయి.

**అధికారుల అండదండలతోనే అక్రమాలా?**

రైస్ మిల్లర్ల అక్రమాలకు కొందరు కిందిస్థాయి అధికారులు సహకరిస్తున్నారనే ఆరోపణలు కొత్తవి కావు. తనిఖీల సమాచారం ముందుగానే లీక్ కావడం, రికార్డులు సరిచేసుకునే అవకాశం కల్పించడం, అక్రమాలను చూసీచూడనట్లు వ్యవహరించడం వంటి ఆరోపణలు గతంలో కూడా వినిపించాయి. దీంతో అక్రమాలకు పాల్పడుతున్న మిల్లర్ల కంటే వారిని కాపాడుతున్న అధికారుల పాత్రపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.ప్రభుత్వం కోట్ల రూపాయల ప్రజాధనాన్ని మిల్లర్లకు అప్పగిస్తుంటే, ఆ ధాన్యం తిరిగి ప్రభుత్వానికి చేరే వరకు ప్రతి దశలోనూ కఠిన పర్యవేక్షణ అవసరమని నిపుణులు సూచిస్తున్నారు.

**450కి పైగా డిఫాల్ట్ మిల్లులు... ఆందోళనకర పరిస్థితి**

నిబంధనల ప్రకారం నిర్ణీత గడువులోగా సీఎంఆర్ అందించని మిల్లులను డిఫాల్ట్ జాబితాలో చేర్చి, వారికి తదుపరి ధాన్యం కేటాయింపులు నిలిపివేయడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. అయితే ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 450కి పైగా రైస్ మిల్లులు డిఫాల్ట్ జాబితాలో ఉన్నట్లు సమాచారం. ప్రభుత్వానికి రావాల్సిన కోట్ల రూపాయల విలువైన బియ్యం లేదా దానికి సమానమైన రికవరీ ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉందని తెలుస్తోంది.

డిఫాల్ట్ జాబితా రూపొందించినా, కేసులు నమోదు చేసినా, అసలు బకాయిలు మాత్రం రాబట్టలేకపోవడం యంత్రాంగం వైఫల్యంగా విమర్శలు ఎదుర్కొంటోంది.

ప్రజాధనం ఎక్కడికి వెళ్తోంది?

రైతుల పన్నులతో నడిచే ప్రభుత్వ ఖజానా నుంచి వేల కోట్ల రూపాయలు ధాన్యం కొనుగోలు కోసం ఖర్చవుతున్నాయి. కానీ అదే ధాన్యం సీఎంఆర్ రూపంలో తిరిగి ప్రభుత్వానికి చేరకపోతే ఆ నష్టాన్ని భరించాల్సింది చివరికి ప్రజలే. ప్రభుత్వానికి రావాల్సిన బియ్యం నిలిచిపోవడం అంటే పేదలకు పంపిణీ చేసే ఆహార ధాన్యాలపైనా ప్రభావం పడే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.మంత్రి పర్యవేక్షణ కొరవడిందా?

పౌరసరఫరాల శాఖపై సమగ్ర పర్యవేక్షణ అవసరమని పలువురు అభిప్రాయపడుతున్నారు. శాఖాపరమైన సమీక్షలు మరింత కఠినంగా నిర్వహించి, ప్రతి డిఫాల్ట్ మిల్లుపై ప్రత్యేకంగా సమీక్ష చేయాలని సూచిస్తున్నారు. క్షేత్రస్థాయిలో జవాబుదారీతనం పెరగకపోతే పరిస్థితి మరింత దిగజారే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

రికవరీ ఎందుకు జరగడం లేదు?

మిల్లర్లకు ధాన్యం అప్పగించడంలో కనిపిస్తున్న వేగం... సీఎంఆర్ రికవరీ విషయంలో కనిపించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ధాన్యం అప్పగించినప్పుడు ఉన్న పర్యవేక్షణ, బియ్యం తిరిగి రాబట్టే సమయంలో ఎందుకు కనిపించడం లేదనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కోట్ల రూపాయల బకాయిలు ఉన్నా, వాటిని వసూలు చేయడంలో చొరవ లేకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

నిపుణులు సూచిస్తున్న మార్గం

సీఎంఆర్ బకాయిలపై ప్రత్యేక రాష్ట్రస్థాయి రికవరీ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయడం, ప్రతి డిఫాల్ట్ మిల్లుపై రోజువారీ పర్యవేక్షణ, బ్యాంకు గ్యారంటీల స్వాధీనం, అవసరమైతే ఆస్తుల జప్తు, వేగవంతమైన క్రిమినల్ చర్యలు, సహకరించిన అధికారులపై శాఖాపరమైన విచారణ వంటి చర్యలు తీసుకుంటేనే పరిస్థితి మెరుగుపడుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

ప్రభుత్వం ముందున్న అసలు సవాల్ ఇదే... సీఎంఆర్ బకాయిలు కేవలం లెక్కల సమస్య కాదు. ఇది రైతుల కష్టం, ప్రజాధనం, ప్రభుత్వ విశ్వసనీయతకు సంబంధించిన అంశం. ప్రతి బియ్యపు గింజ వెనుక రైతు చెమట ఉంది. ఆ ధాన్యం గమ్యం తప్పితే నష్టపోయేది ప్రభుత్వమే కాదు... ప్రజలే.ఇప్పటికైనా ప్రభుత్వం సమగ్ర కార్యాచరణతో ముందుకెళ్లి, డిఫాల్ట్ మిల్లర్లపై రాజీ లేకుండా చర్యలు తీసుకుని, కోట్ల రూపాయల సీఎంఆర్ బకాయిలను నూటికి నూరుశాతం రికవరీ చేసి ప్రజాధనాన్ని కాపాడుతుందా? లేక ప్రతి ఏడాది లాగే ఈ వ్యవహారం కూడా ఫైళ్లకే పరిమితమవుతుందా? అన్న ప్రశ్నకు రానున్న రోజుల్లోనే సమాధానం లభించనుంది.

క్షేత్రస్థాయిలో అసలేం జరుగుతోంది?

ప్రత్యేక పరిశీలన

సీఎంఆర్ వ్యవస్థలో అక్రమాలు కేవలం రికార్డులకే పరిమితం కావడం లేదని, క్షేత్రస్థాయిలో పలు జిల్లాల్లో పరిస్థితులు ఆందోళనకరంగా ఉన్నాయని తెలుస్తోంది. రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని ప్రభుత్వం మిల్లర్లకు అప్పగించిన తర్వాత దాని కదలికపై నిరంతర పర్యవేక్షణ లోపిస్తున్నట్లు సంబంధిత వర్గాలు చెబుతున్నాయి.కొన్ని మిల్లుల్లో నిల్వ రిజిస్టర్లలో నమోదైన ధాన్యం, వాస్తవంగా గోదాముల్లో ఉన్న నిల్వలకు పొంతన లేకపోవడం అధికారుల తనిఖీల్లో బయటపడుతోంది. అయితే ఈ వ్యత్యాసాలు గుర్తించిన తర్వాత కూడా బకాయిల వసూళ్లు మాత్రం ఆశించిన స్థాయిలో జరగడం లేదనే విమర్శలు ఉన్నాయి. కేసులు నమోదు, నోటీసుల జారీ వంటి చర్యలు జరుగుతున్నప్పటికీ, కోట్ల రూపాయల సీఎంఆర్ బకాయిల రికవరీ మాత్రం ముందుకు సాగడం లేదని సమాచారం.

క్షేత్రస్థాయిలో పలువురు రైతులు, రవాణాదారులు, మిల్లింగ్ రంగానికి చెందిన వర్గాలు ఒకే అంశాన్ని ప్రస్తావిస్తున్నాయి. "ధాన్యం మిల్లులకు చేరిన తర్వాత పర్యవేక్షణ బలహీనపడుతోంది. ప్రతి లాట్‌ను డిజిటల్‌గా ట్రాక్ చేసి, సీఎంఆర్ ప్రభుత్వానికి చేరే వరకు రియల్‌టైమ్ పర్యవేక్షణ ఉంటే అక్రమాలకు అవకాశం తగ్గుతుంది" అని వారు అభిప్రాయపడుతున్నారు.

పౌరసరఫరాల శాఖ వర్గాల ప్రకారం, డిఫాల్ట్ మిల్లుల జాబితా సిద్ధమైనప్పటికీ, రికవరీ ప్రక్రియ నెమ్మదిగా సాగడం వల్ల బకాయిలు పేరుకుపోతున్నాయి. బ్యాంకు గ్యారంటీల అమలు, ఆస్తుల జప్తు, వేగవంతమైన చట్టపరమైన చర్యలు లేకపోతే ప్రభుత్వానికి రావాల్సిన ధాన్యం లేదా దానికి సమానమైన విలువను పూర్తిగా రాబట్టడం కష్టమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

నిపుణుల అభిప్రాయం ప్రకారం, సీఎంఆర్ వ్యవస్థలో పారదర్శకత పెంచేందుకు ప్రతి మిల్లుకు జీపీఎస్ ఆధారిత రవాణా ట్రాకింగ్, ఆన్‌లైన్ స్టాక్ మానిటరింగ్, వారానికొకసారి భౌతిక తనిఖీలు, డిఫాల్ట్ మిల్లుల వివరాలను బహిరంగంగా ప్రకటించడం వంటి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. అలాంటి సంస్కరణలు అమలైతేనే ప్రజాధనం రక్షించబడటంతో పాటు రైతులకు కూడా మరింత విశ్వాసం కలుగుతుందని వారు సూచిస్తున్నారు.

## ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలి



- -జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

**మెదక్ జిల్లా వుదయం**

నిజాంపేట మండలం ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సాధించాలని జిల్లా కలెక్టర్ అన్నారు.నిజాంపేట మండలం చెల్మెడ గ్రామంలోని ఆయిల్ ఫామ్ నర్సరీని హార్టికల్చర్ అధికారి, అగ్రికల్చర్ అధికారి ఎంపీడీవో తో కలిసి సందర్శించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ అన్నారు. ఈ సంవత్సరం జిల్లా వ్యాప్తంగా 2,500 ఎకరాలు ఆయిల్ ఫామ్ సాగు లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

2500 ఎకరాల ఆయిల్ ఫామ్ సాగుకోసం పకడ్బందీగా ప్రణాళికలు చేస్తున్నట్లు తెలిపారు. ఇక్కడ ఉన్న ఆయిల్ ఫామ్ ఆ నర్సరీ లో మలేషియా, థాయిలాండ్, ఇండోనేషియా దేశాల నుంచి విత్తనాలు తెప్పించి, మొక్కలుగా ఏదిగాక రైతులకు పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్, ఉద్యానవన శాఖ అధికారి ప్రతాప్ సింగ్, రాజిరెడ్డి , వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి శుద్ధికరణలో నాణ్యత ప్రమాణాలు పాటించాలి



- మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి

**నాగర్ కర్నూల్, జులై 28 (వుదయం ప్రతినిధి) :**

ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని వాటర్ ప్లాంట్ల యజమానులు తాగునీటి శుద్ధీకరణ ప్రక్రియలో నాణ్యత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి అన్నారు.మంగళవారం జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో పట్టణ పరిధిలో ఉన్న వాటర్ ప్లాంట్ల యజమానులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజలకు సరఫరా చేసే తాగునీటి విషయంలో ఎలాంటి రాజీ వద్దని స్పష్టం చేశారు. నీటి ఫిల్టరేషన్ యంత్రాలు సక్రమంగా పనిచేసేలా నిరంతరం నిర్వహణ చేపట్టడంతో పాటు, ఫిల్టర్లను నిర్ణీత వ్యవధిలో మార్చాలని సూచించారు. అలాగే నీటి నాణ్యత పరీక్షలను క్రమం తప్పకుండా నిర్వహించడం మరియు పరిశుభ్రత ప్రమాణాలను ఖచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. ప్రజలకు నాణ్యత లేని లేదా కలుషితమైన తాగునీటిని సరఫరా చేయడం ఏ పరిస్థితుల్లోనూ సహించబడదని హెచ్చరించారు. ఎవరైనా నిబంధనలను ఉల్లంఘించి నాణ్యత లేని నీటిని సరఫరా చేసినట్లు గుర్తించినట్లయితే, సంబంధిత వాటర్ ప్లాంట్ యజమానులపై చట్టప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.నెల రోజుల లోపల మరోసారి నీటి నాణ్యత పరీక్షలు జరిపి, ప్రమాణాలు పాటించని వారిపై తగు చర్యలు తీసుకుంటామని కమిషనర్ నాగిరెడ్డి వెల్లడించారు

## భూ రీసర్వే పనులను పారదర్శకంగా, నిర్దేశిత గడువులో పూర్తి చేయాలి



- అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్

**వనపర్తి జులై 28 (వుదయం ప్రతినిధి)**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన గ్రామాల భూ రీసర్వే కార్యక్రమాన్ని పారదర్శకంగా, నాణ్యతతో, నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని వనపర్తి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వినోద్ కుమార్ ఆదేశించారు. మంగళవారం ఘన్‌పూర్ మండలంలోని మల్కాపూర్ గ్రామం, కొత్తకోట మండలంలోని పుల్లారెడ్డికుంట గ్రామాల్లో కొనసాగుతున్న డిజిటల్ భూ రీసర్వే పనులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ సర్వే బృందాలు రైతుల సమక్షంలోనే భూ సరిహద్దులను స్పష్టంగా గుర్తించాలని సూచించారు. డ్రోన్, రోవర్ వంటి ఆధునిక సర్వే పరికరాలను సమర్థవంతంగా వినియోగించి భూ విస్తీర్ణం నమోదులో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా అత్యంత ఖచ్చితత్వంతో సర్వే నిర్వహించాలని ఆదేశించారు.

సర్వే ప్రక్రియలో రైతులకు ఏవైనా సందేహాలు, అభ్యంతరాలు తలెత్తితే రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు వెంటనే స్పందించి వాటిని అక్కడికక్కడే పరిష్కరించాలని సూచించారు. రైతులకు పూర్తి అవగాహన కల్పిస్తూ వారి సహకారంతో రీసర్వే పనులను ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు.

రీసర్వే పూర్తయిన భూములకు సంబంధించిన వివరాలను వెంటనే రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేయాలని, భూ యజమానుల వివరాలు, సరిహద్దులు, విస్తీర్ణం వంటి అంశాల్లో ఎలాంటి లోపాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. పనుల నాణ్యతపై రాజీ పడవద్దని, ప్రతి దశను అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని, ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా రీసర్వే ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ తనిఖీలో సర్వే శాఖ ఏడి శ్రీనివాసులు, సంబంధిత రెవెన్యూ అధికారులు, సర్వే బృందాలు, సాంకేతిక సిబ్బంది పాల్గొన్నారు.

## రైతు వేదికల్లో 'రైతు నేస్తం' 100వ ఎపిసోడ్ వీక్షణ



**సిద్ధిపేట/జగదేవ్‌పూర్, జులై 28 (వుదయం ప్రతినిధి)**

జగదేవ్‌పూర్, మునిగడప రైతు వేదికల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 'రైతు నేస్తం' 100వ ఎపిసోడ్ కార్యక్రమాన్ని రైతులు, అధికారులు నేడు వీక్షించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, శాస్త్రవేత్తలు ఎల్‌నినో ప్రభావం, ప్రత్యామ్నాయ పంటల సాగు, వాతావరణ మార్పులకు అనుగుణంగా అనుసరించాల్సిన మెళకువలపై రైతులకు అవగాహన కల్పించారు.

అనంతరం జగదేవ్‌పూర్ రైతు వేదికలో ఏర్పాటు చేసిన విత్తన మేళాను రైతులు సందర్శించి కంది విత్తనాలు కొనుగోలు చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు (ఎం ఏ ఓ, ఏఈఓ) కృషి సఖులు, సిరిసిల్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆరుతడి పంటలపై రైతుల దృష్టి సారించాలి

*యాలాల వ్యవసాయ అధికారి శ్వేత

**యాలాల జులై 28 వు దయం ప్రతినిధి:-**



రైతులు ఆరు తడి పంటలపై దృష్టి సారించాలని యాలాల వ్యవసాయ అధికారి శ్వేత తెలిపారు. మంగళవారం యాలాల మండల పరిధిలోని అగ్గనూరు గ్రామం రైతు వేదికలో ఆరుతడి విత్తనమేల కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి శ్వేత మాట్లాడుతూ ఎల్నినో ప్రభావం వల్ల వర్షాలు తక్కువ కురిసే అవకాశం ఉందన్నారు. కావున రైతులు వర్షాన్ని దృష్టిలో ఉంచుకొని ఆరుతడి పంటలపై మక్కువ చూపాలని సూచించారు. రైతులు వరి పంట సాగుకు బదులుగా ఆరుతడి పంటలను వేసుకోవాలని తెలిపారు. ఈసారి వర్ష ప్రభావం తక్కువగా ఉంటుందని తెలిపారు. శాస్త్రవేత్తల సూచనల ప్రకారం ఆరుతడి పంటలు సాగు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు.

## స్నేహ మిత్ర మండలి ఆధ్వర్యంలో నేడు రక్తదాన శిబిరం

**నారాయణపేట టౌన్ జూలై 28 (వుదయం ప్రతినిధి)**

స్నేహ మిత్రమండలి ఆధ్వర్యంలో ఈనెల 29 బుధవారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు డాక్టర్ మదన్ మోహన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుండి మ 2 గంటల వరకు స్థానిక హనుమాన్ సాయి దేవాలయం సాయి విజయ కాలని లో ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూరక్తదానాల మధ్య కాలవ్ రెగ్యులర్ వ్యవధిలో రక్తదానం చేయటం వలన శరీరంలో ఇనుము యొక్క శాతం క్రమబద్ధం చేయబడుతుందని,గుండెపోటు నుండి దూరంగా ఉంచుతుంది అని, రక్తదానం వలన శరీర భాగాలను క్యాన్సర్ ప్రమాదం నుంచి దూరంగా ఉంచడానికి సహాయపడుతుందని ,రక్తదానం వల్ల కొలెస్ట్రాల్ తగ్గి రక్తపోటు నియంత్రణలో ఉంటుందని వివరించారు.

కాగా ఈ రక్తదాన శిబిరంలో అధిక సంఖ్యలో పాల్గొని రక్తదానం చేయాలని ఆయన కోరారు.



## పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోగ్యం మెరుగుపడాలని బీఆర్ఎస్ శ్రేణుల ప్రత్యేక పూజలు.

వరంగల్ జిల్లా నర్సంపేట వుదయం ప్రతినిధి జూలై 28.

నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో ప్రజాక్షేత్రంలోకి తిరిగి రావాలని ఆకాంక్షిస్తూ నర్సంపేట పట్టణంలోని శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి దేవాలయం, శివాంజనేయ స్వామి దేవాలయాల్లో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎంపీపీలు, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోగ్యం త్వరగా మెరుగుపడాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా నర్సంపేట నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ కోఆర్డినేటర్ తక్కలపెల్లి రవీందర్ రావు మాట్లాడుతూ, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి త్వరగా కోలుకుని ప్రజల మధ్యకు రావాలని వందలాది మంది కార్యకర్తలు, అభిమానులు భగవంతుడిని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నారని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు కుడిభుజంగా నిలిచి, ముందు వరుసలో పోరాడిన నాయకుడు పెద్ది సుదర్శన్ రెడ్డి అని పేర్కొన్నారు. అలాంటి నాయకుడు ఆకస్మికంగా అస్వస్థతకు గురికావడం అందరినీ తీవ్ర ఆవేదనకు గురిచేసిందన్నారు. రోహిణి ఆసుపత్రిలో వైద్యుల కృషితో ఆయన ఆరోగ్య పరిస్థితిలో ఆశాజనక మార్పులు వచ్చాయని, ప్రస్తుతం సికింద్రాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో మెరుగైన చికిత్స అందుతున్నట్లు తెలిపారు. భగవంతుని కృపతో ఆయన పూర్తిగా కోలుకుని మళ్లీ ప్రజాసేవలో చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు. చివరగా శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామివారిని, శివాంజనేయ స్వామివారిని ప్రార్థిస్తూ పెద్ది సుదర్శన్ రెడ్డి నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవించి, తిరిగి ప్రజాక్షేత్రంలో సేవలందించాలని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కోరుకున్నారు.

## వివిధ సంక్షేమ పథకాలకు నెల 31 వరకు దరఖాస్తుల గడువు ముగింపు

***మీసేవ ద్వారా వివిధ పథకాలకు లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవాలి. మండల అభివృద్ధి అధికారి వనపర్తి అద్వైత.***



ఖానాపురం, జులై 28 (వుదయం ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం నుండి మంజూరైన వివిధ రకాల సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకునే చివరి గడువు ఈనెల 31 తో గడువు ముగుస్తుందని మండల అభివృద్ధి అధికారి వనపర్తి అద్వైత మండలంలోని 21 గ్రామ పంచాయతీల పరిధిలోని ప్రజలకు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీవో తమ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ మైనార్టీ సోదరులకు సోదరీమణులకు ప్రభుత్వం అందిస్తున్న మోటార్ ట్రక్ యూనిట్, ఈ-స్కూటర్, నెట్ వ్యాపార యూనిట్లు తదితర స్వయం ఉపాధి పథకాల కోసం మైనార్టీ సోదరులు సోదరీమణులు ఈనెల 31 లోపు మీ సేవ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని మైనార్టీ సోదరులకు సోదరీమణులకు తెలుపుతూ, వికలాంగులకు ప్రభుత్వం అందిస్తున్న బ్యాటరీ వీల్‌చైర్లు, ట్రైసైకిళ్లు, క్రచ్‌లు, లాప్‌టాప్‌లు తదితర వాటి కోసం మీ సేవలో ఈనెల 31 లోపు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో వికలాంగుల అభ్యర్థులకు తెలిపారు.

## అభ్యుదయ పరపతి సంఘం అధ్యక్షుడి స్వర్గీయ ఎర్రబెల్లి హరికుమార్ కుటుంబానికి సంఘం చేయూత..

**మానవత్వం చాటుకున్న అభ్యుదయ పరపతి సంఘ సభ్యులు**



పర్వతగిరి, జులై 28 ( వుదయం ప్రతినిధి ):పర్వతగిరి మండలకేంద్రం అభ్యుదయ పరపతి సంఘం అధ్యక్షులు స్వర్గీయ ఎర్రబెల్లి హరికుమార్ మృతి పట్ల సంఘం సభ్యులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబానికి తమ వంతు సహాయంగా చిట్టి సభ్యుల తరపున రూ.10,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు పుల్లూరి రజినీకాంత్ గౌడ్, గౌరవ అధ్యక్షులు బైర్ రాజశేఖర్, శ్రీరాములు కిరణ్, మధ్యబోయిన సంతోష్, జంగా ప్రసాద్, వన్నాల రాజశేఖర్, నాగుల రాజు, ఎర్రబెల్లి సునీల్ కుమార్, యూత్ సభ్యులు శ్రీరాములు అభిషేక్, మడ్డి వంశీ, చీదురాల శివతో పాటు సంఘం సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరికుమార్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, వారికి మనోధైర్యం కలగాలని సభ్యులు ఆకాంక్షించారు.

## కేయూ వీసీ ఆరోగ్యం నిలకడ ఉంది

హసన్ పర్తి జూలై28 (వుదయం ప్రతినిధి): కాకతీయ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి జూలై 27 (సోమవారం) సాయంత్రం ఆఫీస్ లో కొంత అసౌకర్యానికి గురి కావటంతో, కాంపస్ లోని హెల్త్ సెంటర్ లో అందుబాటులో ఉన్న డాక్టర్ కే. బుచ్చిరెడ్డి ప్రాధమిక పరిక్షలు నిర్వహించగా రక్త పోటు, ఈ.సి.జి లో కొంత హెచ్చు తగ్గులు ఉండటంతో, నగరంలోని రోహిణి హాస్పిటల్ లో పర్యవేక్షణలో ఉంచి, మరిన్ని పరిక్షలు నిర్వహించి, పరిక్షల రిపోర్ట్ ప్రకారం, వైద్యులు సూచనాలతో అంజియోగ్రం నిర్వహించి, స్టంట్ వేసినట్టు, ప్రస్తుతం ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు వెల్లడించినట్టు రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం మంగళవారం మద్యహ్నం ఒక ప్రకటనలో తెలిపారు. అదే విధంగా వైస్ ఛాన్సలర్ ఆరోగ్యం నిలకడగా ఉనట్టు, ఉద్యోగులు, విద్యార్థులు వారి ఆరోగ్య పరిస్థతి గురుంచి వాకుబు చేస్తునట్టు, ఎటువంటి ఆందోళన అవసరం లేదని, వైస్ ఛాన్సలర్ ను పరామర్శించటానికి హాస్పిటల్ కు రావద్దు అని, సహకరించాలి అని అందులో కోరారు.

# దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా సాకారమయ్యే వరకు పోరాటం ఆగదు

- ఆగస్టు 3 నుండి 7 వరకు అన్ని జిల్లాల్లో శాంతియుత మహాదీక్షలు
- ఆగస్టు 10న హన్మకొండ నుండి వరంగల్ కలెక్టరేట్ వరకు భారీ నిరసన ర్యాలీ
- 'దళిత క్రైస్తవ ఐక్యవేదిక' వ్యవస్థాపక అధ్యక్షులు ఈర్ల కుమార్ మాదిగ పిలుపు



హనుమకొండ, జూలై 28 (వుదయం ప్రతినిధి) : మతం వ్యక్తిగతం, కులం సామాజికం అని... సామాజిక వివక్ష కొనసాగుతున్నంత కాలం దళిత క్రైస్తవులకు ఎస్సీ (రాజ) హోదా కల్పించాల్సిందేనని దళిత క్రైస్తవ ఐక్యవేదిక (ఘజ×ఎ) వ్యవస్థాపక అధ్యక్షులు ఈర్ల కుమార్ మాదిగ డిమాండ్ చేశారు. హన్మకొండలోని గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

?ప్రజాస్వామ్యబద్ధంగా దళిత క్రైస్తవుల హక్కుల సాధన కోసం చేపట్టబోయే వరుస ఆందోళన కార్యక్రమాల వివరాలను ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు.

?ఆగస్టు 3 నుండి 7 వరకు (5 రోజులు) రెండు తెలుగు రాష్ట్రాల్లోని అన్ని జిల్లా కేంద్రాల్లో దళిత క్రైస్తవ శాంతియుత మహాదీక్షలు.

?ఆగస్టు 10న (బ్లాక్ డే) 1950 ఆగస్టు 10న రాష్ట్రపతి ఉత్తర్వుల ద్వారా దళితుల మత స్వేచ్ఛను కాలరాసిన రోజైన 'బ్లాక్ డే' సందర్భంగా.. హన్మకొండ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం నుండి వరంగల్ జిల్లా కలెక్టరేట్ వరకు భారీ శాంతియుత నిరసన ర్యాలీ.

?రాజ్యాంగ హక్కుల పరిరక్షణ: భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 (సమానత్వ హక్కు), 15 (మత వివక్ష నిరసన), 25 (మత స్వేచ్ఛ) ప్రకారం మతం ప్రాతిపదికన ఎస్సీ హోదాను నిరాకరించడం రాజ్యాంగ విరుద్ధం.

?ఇతర ఆధిపత్య, బీసీ, ఎస్టీ వర్గాల ప్రజలు చర్చిలకు వెళ్లినా వారి కులం, కేటగిరీ మారవు. కానీ దళితులు క్రైస్తవాన్ని స్వీకరిస్తే ఎస్సీ హోదా పోవడం తీవ్రమైన అన్యాయం.

?కమిషన్ల సిఫార్సుల అమలు: 1955 కాకా కలేకర్ కమిషన్ ద్వారా దళిత సిక్కులకు, 1990లో దళిత బౌద్ధులకు ఎస్సీ హోదా కల్పించారు. అలాగే దళిత క్రైస్తవులకు కూడా ఎస్సీ హోదా ఇవ్వాలని జస్టిస్ రంగనాథ్ మిశ్రా కమిషన్ చేసిన సిఫార్సులను వెంటనే అమలు చేయాలి.

ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లో దేశ వ్యాప్తంగా ఉన్న ఎంపీలందరూ దళిత క్రైస్తవుల ఎస్సీ హోదాపై గళమెత్తి, కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలి. ?ఈ మహాదీక్షలు మరియు నిరసన ర్యాలీలో తెలుగు రాష్ట్రాలలోని బిషప్‌లు, పాస్టర్లు, చర్చి లీడర్లు, దళిత సంఘాలు, ప్రజాస్వామ్యవాదులు, మేధావులు, మహిళలు స్వచ్ఛందంగా పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ?ఈ విలేకరుల సమావేశంలో ఐక్యవేదిక రాష్ట్ర నేతలు మాదాసి బిక్షపతి మాదిగ, సందేలా లాజర్, ఎర్రోళ్ల బాబు, నాగారపు స్వామి, మేకల బాబు, సిలువేరు నగేష్, జన్ను శ్యామ్, పాస్టర్లు దైవసేవకులు బరిగల జనార్దన్, నలగంటి విల్సన్, పాస్టర్ చిదిరల ముకేష్, డాక్టర్ గణిపాక క్రాంతి, ఆరిశం శంకర్, ఈర్ల హరినాథ్, వెండి రాజు తదితరులు పాల్గొన్నారు.



## పాకాల సరస్సుకు గోదారమ్మతల్లిని తీసుకువచ్చిన పెద్దన్న త్వరగా కోలుకోవాలని ఆలయంలో ప్రత్యేక పూజలు

**సర్పంచ్ బాదావత్ జ్యోతిబాలకిషన్.**

ఖానాపురం, జూలై 28 (వుదయం ప్రతినిధి):నర్సంపేట నియోజకవర్గ రైతుల ప్రజల చిరకాల వాంఛ కోరికను నెరవేర్చి పాకాల సరస్సుకు గోదారమ్మతల్లిని తీసుకువచ్చి పాకాల రామక్కతల్లి పాదాలను కడిగిన నియోజక వర్గ మాజీ ఎమ్మెల్యే బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు తెలంగాణ రాష్ట్ర ఉద్యమ ఏర్పాటుకు కీలక పాత్ర పోషించిన నాయకుడు మాజీ ఎమ్మెల్యే పెద్ది అనారోగ్యం బారిన పడి సికింద్రాబాద్ లోని యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది త్వరగా కోలుకొని మరల నర్సంపేట నియోజకవర్గంలోని ప్రజలకు యధావిధిగా సేవలు అందించాలని మండలంలోని నాజీతండ గ్రామపంచాయతీ పరిధిలోని ఆంజనేయస్వామి ఆలయంలో గ్రామ సర్పంచ్ బాదావత్ జ్యోతిబాలకిషన్, బిఆర్ఎస్ నాయకులతో రైతులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి పెద్ది త్వరగా కోలుకోవాలని కోరుకున్నట్లు సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల యూత్ అధ్యక్షుడు బానోతు శ్రీనివాస్ నాయక్, నాయకులు బానోత్ కిరు, భూక్యా కిషన్, బానోతు తేజు, నున్సావత్ బాలకిషన్, భూక్యా వాగ్య,శంకర్, రమేష్, భుక్య రామునాయక్ తదితరులు పాల్గొన్నారు..

## అగ్ని బాధిత కుటుంబానికి అండగా ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్

**రూ.10 వేల నగదు, 50 కిలోల బియ్యం అందజేత...**



రాయపర్తి జూలై 28 (వుదయం ప్రతినిధి): మండలం కాట్రపల్లి గ్రామానికి చెందిన నిరుపేద మహిళ గాదారి పూలమ్మ నివాసం ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో పూర్తిగా దగ్ధమై, కుటుంబం నిరాశ్రయ స్థితికి చేరుకుంది. ఈ విషాద ఘటనపై స్పందించిన రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశాలమేరకు ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ జిల్లా నాయకులు పరుపాటి శ్రీనివాస్ రెడ్డి బాధిత కుటుంబానికి అండగా నిలిచారు. ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాధితురాలు గాదారి పూలమ్మకు రూ.10,000 నగదు ఆర్థిక సహాయంతో పాటు 50 కిలోల బియ్యాన్ని అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాన్ని పరామర్శించిన నాయకులు, ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో ఫౌండేషన్ ఎల్లప్పుడూ ప్రజలకు అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జినుగు అనిమి రెడ్డి, మండల పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి పూస మధు, మండల పార్టీ నాయకులు లేతకుల రంగా రెడ్డి, కర్ర రవీందర్ రెడ్డి, దేశాబోయిన ఉపేందర్, చందు రామ్, సంకినేని ఎల్లస్వామి, మాజీ సర్పంచ్ బోనగిరి ఎల్లయ్య, నాయకులు గిరిక సురేష్, ఎండీ అన్వార్, మొర్రి రాజేందర్, ముద్రబోయిన శ్రీనివాస్, రంపెల్లి రాజాలు, చిదిమిళ్ల అశోక్, బూడిద శ్రీధర్, బూడిద సోమయ్య, కందుకూరి వెంకన్న, కందుకూరి యాదగిరి, వెలుగొండ బిక్షపతి, కందుకూరి శ్రవణ్, ఎండీ అబ్బాస్, అజిత్, బూడిద యాకయ్య, కందుకూరి దేవనాథం, గదారి వెంకన్న, వెలుగొండ పరుశరామ్ తదితరులు పాల్గొన్నారు.

## నగర అందాలు, ఎంట్రెన్స్‌లు మన ప్రతిష్ఠకు ప్రతీకలు

**-కమిషనర్ టి. వెంకన్న**



వరంగల్ టౌన్, జూలై 28 (వుదయం ప్రతినిధి) : నగరంలోని పార్కులు, ప్రధాన ప్రవేశ ద్వారాలు (గ్రాండ్ ఎంట్రెన్స్‌లు) నగర ప్రతిష్ఠను ప్రతిబింబించేలా ఉండాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న స్పష్టం చేశారు. మంగళవారం నగరంలోని పబ్లిక్ గార్డెన్స్, ఎల్లాపూర్ నర్సరీ, కరీంనగర్ గ్రాండ్ ఎంట్రెన్స్, హసన్‌పర్తి-ాదీజ కేంద్రం, ఆరేపల్లి వద్ద ములుగు గ్రాండ్ ఎంట్రెన్స్‌లలో జరుగుతున్న సుందరీకరణ పనులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.

?ఈ సందర్భంగా ఆయన అధికారులకు పలు సూచనలు చేశారు.

?పార్కుల నిర్వహణ, కలుపు మొక్కలను ఎప్పటికప్పుడు తొలగిస్తూ, వాకింగ్ ట్రాక్‌లను పరిశుభ్రంగా ఉంచాలి.

?నర్సరీల సన్నద్ధత, వనమహోత్సవం కోసం ఎల్లాపూర్ నర్సరీలో మొక్కలను ఆరోగ్యవంతంగా పెంచి సిద్ధం చేయాలి.

?గ్రాండ్ ఎంట్రెన్స్‌ల వద్ద హరితీకరణ, నగరంలోకి వచ్చే సందర్శకులకు ఆహ్లాదకర అనుభూతిని ఇచ్చేలా పూల మొక్కలతో ప్రవేశ ద్వారాలను అందంగా తీర్చిదిద్దాలి. ?హరితీకరణ, సుందరీకరణ పనుల్లో నాణ్యతకు పెద్దపీట వేయాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కమిషనర్ హెచ్చరించారు. ఈ తనిఖీల్లో హార్టికల్చర్ అధికారి లక్ష్మారెడ్డి, ఎస్ఈ రాజ్‌కుమార్, ఈఈ రవికుమార్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## వాతావరణ మార్పుతో ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయడం అభినందనీయం

**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**



జయశంకర్ భూపాలపల్లి జులై 28(వుదయం జిల్లా ప్రతినిధి):?వాతావరణ మార్పులకు అనుగుణంగా రైతులు సమయస్ఫూర్తితో వ్యవహరిస్తూ, తక్కువ నీటితో పండే ప్రత్యామ్నయ పంటలను సాగు చేయడం ఎంతో అభినందనీయమని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. మంగళవారం ఆయన గుర్రంపేట గ్రామంలో పర్యటించి, క్షేత్రస్థాయిలో పంట మార్పిడి విధానంలో చేపట్టిన కంది సాగును పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రైతులతో ముఖాముఖి మాట్లాడి పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వాతావరణంలో చోటుచేసుకున్న ఎల్ నినో ప్రభావం వల్ల ఏర్పడనున్న నీటి సమస్యను దృష్టిలో ఉంచుకుని, రైతులు అవగాహనతో పంట మార్పిడి చేపట్టడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. గతంలో ఏ ఏ పంటలు సాగు చేశారు? ఈ ఏడాది ప్రత్యామ్నాయ, ఆరుతడి పంటల వైపు మొగ్గు చూపడానికి గల కారణాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. ఎల్ నినో ప్రభావంతో తలెత్తే నీటి ఎద్దడి, మారుతున్న వాతావరణ పరిస్థితులపై గ్రామంలోని ఇతర రైతులకు కూడా అవగాహన కల్పించి, వారు కూడా ప్రత్యామ్నయ పంటల వైపు మళ్లేలా ప్రోత్సహించాలని సూచించారు. సాంప్రదాయ పంటలకు భిన్నంగా ఎక్కువ లాభాలనిచ్చే ఆరుతడి మరియు ప్రత్యామ్నయ పంటల సాగుపై రైతులకు నిరంతరం తగిన మార్గదర్శనం చేయాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, జిల్లా ఉద్యానవన అధికారి తిరుపతి, తహసీల్దార్ లక్ష్మి రాజయ్య, ఇతర అధికారులు మరియు స్థానిక రైతులు పాల్గొన్నారు.


## జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడిగా జనగాం యాకయ్య నియామకం



రాయపర్తి జూలై 28 (వుదయం ప్రతినిధి):వరంగల్ జిల్లా రాయపర్తి మండలం గన్నారం గ్రామానికి చెందిన జనగాం యాకయ్యను వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడిగా నియమించారు. ఈ మేరకు ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ చైర్మన్ చిలివేరు శ్రీనివాస్ అధికారికంగా నియామకాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా జనగాం యాకయ్య మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి ఈ కీలక బాధ్యతను అప్పగించిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ చిలివేరు శ్రీనివాస్ తో పాటు పార్టీ పెద్దలు, నాయకులకు ధన్యవాదాలు తెలియజేశారు. పార్టీ ఆశయాలు, సిద్ధాంతాలను గ్రామస్థాయికి తీసుకెళ్లడంతో పాటు ఎస్సీ వర్గాల సంక్షేమం, అభివృద్ధి కోసం నిబద్ధతతో పనిచేస్తానని, పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని యాకయ్య స్పష్టం చేశారు. పార్టీ అధిష్ఠానం తనపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ ప్రజలకు అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు.

## జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం లో ఫీల్డ్ అసిస్టెంట్ జంగా లింగమూర్తి పై పోలీస్ స్టేషన్ లో పిర్యాదు

**తన అధికారం దుర్వినియోగం పై తమ్ముడు రైతు జంగ ప్రసాద్**





పర్వతగిరి , జులై 28 ( వుదయం ప్రతినిధి ):పర్వతగిరి మండల కేంద్రంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (వీ+చీ=జు+రా)లో ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న వ్యక్తి తన అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ సొంత తమ్ముడి వ్యవసాయ పనులను అడ్డుకుంటున్నాడంటూ పర్వతగిరి మండలానికి చెందిన రైతు జంగ ప్రసాద్ పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడు జంగ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం, తమకు వారసత్వంగా వచ్చిన వ్యవసాయ భూమిని 14 సంవత్సరాల క్రితం పెద్దమనుషుల సమక్షంలో రెండు భాగాలుగా విభజించి, లక్కీ డ్రా పద్ధతిలో పంచుకున్నారని, అప్పటి నుంచి తన వాటా భూమిని స్వతంత్రంగా సాగు చేసుకుంటూ వస్తున్నట్లు పేర్కొన్నారు. అయితే, తన అన్న జంగ లింగమూర్తి, ప్రస్తుతం పర్వతగిరి గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూ తన పొలాన్ని దున్నేందుకు వచ్చిన కౌలుదారులను, ట్రాక్టర్ యజమానిని బెదిరించి, అసభ్య పదజాలంతో దూషిస్తూ సాగు పనులు జరగకుండా అడ్డుకుంటున్నారని ఫిర్యాదులో ఆరోపించారు. ఇప్పటికే పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ పరిస్థితిలో మార్పు రాలేదని, పెద్దమనుషుల అండతో తన వ్యవసాయ మోటార్ వైర్లను కత్తిరించి గత 20 రోజులుగా వ్యవసాయ పనులు సాగకుండా చేసి తీవ్ర ఆర్థిక నష్టం కలిగించారని కూడా ఆయన ఆరోపించారు. ప్రభుత్వ ఉద్యోగిగా ఉండి అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ రైతును ఇబ్బందులకు గురిచేస్తున్న వ్యక్తిపై వెంటనే కేసు నమోదు చేసి, సమగ్ర విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జంగ ప్రసాద్ పోలీసులను కోరారు.

## చికిత్స పొందుతున్న మాజీ ఎమ్మెల్యే పెద్దిని సందర్శించిన మంత్రి పొంగులేటి,ఎమ్మెల్యే దొంతి





ఖానాపురం, జూలై 28 (వుదయం ప్రతినిధి): నర్సంపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి తీవ్ర అనారోగ్యానికి గురై సికింద్రాబాద్లోని యశోద ఆసుపత్రిలో వెంటిలేషన్ పై చికిత్స పొందుతున్న మాజీ ఎమ్మెల్యే పెద్దిని జిల్లా ఇన్చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, నియోజకవర్గ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సందర్శించి మెరుగైన వైద్యం అందించి మాజీ ఎమ్మెల్యే పెద్ది త్వరగా కోలుకునే విధంగా అన్ని రకాల వైద్య సదుపాయాలు అందించాలని యశోద వైద్య బృందానికి బయటి నుంచి వచ్చిన వైద్య బృందానికి జిల్లా ఇన్చార్జి మంత్రి పొంగులేటి, నియోజకవర్గ ఎమ్మెల్యే దొంతి సూచించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే పెద్ది కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు నర్సంపేట నియోజకవర్గ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# చక్కని ఆరోగ్యం

## సీ ఫుడ్‌ను తరచూ తినడం మంచిదే..



సముద్ర ఆహారాలు (సీ ఫుడ్) ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని చాలా మంది భావిస్తారు. చేపలు, రొయ్యలు, పీతలు, ఆయిస్టర్లు వంటి సముద్ర ఆహారాల్లో ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు, డీహెచ్ఏ, అధిక నాణ్యత కలిగిన ప్రోటీన్ వంటి ముఖ్యమైన పోషకాలు ఉంటాయి. ఇవి గుండె, మెదడు ఆరోగ్యానికి మేలు చేయడంలో సహాయపడతాయి. అయితే వీటిని తీసుకునే విషయంలో కొన్ని జాగ్రత్తలు కూడా అవసరమని నిపుణులు సూచిస్తున్నారు. సముద్ర ఆహారాలు పోషకవిలువలతో నిండి ఉన్నప్పటికీ, కొన్ని సందర్భాల్లో హానికరమైన లోహాలు, కాలుష్య కారకాలు కూడా వీటిలో చేరే అవకాశం ఉంటుంది. సముద్రాలు, నదులు పారిశ్రామిక వ్యర్థాలు, రసాయన కాలుష్యానికి గురికావడం వల్ల చేపలు, ఇతర సముద్ర జీవుల్లో కొన్ని విషపదార్థాలు పేరుకుపోతాయని పరిశోధనలు సూచిస్తున్నాయి. ఎన్విరాన్‌మెంటల్ హెల్త్ పర్‌స్పెక్టివ్స్ జర్నల్‌లో ప్రచురితమైన అధ్యయనం ప్రకారం.. కొన్ని రకాల సముద్ర ఆహారాల్లో మిథైల్ మెర్క్యురీతోపాటు పర్సిస్టెంట్ ఆర్గానిక్ పొల్యూటెంట్స్ వంటి కాలుష్య కారకాలు ఉండే అవకాశం ఉంటుంది. ఇవి అధిక మోతాదులో శరీరంలో చేరితే ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపే ప్రమాదం ఉంటుందని పరిశోధకులు పేర్కొంటున్నారు. మిథైల్ మెర్క్యురీతోపాటు సీసం (లెడ్), మాంగనీస్, క్రోమియం, క్యాడ్మియం, ఆర్సెనిక్ వంటి లోహాల ఆనవాళ్లు కూడా కొన్ని సముద్ర ఆహారాల్లో కనిపిస్తాయని అధ్యయనాలు సూచిస్తున్నాయి. ఇవి ఎక్కువ కాలం శరీరంలో పేరుకుపోతే ఆరోగ్య సమస్యలకు దారితీస్తాయని హెచ్చరిస్తున్నారు. కొన్ని పరిశోధనల ప్రకారం అధిక స్థాయిలో మెర్క్యురీకి గురికావడం వల్ల రోగనిరోధక వ్యవస్థ పనితీరుపై ప్రభావం పడే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా మహిళల్లో ఆటో ఇమ్యూన్ వ్యాధుల ప్రమాదం పెరుగుతుందని కొన్ని అధ్యయనాలు సూచిస్తున్నాయి. ఆటో ఇమ్యూన్ వ్యాధుల్లో శరీర రోగనిరోధక వ్యవస్థ ఆరోగ్యకరమైన కణాలపైనే దాడి చేయడం ప్రారంభిస్తుంది. దీని వల్ల ఇన్‌ఫ్లమేటరీ బవెల్ డిసీజ్, లూపస్, షోగ్రెన్ సిండ్రోమ్, రుమటాయిడ్ ఆర్థరైటిస్, మల్టిపుల్ స్క్లెరోసిస్ వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది.

అలాంటి ఆహారం తీసుకుంటే ప్రమాదమే..

పారిశ్రామిక కార్యకలాపాల వల్ల వాతావరణంలోకి విడుదలయ్యే మెర్క్యురీ నీటిలో కలిసిపోవడంతో చేపలు, షెల్‌ఫిష్‌లో అది పేరుకుపోయే అవకాశం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. చేపలు మెదడు ఆరోగ్యానికి మేలు చేస్తాయని అనేక అధ్యయనాలు సూచించినప్పటికీ, అధిక స్థాయిలో కాలుష్య కారకాలు ఉన్న చేపలను తరచూ తీసుకుంటే ఆ ప్రయోజనాలు తగ్గిపోయే అవకాశం కూడా ఉంటుందని హెచ్చరిస్తున్నారు. గర్భిణులు, పాలిచ్చే తల్లులు, పిల్లలు సముద్ర ఆహారం తీసుకునే విషయంలో మరింత జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు. అధిక మెర్క్యురీ ఉన్న చేపలను తరచూ తీసుకోవడం వల్ల గర్భంలోని శిశువు నాడీ వ్యవస్థ అభివృద్ధిపై ప్రభావం పడే ప్రమాదం ఉంటుందని పరిశోధనలు పేర్కొంటున్నాయి. ఇది భవిష్యత్తులో జ్ఞాపకశక్తి, భాషా నైపుణ్యాలు, దృష్టి–కదలికల సమన్వయం వంటి అంశాలపై ప్రభావం చూపే అవకాశం ఉంటుందని వెల్లడించాయి. అయితే దీనర్థం సముద్ర ఆహారాలను పూర్తిగా మానేయాలని కాదు. నమ్మకమైన ప్రాంతాల నుంచి లభించే, నాణ్యమైన సముద్ర ఆహారాన్ని పరిమిత మోతాదులో తీసుకోవడం మంచిది. ముఖ్యంగా గర్భిణులు, పాలిచ్చే తల్లులు తమ ఆహారంలో చేపలను చేర్చే ముందు వైద్యులు లేదా పోషకాహార నిపుణుల సలహా తీసుకోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

## కోడిగుడ్లలో అసలు ఏయే పోషకాలు ఉంటాయి..



గుడ్లు అత్యంత పోషకవిలువలు కలిగిన ఆహారాల్లో ఒకటిగా గుర్తింపు పొందాయి. ఉదయం అల్పాహారం నుంచి మధ్యాహ్నం, రాత్రి భోజనం వరకు అనేక రకాల వంటకాల్లో వీటిని ఉపయోగిస్తారు. అధిక నాణ్యత కలిగిన ప్రోటీన్లు, విటమిన్లు, ఖనిజాలు, ఆరోగ్యకరమైన కొవ్వులు సమృద్ధిగా ఉండే గుడ్లు శరీరానికి అవసరమైన అనేక పోషకాలను అందిస్తాయి. రోజువారీ ఆహారంలో పరిమిత మోతాదులో గుడ్లను చేర్చడం వల్ల కండరాల ఆరోగ్యం నుంచి మెదడు పనితీరు వరకు అనేక ప్రయోజనాలు పొందవచ్చని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. గుడ్లు అధిక నాణ్యత కలిగిన ప్రోటీన్‌కు అద్భుతమైన మూలం. ప్రోటీన్లు కండరాల నిర్మాణం, మరమ్మత్తు, రోగనిరోధక శక్తి పెంపు, రక్తంలో చక్కెర స్థాయిల నియంత్రణ, బరువు తగ్గడంలో కీలక పాత్ర పోషిస్తాయి. గుడ్డులోని తెల్లసొనతోపాటు పచ్చసొనలో కూడా కండరాల అభివృద్ధికి తోడ్పడే పోషకాలు ఉంటాయి. ఎముకల ఆరోగ్యానికి అవసరమైన విటమిన్ డి గుడ్లలో సమృద్ధిగా లభిస్తుంది. అలాగే ఫాస్ఫరస్ కూడా ఉండటం వల్ల ఎముకలు, దంతాలు దృఢంగా ఉండేందుకు అవసరమైన పోషణ లభిస్తుంది. గుడ్లలో బి విటమిన్లు, కోలిన్, ఆరోగ్యకరమైన కొవ్వులు పుష్కలంగా ఉంటాయి. ఇవి మెదడు, నాడీ వ్యవస్థ పనితీరుకు మేలు చేస్తాయి. కోలిన్ జ్ఞాపకశక్తిని మెరుగుపరచడంలో సహాయపడుతుంది. ప్రోటీన్ రోజంతా మానసిక చురుకుదనాన్ని కొనసాగించేందుకు దోహదం చేస్తుంది. గుడ్లలో ల్యూటిన్, జియాక్సాంతిన్ వంటి యాంటీఆక్సిడెంట్లు ఉండటం వల్ల కంటి ఆరోగ్యానికి మేలు జరుగుతుంది. వయసు పెరుగుతున్న కొద్దీ వచ్చే కంటి సమస్యల ప్రమాదాన్ని తగ్గించడంలోనూ ఇవి సహాయపడతాయి. అలాగే ట్రిప్టోఫాన్, టైరోసిన్ వంటి అమినో ఆమ్లాలు గుండె ఆరోగ్యానికి కూడా తోడ్పడుతాయి. బరువు తగ్గాలనుకునే వారికి కూడా గుడ్లు మంచి ఎంపికగా ఉంటాయి. ప్రోటీన్ అధికంగా ఉండటం వల్ల అవి నెమ్మదిగా జీర్ణమవుతాయి. దీంతో ఎక్కువసేపు ఆకలి వేయకుండా ఉండి, అధికంగా తినే అలవాటు తగ్గే అవకాశం ఉంటుంది. కూరగాయలతో చేసిన ఆమ్లెట్, ఉడికించిన గుడ్లు లేదా ఇతర ఆరోగ్యకరమైన గుడ్ల వంటకాలు బరువు నియంత్రణకు ఉపయోగపడతాయి. గుడ్లలోని ప్రోటీన్లు జీర్ణక్రియ సమయంలో శరీరంలో జీవక్రియలను ప్రభావితం చేసే పెప్టైడ్లుగా మారతాయని కొన్ని అధ్యయనాలు సూచిస్తున్నాయి. ఇవి జీవక్రియను చురుకుగా ఉంచడంలో, అలాగే కొలెస్ట్రాల్ శోషణను తగ్గించడంలో కొంతవరకు సహాయపడే అవకాశం ఉందని పరిశోధనలు పేర్కొంటున్నాయి. గుడ్లు తక్కువ కేలరీలు కలిగిన ఆహారం కూడా. ఒక పెద్ద గుడ్డులో సుమారు 78 కేలరీలు మాత్రమే ఉంటాయి. బరువు తగ్గే ప్రయత్నంలో ఉన్నవారు పచ్చసొనను పరిమితం చేసి, అవసరాన్ని బట్టి తెల్లసొనను తీసుకోవచ్చు. గుడ్లలో కొలెస్ట్రాల్ ఉన్నప్పటికీ, అవి మంచి నాణ్యత కలిగిన ప్రోటీన్‌ను అందించే ఆహారం. తాజా పరిశోధనల ప్రకారం చాలా మంది ఆరోగ్యవంతులలో పరిమిత మోతాదులో గుడ్లు తీసుకోవడం వల్ల మంచి కొలెస్ట్రాల్ (HDL) స్థాయిలు పెరగడానికి దోహదపడుతుంది. అయితే ఇప్పటికే అధిక కొలెస్ట్రాల్, గుండె సంబంధిత సమస్యలు లేదా ఇతర ఆరోగ్య సమస్యలు ఉన్నవారు గుడ్ల వినియోగంపై వైద్యులు లేదా పోషకాహార నిపుణుల సలహా తీసుకోవడం మంచిది.

## ఈ ఆరోగ్య సమస్యలు ఉన్నవారు బొప్పాయి తినకపోవడం మంచిది!



బొప్పాయి ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే పండు. ఇందులో విటమిన్ ఏ, విటమిన్ సి, ఫోలేట్, ఫైబర్, పొటాషియం వంటి పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. అలాగే జీర్ణక్రియకు సహాయపడే పాపైన్ అనే ఎంజైమ్ కూడా ఉంటుంది. బొప్పాయి జీర్ణక్రియను మెరుగుపరచడం, రోగనిరోధక శక్తిని పెంచడం, చర్మ ఆరోగ్యాన్ని కాపాడటంలో ఉపయోగపడుతుంది. అయితే, కొన్నిఆరోగ్య సమస్యలు ఉన్నవారు దీనిని తినే ముందు వైద్యుల సలహా తీసుకోవడం మంచిది. గర్భధారణ సమయంలో బొప్పాయి తినకపోవడం మంచిదని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఇందులో ఉండే లేటెక్స్, పాపైన్ వల్ల గర్భాశయ సంకోచాలు వచ్చే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. బొప్పాయిలో విటమిన్ సి ఎక్కువగా ఉంటుంది. దీనిని అధికంగా తీసుకుంటే శరీరంలో ఆక్సలేట్ పెరిగి, కొందరిలో కిడ్నీ రాళ్లు మళ్లీ ఏర్పడే అవకాశం ఉంటుంది. కాబట్టి మితంగా తీసుకోవాలి. హైపోథైరాయిడిజం ఉన్నవారు బొప్పాయిని ఎక్కువగా తీసుకునే ముందు వైద్యుడి సలహా తీసుకోవాలి. కొన్ని అధ్యయనాల ప్రకారం ఇందులోని కొన్ని పదార్థాలు అయోడిన్ వినియోగంపై స్వల్ప ప్రభావం చూపే అవకాశం ఉందని చెబుతున్నారు. గుండె కొట్టుకునే వేగంలో సమస్యలు (అరిథ్మియా) ఉన్నవారు లేదా గుండె నెమ్మదిగా కొట్టుకునే సమస్య ఉన్నవారు బొప్పాయిని ఎక్కువగా తినే ముందు వైద్యులని సంప్రదించడం మంచిది. బొప్పాయి రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గించడంలో కొంత సహాయపడుతుంది. ఇప్పటికే మధుమేహం కోసం మందులు లేదా ఇన్సులిన్ తీసుకునేవారు బొప్పాయిని ఎక్కువగా తింటే రక్తంలో చక్కెర స్థాయిలు మరీ తగ్గే అవకాశం ఉంటుంది.

## కిడ్నీ సమస్యలు.. గుండెకు ప్రమాదకరమా?

మన శరీరంలో మూత్రపిండాలు (కిడ్నీలు) చాలా ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. ఇవి రక్తంలోని వ్యర్థ పదార్థాలను తొలగించడం, అదనపు నీటిని బయటకు పంపించడం, రక్తపోటును నియంత్రించడంలో సహాయపడతాయి. అయితే కిడ్నీల పనితీరు దెబ్బతింటే దాని ప్రభావం గుండెపై కూడా పడుతుంది.

కిడ్నీలు సరిగా పనిచేయకపోతే శరీరంలో ఉప్పు, నీరు, వ్యర్థ పదార్థాలు పేరుకుపోతాయి. దీనివల్ల రక్తపోటు పెరుగుతుంది. అధిక రక్తపోటు కారణంగా గుండె సాధారణం కంటే ఎక్కువ శ్రమించాల్సి వస్తుంది. గుండె బలహీనపడటం (హార్ట్ ఫెయిల్యూర్) పక్షవాతం వంటి సమస్యలు వచ్చే అవకాశం పెరుగుతుంది.



ఎవరికి ఎక్కువ ప్రమాదం ఉంటుంది? కింది సమస్యలు ఉన్నవారు కిడ్నీ, గుండె ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి.

మధుమేహం ఉన్నవారు

అధిక రక్తపోటు ఉన్నవారు

కిడ్నీ సమస్యలు ఉన్నవారు

రక్తహీనత సమస్య ఉన్నవారు, కిడ్నీ వ్యాధి కారణంగా శరీరంలో ఖనిజాల అసమతుల్యత, వాపు వంటి సమస్యలు కూడా రావచ్చు. ఇవి గుండెపై అదనపు భారాన్ని పెంచుతాయి. కిడ్నీల పనితీరు తగ్గినప్పుడు ఈ లక్షణాలు కనిపించవచ్చు:

కాళ్లు, ముఖం వాపు రావడం

తరచుగా మూత్రం రావడం లేదా మూత్రం తగ్గడం

మూత్రంలో నురుగు లేదా రక్తం కనిపించడం

ఆకలి తగ్గడం, చర్మంపై దురద, అధిక రక్తపోటు, కిడ్నీ వ్యాధి ప్రారంభ దశలో పెద్దగా లక్షణాలు కనిపించకపోవచ్చు. అందుకే దీనిని చాలాసార్లు 'నిశ్శబ్ద వ్యాధి' అని కూడా అంటారు.

కిడ్నీ ఆరోగ్యానికి హాని చేసే అలవాట్లు

కొన్ని రోజువారీ అలవాట్లు కిడ్నీలపై ప్రభావం చూపుతాయి.

ధూమపానం చేయడం, వైద్యుల సలహా లేకుండా ఎక్కువగా నొప్పి నివారణ మందులు వాడటం

తగినంత నీరు తాగకపోవడం, ఇలాంటి అలవాట్లను తగ్గించుకోవాలి. కిడ్నీ, గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి చిట్కాలు సమతుల్యమైన ఆహారం తీసుకోవాలి. రోజుకు తగినంత నీరు తాగాలి. పండ్లు, కూరగాయలు ఎక్కువగా తీసుకోవాలి.

## ఉప్పుతో లాభాలెన్నో

గోరువెచ్చని నీటిలో కొద్దిగా కల్లుప్పు వేసి కాసేపు పాదాల్ని ఉంచితే, రోజంతా పడ్డ అలసట మాయమై పాదాల నొప్పులు, వాపులు త్వరగా తగ్గుతాయి. ఉప్పును మెత్తగా నూరి కొబ్బరి, ఆలివ్ నూనెతో కలిపి చర్మంపై రుద్దితే... సహజమైన బాడీ స్క్రబ్‌గా పనిచేస్తుంది. మృతకణాలను తొలగించి, రంధ్రాలను శుభ్రపరిచి చర్మాన్ని కోమలంగా మారుస్తుంది. గోరువెచ్చని ఉప్పు నీటితో నోరు పుక్కిలించడం వల్ల చిగుళ్ల సమస్యలు, నోటి దుర్వాసన తగ్గుతాయి. ఉప్పు శక్తిమంతమైన క్లీనర్‌గా పనిచేస్తుంది. వంటగదిలోని జిడ్డు మరకలను తొలగించడంలో ఇది ఎంతో సహాయపడుతుంది. మాడిపోయిన గిన్నెలు లేదా బాణలిపై కొద్దిగా ఉప్పు చల్లి, నిమ్మకాయ చెక్కతో బాగా రుద్దితే ఆ నల్లటి మరకలు సులువుగా వదిలిపోతాయి. సింక్ డ్రెయిన్ నుంచి వచ్చే చెడు వాసనను అరికట్టడానికి, పైపుల్లో పేరుకుపోయిన మురికిని వదిలించడానికి బాగా కాచిన వేడి నీటిలో చిక్కటి ఉప్పు ద్రావణాన్ని కలిపి పోస్తే సరి. ఇత్తడి, రాగి పాత్రలపై ఉన్న మచ్చలను వదిలించడానికి ఉప్పు, వెనిగర్ కలిపిన మిశ్రమాన్ని ఉపయోగిస్తే మళ్లీ కొత్తవాటిలా మెరిసిపోతాయి. దుస్తులపై నూనె, టీ లేదా కాఫీ మరకలు పడినప్పుడు వెంటనే ఆ భాగాన్ని ఉప్పు నీళ్లలో నానబెట్టి ఉతికితే మరకలు తేలికగా వదిలిపోతాయి. అంతేకాకుండా కొత్త డ్రెస్‌లు ఉతికేటప్పుడు కొద్దిగా ఉప్పు చేర్చడం వల్ల దుస్తుల రంగులు వెలిసిపోకుండా ఉంటాయి. అద్దాలు, గాజు గ్లాసులపై ఏర్పడే నీటి చారలను కూడా ఉప్పు నీటితో తుడిచి శుభ్రం చేయవచ్చు. వర్షాకాలంలో ఇంట్లో తేమ శాతం పెరిగి ఒక విధమైన దుర్వాసన వస్తున్నప్పుడు, ఒక చిన్న గిన్నెలో ఉప్పు వేసి గది మూలన ఉంచితే అది గాలిలోని తేమను పీల్చుకుని వాతావరణాన్ని ఆహ్లాదకరంగా మారుస్తుంది.



## నెలసరిలో ఎందుకీ సమస్యలు?


సాధారణంగా నెలసరిలో కడుపునొప్పి, నడుం నొప్పి, అలసట, నీరసం.. వంటి సమస్యలు చాలామందిలో కనిపిస్తుంటాయి. ఇవే కాదు.. రుతుచక్రం జీర్ణ వ్యవస్థ పైనా ప్రతికూల ప్రభావం చూపుతుందంటున్నారు నిపుణులు. ఫలితంగా ఈ సమయంలో వివిధ జీర్ణ సంబంధిత సమస్యలూ వచ్చే అవకాశం ఎక్కువంటున్నారు. పిరియడ్స్‌లో ఇవీ సర్వసాధారణమే అంటున్నారు. మరి, ఏంటా సమస్యలు? తెలుసుకుందాం రండి..

నెలసరిలో శారీరక నొప్పులు, మానసిక ఒత్తిళ్లు, అలసట.. వంటి సమస్యలకు హార్మోన్లలో వచ్చే మార్పులే కారణమన్న సంగతి తెలిసిందే! అయితే వీటిలో హెచ్చుతగ్గులే ఈ సమయంలో జీర్ణ వ్యవస్థ పనితీరు పైనా ప్రతికూల ప్రభావం చూపుతాయంటున్నారు నిపుణులు. నెలసరి ప్రారంభానికి వారం రోజుల ముందు ప్రొజెస్టరాన్ స్థాయులు ఒక్కసారిగా పడిపోతాయట. ఫలితంగా పేగుల్లో ఆహార కదలికలు నెమ్మదిస్తాయని, దీనివల్ల గ్యాస్ ఏర్పడి కడుపుబ్బరానికి దారితీస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఇక పిరియడ్స్ సమయంలో ఎదురయ్యే దుష్ప్రభావాల కారణంగా విశ్రాంతి తీసుకోవడానికే ఆసక్తి చూపుతారు చాలామంది. ఫలితంగా వ్యాయామం చేయకపోవడం, జంక్‌ఫుడ్స్ తినాలన్న కోరిక, నీళ్లు ఎక్కువగా తాగకపోవడం.. వంటి మార్పులన్నీ మలబద్ధకానికి దారితీస్తాయంటున్నారు. అయితే కొంతమందిలో బ్లీడింగ్ ప్రారంభం కాగానే.. ప్రోస్టాగ్లాండిన్లు అనే హార్మోన్లు ఎక్కువగా ఉత్పత్తవుతాయట! ఇవి పేగుల్లో ఆహార కదలికల వేగాన్ని పెంచి.. విరేచనాలకు దారితీస్తాయంటున్నారు నిపుణులు. ఇక కొంతమందిలో వికారం, వాంతులవడం.. వంటి లక్షణాలు కూడా కనిపించే అవకాశాలున్నాయంటున్నారు. అయితే పిరియడ్స్ సమయంలో ఈ జీర్ణ సంబంధిత సమస్యలన్నీ సర్వసాధారణమే అంటున్నారు నిపుణులు. నెలసరి పూర్తవగానే ఇవి తగ్గుముఖం పడతాయని చెబుతున్నారు. ఆలోపు ఈ చిన్న చిన్న చిట్కాలతో ఉపశమనం పొందచ్చంటున్నారు. ఈ సమయంలో సులభంగా జీర్ణమయ్యే ఆహార పదార్థాల్నే తీసుకోవాలంటున్నారు నిపుణులు. కెఫీన్, పాలు–పాల పదార్థాలు, నూనె పదార్థాలు, బేకరీ ఉత్పత్తులు.. వంటి వాటికి దూరంగా ఉండడమే మేలంటున్నారు. తక్కువ మోతాదులో ఎక్కువసార్లు తినడం వల్ల జీర్ణ వ్యవస్థపై ఒత్తిడి పడకుండా జాగ్రత్తపడచ్చంటున్నారు నిపుణులు. తద్వారా తీసుకున్న ఆహారం సులభంగా జీర్ణమై.. జీర్ణ సంబంధిత సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తపడచ్చని చెబుతున్నారు. ఫైబర్ అధికంగా లభించే ఓట్స్, కాయగూరలు తీసుకోవడం వల్ల జీర్ణక్రియ పనితీరు మెరుగుపడుతుందంటున్నారు నిపుణులు. అలాగే నీళ్లు ఎక్కువగా తాగడం కూడా ముఖ్యమే. తద్వారా అజీర్తి, కడుపుబ్బరం, మలబద్ధకం.. వంటి సమస్యల నుంచి విముక్తి పొందచ్చు. వికారంగా అనిపిస్తే అల్లం, పెప్పర్‌మెంట్ టీ తాగడం వల్ల ఫలితం ఉంటుంది. ప్రొబయాటిక్స్ ఎక్కువగా ఉండే పెరుగు తీసుకోవడం వల్ల విరేచనాల సమస్య నుంచి ఉపశమనం పొందచ్చంటున్నారు నిపుణులు. అయితే ఈ చిట్కాల వల్ల ఉపశమనం కలగకపోయినా.. జీర్ణ సంబంధిత సమస్యలు తీవ్రంగా ఉన్నట్లనిపించినా.. ఆలస్యం చేయకుండా డాక్టర్‌ని సంప్రదించడం మంచిదంటున్నారు నిపుణులు. ఎందుకంటే ఈ దుష్ప్రభావాలు కొన్నిసార్లు ఎండోమెట్రియోసిస్, ఇరిటబుల్ బొవెల్ సిండ్రోమ్.. వంటి సమస్యలకు సంకేతాలని చెబుతున్నారు. కాబట్టి ఈ విషయాల్ని దృష్టిలో పెట్టుకోవడం మేలు.



## నోరు, దంతాల సమస్యలు ఉన్నవారు వీటిని ఉపయోగించండి..

మన నోటి ఆరోగ్యం మన మొత్తం ఆరోగ్యానికి అద్దం పడుతుంది. దంతాలు బలహీనపడటం, పిప్పి దంతాలు, దంతాలపై మరకలు, దంతాల సున్నితత్వం (టూత్ సెన్సిటివిటీ) వంటి సమస్యలు చాలా మందిలో కనిపిస్తున్నాయి. ముఖ్యంగా చల్లని లేదా వేడి ఆహారం తిన్నప్పుడు దంతాలలో ఒక్కసారిగా నొప్పి లేదా జలదరింపు అనిపించడం దంతాల సున్నితత్వానికి సంకేతం. అయితే కొన్ని సాధారణ జాగ్రత్తలను పాటించడం ద్వారా ఈ సమస్యను తగ్గించుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. అమ్లం (ఆసిడిటీ) ఎక్కువగా ఉండే ఆహారాలు, పానీయాలను అధికంగా తీసుకోవడం తగ్గించాలి. ఇవి దంతాలపై ఉండే ఎనామెల్‌ను క్రమంగా దెబ్బతీసి సున్నితత్వాన్ని పెంచే అవకాశం ఉంటుంది. అలాగే ఇలాంటి ఆహారం తీసుకున్న వెంటనే కాకుండా కనీసం 20 నిమిషాల తర్వాత దంతాలను తోమడం మంచిది. గ్యాస్ట్రిక్ సమస్యలు లేదా యాసిడ్ రిఫ్లక్స్‌తో బాధపడేవారు వాటికి సరైన చికిత్స తీసుకోవాలి. కడుపులోని ఆమ్లం తరచూ నోటిలోకి రావడం వల్ల దంతాలలోని ఖనిజాలు తగ్గి, ఎనామెల్ దెబ్బతినే ప్రమాదం ఉంటుంది. దీంతో దంతాల సున్నితత్వం మరింత పెరుగుతుంది. గ్రీన్ టీ తాగడం కూడా దంతాల ఆరోగ్యానికి ఉపయోగపడుతుంది. కొన్ని అధ్యయనాల ప్రకారం గ్రీన్ టీలో ఉండే కొన్ని సమ్మేళనాలు దంతాల సున్నితత్వాన్ని తగ్గించడంలో సహాయపడే అవకాశం ఉంటుందని పరిశోధకులు చెబుతున్నారు. ఉప్పు కలిపిన గోరువెచ్చని నీటితో నోరు పుక్కిలించడం కూడా ఉపయోగకరంగా ఉంటుంది. ఇది నోటిలోని పీహెచ్ స్థాయిని సమతుల్యం చేయడంలో సహాయపడి, బ్యాక్టీరియా పెరుగుదలను తగ్గించడంలో తోడ్పడుతుంది. దంతాలను తెల్లగా మార్చే (టీత్ వైటెనింగ్) ఉత్పత్తులు లేదా ఆల్కహాల్ అధికంగా ఉండే మౌత్‌వాష్‌లను తరచూ ఉపయోగించడం తగ్గించాలి. ఇవి కొందరిలో దంతాల సున్నితత్వాన్ని మరింత పెంచే అవకాశం ఉంటుంది. అవసరమైతే సహజ పదార్థాలతో తయారైన ఉత్పత్తులను మాత్రమే ఉపయోగించడం మంచిది. లవంగం లేదా లవంగ నూనె కూడా దంతాల సున్నితత్వం వల్ల వచ్చే అసౌకర్యాన్ని తాత్కాలికంగా తగ్గించడంలో ఉపయోగపడుతుంది. లవంగంలో ఉండే సహజ సమ్మేళనాలు నొప్పిని తగ్గించే లక్షణాలను కలిగి ఉంటాయి. దంతాల సున్నితత్వం తరచూ వేధిస్తుంటే లేదా నొప్పి ఎక్కువగా ఉంటే ఇంటి చిట్కాలపై మాత్రమే ఆధారపడకుండా దంత వైద్యుడిని సంప్రదించడం అవసరం. సరైన కారణాన్ని గుర్తించి చికిత్స తీసుకోవడం ద్వారా సమస్య మరింత తీవ్రమవకుండా నివారించవచ్చని నిపుణులు తెలియజేస్తున్నారు.



## టాటా సన్స్ లాభంలో 22% వృద్ధి

టాటా గ్రూప్ హోల్డింగ్ సంస్థ టాటా సన్స్, 2025-26 ఆర్థిక సంవత్సరంలో స్టాండలోన్ ప్రాతిపదికన రూ.31,961 కోట్ల నికర లాభం నమోదు చేసింది. 2024-25 లాభం రూ.26,232 కోట్ల కంటే ఇది 22% అధికం. పెట్టుబడులపై వచ్చిన లాభాలు, అనుబంధ సంస్థలు మెరుగైన పనితీరు కనబర్చడం టాటా సన్స్ లాభాల్లో వృద్ధికి కారణమయ్యాయి. సంస్థ ఆదాయం 9.1% పెరిగి రూ.42,367 కోట్లకు చేరింది. ఒక్కో షేరుకు రూ.1,10,717 డివిడెండును కంపెనీ బోర్డు సిఫారసు చేసింది. గత ఆర్థిక సంవత్సరంలో టాటా గ్రూపు ఆదాయం 7.8% పెరిగి రూ.16.24 లక్షల కోట్లకు, లాభం 52% వృద్ధితో రూ.1.71 లక్షల కోట్లకు చేరాయి. 2020 స్థాయితో పోలిస్తే గ్రూపు ఆదాయం 2.1 రెట్లు, లాభాలు 5.4 రెట్లు పెరిగాయని టాటా సన్స్ ఛైర్మన్ చంద్రశేఖరన్ తెలిపారు.




# రూ.10, 20 ప్లాస్టిక్ నోట్లొస్తున్నాయ్



దేశంలో సామాన్యులు రోజువారీగా అత్యధికంగా వినియోగించేది రూ.10, రూ.20 నోట్లే. వాడకం అధికంగా ఉండటంతో త్వరగా పాడవుతున్నవీ ఈ నోట్లే. అందుకే రూ.10, రూ.20 విలువ కలిగిన పాలిమర్ (ప్లాస్టిక్) నోట్లను ప్రయోగాత్మకంగా వినియోగంలోకి తెచ్చేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ)కు ప్రభుత్వం అనుమతి ఇచ్చినట్లు లోక్‌సభకు ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌధ్రీ వెల్లడించారు. 1934 ఆర్‌బీఐ చట్టంలోని సెక్షన్ 25 ప్రకారం.. ఆర్‌బీఐ సెంట్రల్ బోర్డు సిఫారసుల మేరకే, ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. దేశంలో పాలిమర్ నోట్లను పరీక్షించేందుకు చిన్నమొత్తాలతో ప్రారంభించాలని నిర్ణయించారు. తొలిసారిగా రూ.10 పాలిమర్ నోట్లు 100 కోట్ల మేర, రూ.20 పాలిమర్ నోట్లు మరో 100 కోట్ల మేర మార్కెట్‌లోకి విడుదల చేయనున్నారు. పాలిమర్ నోట్లు మార్కెట్‌లోకి వచ్చినా, ప్రస్తుతం ఉన్న కాగితపు కరెన్సీ నోట్లు రద్దు కావని, రెండూ సమాంతరంగా చలామణిలో ఉంటాయని కేంద్రం స్పష్టం చేసింది. కరెన్సీ నోట్లు పాడవుతుండటంతో, కొత్తగా ముద్రించేందుకు ఏటా పెద్దమొత్తంలో నిధులు వెచ్చించాల్సి వస్తోంది. 2023-24లో కొత్త నోట్ల ముద్రణ వ్యయం రూ.5,101.4 కోట్లు కాగా, 2024-25లో రూ.6372.8 కోట్లకు చేరింది. ఒకపక్క డిజిటల్ చెల్లింపులు సంఖ్యాపరంగా - విలువపరంగా వృద్ధి చెందుతున్నా, కరెన్సీ నోట్ల ముద్రణకు అధికంగా వెచ్చించాల్సి వస్తున్నందునే, పాలిమర్‌నోట్లు తెస్తున్నారు.

# రూ.52వేల కోట్లు చెల్లించేందుకు జాన్సన్ అండ్ జాన్సన్ అంగీకారం

జాన్సన్ అండ్ జాన్సన్ (J&J) బేబీ పౌడర్, ఇతర టాల్కం పౌడర్లు అండాశయ క్యాన్సర్‌కు కారణమవుతున్నాయంటూ గతంలో దాఖలైన దావా పరిష్కారానికి సంస్థ ముందుకు వచ్చింది. దశాబ్దానికి పైగా సాగిన ఈ కేసులో పిటిషనర్లకు రూ.52వేల కోట్లు చెల్లించేందుకు అంగీకరించింది. అమెరికా వ్యాప్తంగా ఉన్న కోర్టులలో దీనిపై 76,000 పిటిషన్‌లు దాఖలయ్యాయి. వారిలో 95శాతం పిటిషనర్లు ఈ డీల్‌కు అంగీకరిస్తే.. ఈ ఆఫర్‌ను అమల్లోకి తెచ్చే అవకాశం ఉంది. లేదంటే మరిన్ని వ్యాజ్యాలను ఎదుర్కోవాల్సి వస్తుంది. తమ టాల్కం ఆధారిత ఉత్పత్తులు సురక్షితమైనవని.. వాటిలో హానికరమైన ఆస్బెస్టాస్ అనే పదార్థం లేదని ఇంత కాలం జాన్సన్ అండ్ జాన్సన్ సంస్థ వాదిస్తూ వస్తోంది. అవి అండాశయ క్యాన్సర్‌కు కారణమవుతున్నాయనే ఆరోపణలను ఖండించింది. అయితే ఈ విషయంలో కొన్నేళ్లుగా తరచూ ఎదుర్కొంటున్న కోర్టు విచారణలు, వాటిపై అవుతున్న భారీ ఖర్చుకు స్వస్తి చెప్పాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. ఈ కేసులో తాము గెలుపొందుతామని నమ్మకం ఉన్నప్పటికీ.. దానిపై ఎక్కువ సమయం కేటాయిస్తుండడం వల్ల కంపెనీ ఇతర లక్ష్యాలపై దృష్టి పెట్టలేకపోతున్నామని పేర్కొంది. అందుకే రూ.52 వేల కోట్లు చెల్లించేందుకు అంగీకరించామంది. మొదట 2027లో 3 బిలియన్ డాలర్లు చెల్లిస్తామని.. మిగిలినవి 2028లో ఇస్తామని న్యాయస్థానానికి తెలిపింది. జాన్సన్ అండ్ జాన్సన్ బేబీ పౌడర్ సహా ఆ సంస్థ తయారు చేసే ఇతర ఉత్పత్తులను ఏళ్లతరబడి ఉపయోగించడం వల్ల మహిళలు అండాశయ క్యాన్సర్ బారిన పడుతున్నట్లు కొన్నేళ్ల క్రితం పలువురు అమెరికా (USA) కోర్టులలో పిటిషన్ వేశారు. ఆ పౌడర్‌లలో క్యాన్సర్‌కు కారణమయ్యే ఆస్బెస్టాస్ అనే పదార్థాన్ని కలుపుతున్నట్లు ఆరోపించారు. ఈ వార్తలను జాన్సన్ అండ్ జాన్సన్ సంస్థ ఖండించింది. అయితే 2020లో అమెరికాలో టాల్క్ ఆధారిత జాన్సన్స్ బేబీ పౌడర్ అమ్మకాలను నిలిపివేసి.. దాని స్థానంలో మొక్కజొన్న పిండితో తయారయ్యే పౌడర్‌ను తీసుకువచ్చింది.



# 2030 కల్లా 12 గిగావాట్లకు భారత డేటా సెంటర్ల సామర్థ్యం



భారత డేటా సెంటర్ల సామర్థ్యం 2025 నాటి 2.2 గిగావాట్ల (జీడబ్ల్యూ)తో పోలిస్తే 2030 కల్లా అయిదింతలకు పైగా పెరిగి 12 గిగావాట్లకు చేరొచ్చని అంచనా. కృత్రిమ మేధ (ఏఐ), హైపర్‌స్కేల్ క్లౌడ్ పెట్టుబడులు, విస్తరిస్తున్న భారత డిజిటల్ ఆర్థిక వ్యవస్థతో లభిస్తున్న గిరాకీ ఇందుకు దోహదం చేయొచ్చని ప్రపంచ పరిశోధన-కన్సల్టెన్సీ సంస్థ ఉడ్ మెకంజీ తాజా నివేదికలో పేర్కొంది. ఏఐ ఆధారిత డేటా కేంద్రాల సామర్థ్యం 2025లో 275 మెగావాట్లుగా ఉండగా, 2030 కల్లా 6,546 మెగావాట్లకు చేరొచ్చు. డేటా సెంటర్ల విద్యుత్ గిరాకీ 2025లో 10 టెరావాట్ అవర్స్ (టీడబ్ల్యూహెచ్) కాగా, 2040 నాటికి 191 టీడబ్ల్యూహెచ్‌కు చేరొచ్చు. భారత డిజిటల్ ఆర్థిక వ్యవస్థ 2025లో రూ.32 లక్షల కోట్ల స్థాయిలో ఉంది. జీడీపీలో 12% వాటా పొందింది. 103 కోట్ల మంది ఇంటర్నెట్ వినియోగదార్లు, 2,200 కోట్ల నెలవారీ యూపీఐ లావాదేవీలతో డేటా సెంటర్ల మౌలిక వసతులకు గిరాకీ అధికమవుతోంది. ప్రస్తుతం డేటా సెంటర్ల మొత్తం ఇన్‌స్టాల్డ్ ఐటీ లోడ్‌లో 65 శాతాన్ని మహారాష్ట్ర, తమిళనాడు కలిగి ఉన్నాయి. భవిష్యత్ పెట్టుబడులు మాత్రం ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు ఉత్తరప్రదేశ్, కర్ణాటకలకు విస్తరించొచ్చు. గూగుల్, అమెజాన్ వెబ్ సర్వీసెస్ వంటి అంతర్జాతీయ హైపర్‌స్కేలర్లతో పాటు దేశీయ ఆపరేటర్లయిన అదానీకనెక్స్ వంటి వాటి నుంచీ పెట్టుబడులను ఈ రాష్ట్రాలు ఆకర్షిస్తున్నాయి. డేటా సెంటర్ డెవలపర్లకు ఇపుడు భూసేకరణ, మూలధన పెట్టుబడులతో పోలిస్తే విద్యుత్, దీర్ఘకాల పునరుత్పాదక ఇంధన కొనుగోళ్ల ఒప్పందాలే ప్రాధాన్యతలుగా మారాయి. విద్యుత్ ఒప్పందాలు పొందిన వారు సుస్థిర ప్రయోజనాలు పొందుతారన్న భావనలున్నాయి. కంప్యూటింగ్‌కు కూలింగ్ అవసరాల నిమిత్తం, నీటి లభ్యతా కీలకమే. తమిళనాడు, కర్ణాటక వంటి రాష్ట్రాలు డేటా సెంటర్ల ఏర్పాటులో నీటి లభ్యత కారణంగా వెనకబడొచ్చు.

# ఇన్‌స్టా మార్ట్ సీఈఓ రాజీనామా..

ప్రముఖ ఫుడ్ డెలివరీ సంస్థ స్విగ్గీకి చెందిన క్విక్‌కామర్స్ విభాగం ఇన్‌స్టా మార్ట్ షేర్లు మంగళవారం అమాంతం పెరిగాయి. కంపెనీ ప్రస్తుత సీఈఓ అమితేశ్ కుమార్ ఝా రాజీనామానే ఇందుకు కారణం. తక్షణమే ఇది అమల్లోకి రానుంది. ఆగస్టు 3 నుంచి తదుపరి సీఈఓగా నందిత సిన్హా కొనసాగనున్నట్లు ప్రకటించింది. ఈ విషయాన్ని కంపెనీ తన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో వెల్లడించింది. సీఈఓ రాజీనామాతో స్విగ్గీ షేరు 0.03శాతం ఫ్లాట్‌గా రూ.257.90 వద్ద ప్రారంభమవ్వగా.. ఇంట్రాడేలో రూ.273 వద్ద గరిష్ఠాన్ని తాకింది. ట్రేడింగ్‌లో 5శాతం మేర షేర్లు లాభపడ్డాయి. 2.05 గంటల సమయంలో బీఎస్ఈలో షేరు ధర రూ.268.27 వద్ద కొనసాగుతోంది. "ఇన్ స్టామార్ట్ వృద్ధికి అమితేశ్ విలువైన నాయకత్వం అందించారు. జులై 28న ఆయన కంపెనీ సీనియర్ మేనేజ్‌మెంట్




సభ్యత్వానికి రాజీనామా చేశారు. తక్షణమే ఇది అమల్లోకి వస్తుంది. కంపెనీ బలోపేతానికి కృషి చేస్తాం. కాంట్రిబ్యూషన్ మార్జిన్ క్రమంగా మెరుగుపరుస్తాం" అని కంపెనీ ప్రకటించింది. కాగా, తదుపరి సీఈఓ నందిత సిన్హా గతంలో ఇ-కామర్స్ సంస్థలైన ఫ్లిప్‌కార్ట్, ఎఫ్‌ఎంసీజీ వంటి సంస్థలకు తన నాయకత్వాన్ని అందించారు.




## ఈషా స్వర్ణ గురి



ఐఎస్ఎస్ఎఫ్ షూటింగ్ ప్రపంచకప్‌లో హైదరాబాద్ అమ్మాయి ఈషా సింగ్ అదరగొట్టింది. సోమవారం 25మీ పిస్టల్‌లో స్వర్ణం చేజిక్కించుకుంది. ఇదే ఈవెంట్లో మను బాకర్ కాంస్య పతకం గెలుచుకుంది. 21 ఏళ్ల ఈషా.. 40 హిట్స్‌తో ఫైనల్లో విజేతగా నిలిచింది. 28 హిట్స్‌తో పాక్ హ్యోన్ గ్యోంగ్ (ఉత్తర కొరియా)తో సమంగా నిలిచిన మను.. షూటాఫ్‌లో నెగ్గి మూడో స్థానం సాధించింది. అంతకుముందు క్వాలిఫికేషన్లో 586తో స్కోరుతో మను అగ్రస్థానంలో నిలిచింది. ఈషా (585) రెండో స్థానం సాధించింది. వీళ్లిద్దరు ఎనిమిది మంది షూటర్ల ఫైనల్‌కు అర్హత సాధించారు. రాహి సర్నోబత్ (582), సిమ్రన్‌జీత్ కౌర్ (576) అర్హత రౌండ్ దాటలేకపోయారు. ఈ సీజన్‌లో మ్యూనిచ్‌లో జరిగిన ప్రపంచ కప్‌లో స్వర్ణం గెలిచిన నేపథ్యంలో ఈ సారి తాను చాలాఒత్తిడి ఎదుర్కొన్నానని ఈషా సింగ్ వ్యాఖ్యానించింది. "ఈ మ్యాచ్ లో ఎంతో ఒత్తిడికి గురయ్యా. గత టోర్నీలో పతకం గెలవడమే అందుకు కారణం. ఒత్తిడిని అధిగమించినందుకు సంతోషంగా ఉంది" అని ఆమె చెప్పింది.

# కుమారుడి ఆట కోసం.. క్యాన్సర్ ఉన్న విషయాన్ని దాచిన తండ్రి

దేశవాళీ క్రికెట్‌లో ఏళ్ల తరబడి నిలకడగా రాణిస్తున్న సరాంశ్ జైన్‌కు తన కెరీర్‌లోనే అద్భుతమైన అవకాశం లభించింది. ఈ తరంలో చాలామంది క్రికెటర్లు ఐపీఎల్‌లో సత్తాచాటి భారత జట్టుకు ఎంపిక అవుతున్నారు. మధ్యప్రదేశ్‌కు చెందిన ఈ 33 ఏళ్ల ఆఫ్ స్పిన్నర్ మాత్రం రెడ్‌బాల్ క్రికెట్‌లో అదరగొట్టి 11 ఏళ్ల నిరీక్షణ తర్వాత టీమ్ఇండియాలోకి ఎంట్రీ ఇస్తున్నాడు. లోయర్ ఆర్డర్‌లో బ్యాటింగ్‌కు దిగి విలువైన పరుగులు రాబట్టగలిగే సత్తా ఉన్న ఈ ఆల్‌రౌండర్ ఆగస్టులో శ్రీలంకతో (SL vs IND) జరగనున్న రెండు మ్యాచ్‌ల సిరీస్‌కు ఎంపికయ్యాడు. గాయపడిన వాషింగ్టన్ సుందర్ స్థానంలో అతడికి చోటు దక్కింది. ఇటీవల ఇండియా 'ఏ' (IND A) శ్రీలంక పర్యటనకు వెళ్లిన జట్టులో సరాంశ్ ఉన్నాడు. లంకతో జరిగిన రెండు అనధికార టెస్టుల్లో తొలి మ్యాచ్‌లో పెద్దగా ప్రభావం చూపలేకపోయాడు. రెండో టెస్టులో మాత్రం ఆల్‌రౌండ్ ప్రదర్శన కనబర్చాడు. రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి ఆరు వికెట్లు పడగొట్టిన సరాంశ్.. బ్యాటింగ్‌లో ఫస్ట్ ఇన్నింగ్స్‌లో 70 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. మధ్యప్రదేశ్ సీనియర్ జట్టులో స్థానం సంపాదించినప్పటి నుంచి ఎడమచేతి వాటం బ్యాటర్ అయిన సరాంశ్ బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్‌లో రాణించి మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు. క్రమశిక్షణతో కూడిన బౌలింగ్‌తో బ్యాటర్లను కట్టడి చేస్తూ.. కీలక సమయాల్లో వికెట్లు తీస్తుంటాడు. జట్టు కష్టాల్లో ఉన్నప్పుడు బ్యాట్‌తో ఆదుకుంటాడు. రంజీ ట్రోఫీలో నిలకడైన ప్రదర్శన చేశాడు. ఇండియా ఎ, సెంట్రల్ జోన్ (దులీప్ ట్రోఫీ), రెస్ట్ ఆఫ్ ఇండియా (ఇరానీ ట్రోఫీ) తరఫున రాణించాడు. దీంతో సెలక్టర్ల దృష్టిలో పడి ఇప్పుడు జాతీయ జట్టుకు ఎంపికయ్యాడు. తన కెరీర్‌కు కుటుంబం ఏ విధంగా అండగా నిలిచిందో తెలిపే ఒక సంఘటనను జైన్ ఓ ఇంటర్వ్యూలో గుర్తుచేసుకున్నాడు. 2014లో మధ్యప్రదేశ్ క్లబ్ తరఫున ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్నప్పుడు తన తండ్రికి క్యాన్సర్ ఉన్నట్లు నిర్ధారణ అయ్యిందన్నాడు. తాను ఆటపైనే పూర్తిగా దృష్టి సారించడానికి తండ్రికి జరిగిన క్యాన్సర్ శస్త్రచికిత్స గురించి అప్పుడు కుటుంబ సభ్యులు తనకు తెలియజేయలేదన్నాడు. స్వదేశానికి వచ్చిన తర్వాతే దాని గురించి తెలిసిందన్నాడు.




# అభిషేక్ శర్మ విషయంలో కఠిన నిర్ణయం అవసరం: క్రిస్ శ్రీకాంత్




ఇటీవల జింబాబ్వేతో ముగిసిన మూడు టీ20ల సిరీస్‌లో భారత ఓపెనర్ అభిషేక్ శర్మ ఆశించిన స్థాయిలో రాణించలేకపోయాడు. మూడు ఇన్నింగ్స్‌ల్లో కలిపి కేవలం 11 పరుగులే చేశాడు. ఈ మూడు మ్యాచ్‌ల్లో బ్లెస్సింగ్ ముజరబాని బౌలింగ్‌లోనే అభిషేక్ వెనుదిరిగాడు. అంతకు ముందు ఐర్లాండ్, ఇంగ్లాండ్‌లతో జరిగిన సిరీస్‌ల్లో అభిషేక్ పెద్దగా ప్రభావం చూపలేకపోయాడు. అతను గత 10 ఇన్నింగ్స్‌ల్లో 191 పరుగులు మాత్రమే చేశాడు. ఈ నేపథ్యంలో అభిషేక్ శర్మ ఫామ్‌పై మాజీ చీఫ్ సెలక్టర్ కృష్ణమాచారి స్పందించాడు. అభిషేక్ విషయంలో కఠిన నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉందన్నాడు. సంజు శాంసన్ తిరిగి టీ20 జట్టులోకి వస్తాడని క్రిస్ శ్రీకాంత్ అభిప్రాయపడ్డాడు. "టీ20 ప్రపంచ కప్ నుంచే ప్రత్యర్థులు అభిషేక్ శర్మ ఆట తీరును పసిగట్టేశారు. అతడిని ఎలా కట్టడి చేయాలో తెలుసుకున్నారు. ఇప్పుడు అభిషేక్ విషయంలో సెలక్టర్లు కఠినమైన నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని నాకనిపిస్తోంది. సంజు శాంసన్ (Sanju Samson)కు కచ్చితంగా మళ్లీ అవకాశం లభిస్తుందని భావిస్తున్నాను" అని క్రిస్ శ్రీకాంత్ పేర్కొన్నాడు. జింబాబ్వేతో సిరీస్‌లో పునరాగమనం చేసిన పేసర్ మయాంక్ యాదవ్‌పై కృష్ణమాచారి శ్రీకాంత్ ప్రశంసలు కురిపించాడు. 'మయాంక్ మూడు మ్యాచ్‌లు ఆడటం చాలా బాగుంది. అతని గురించి నాకు చాలా సంతోషంగా ఉంది. ఈ కుర్రాడు నిలకడగా రాణిస్తాడనే నమ్మకం ఉంది. అతనికి భారత క్రికెట్‌లో చక్కటి భవిష్యత్తు ఉంది. అశోక్ శర్మ కూడా రాణిస్తున్నాడు. ప్రతిభావంతులైన యువ ఆటగాళ్లకు టీమ్ మేనేజ్‌మెంట్ అండగా నిలవాలి" అని మాజీ చీఫ్ సెలక్టర్ వివరించారు.

# మనోళ్లు దొరికిపోతున్నారు..

స్వదేశంలో అదరగొట్టే భారత బ్యాటర్లు పెద్ద మైదానాలు ఉండే దేశాల్లో తడబడుతున్నారు. ఇటీవల ఐర్లాండ్, ఇంగ్లాండ్ పర్యటనల్లో ఇది స్పష్టంగా కనిపించింది. చిన్న బౌండరీలకు అలవాటు పడిన మన బ్యాటర్లు.. పెద్ద బౌండరీలు ఉన్న గ్రౌండ్లలో భారీ షాట్లు ఆడి బౌండరీ లైన్ వద్ద ఫీల్డర్లకు చిక్కి పెవిలియన్ చేరుతున్నారు. ఈ నేపథ్యంలో సునీల్ గవాస్కర్ బీసీసీఐకి కీలక సూచన చేశారు. కొత్త సీజన్‌లో మన మైదానాల్లో బౌండరీ లైన్లను వెనక్కి జరపాలన్నారు. "ఐపీఎల్‌లో ఫ్లాట్ పిచ్‌లు, చిన్న బౌండరీలపై అదరగొట్టిన భారత బ్యాటర్లు ఆ తర్వాత ఇంగ్లాండ్‌లో అలవాటు లేని పరిస్థితుల్లో ఇబ్బందులు పడ్డారు. భారత్‌లో ఫ్లాట్ పిచ్‌లు ఉన్న మాట నిజమే. చాలా చిన్నగా ఉండే బౌండరీలే బ్యాటర్లకు అనుకూలిస్తాయి. దాంతో వారు సరిగ్గా షాట్ కొట్టని బంతులు కూడా బౌండరీ దాటుతున్నాయి. అదే పెద్ద, పొడవైన బౌండరీలు ఉన్న దేశాల్లో అవే షాట్లు ఆడి బౌండరీ లైన్ లోపలే ఫీల్డర్లకు చిక్కుతున్నారు. వచ్చే ఏడాది జరగబోయే ప్రపంచ కప్‌నకు ముందు మన బ్యాటర్లు అలవాటు పడేందుకు కొత్త సీజన్ ప్రారంభమయ్యే సమయానికి బౌండరీల దూరం పెంచడం అత్యంత ఆవశ్యకం. దాదాపు ప్రతి మైదానంలోనూ ఎల్ఈడీ అడ్వర్టైజింగ్ బోర్డుల వెనుక ప్రజలు నడవడానికి తగినంత ఖాళీ స్థలం ఉంటుంది.


గావస్కర్

# ఈ రజతానికో 'సెల్యూట్'..

ఓ వైపు పోలీస్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తూనే, అంతర్జాతీయ వేదికపై పతకంతో మెరిసింది 23 ఏళ్ల జ్ఞానేశ్వరి యాదవ్. గత కొన్నేళ్లుగా వెయిట్‌లిఫ్టింగ్‌లో రాణిస్తున్న ఆమె.. కామన్వెల్త్ క్రీడల్లో అరంగేట్రంలోనే మెప్పించింది. ఛత్తీస్‌గఢ్‌లోని రాజ్‌నాందగావ్ జిల్లా నుంచి వచ్చిన జ్ఞానేశ్వరి అసిస్టెంట్ సబ్‌ఇన్‌స్పెక్టర్. సోమవారం మహిళల 53 కేజీల విభాగంలో రజతం సాధించింది.



జ్ఞానేశ్వరి గత మూడేళ్లుగా వెయిట్ లిఫ్టింగ్‌లో స్థిరమైన ప్రదర్శనతో ఆకట్టుకుంటోంది. ర్యాంకును మెరుగుపరచుకుంటూ చూడదగ్గ యువ లిఫ్టర్‌గా పేరు పొందింది. కెరీర్ ఆరంభంలో 49 కేజీల విభాగంలో తలపడిన జ్ఞానేశ్వరి నెమ్మదిగా అధిక బరువులోకి వచ్చింది. 2022లో జూనియర్ వెయిట్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్స్ (గ్రీస్)లో మూడు రజత పతకాలతో అదరగొట్టింది. తర్వాత దేశవాళీల్లో, పలు అంతర్జాతీయ టోర్నీల్లో విజయాలతో అందరి దృష్టిలో పడింది. ఒక వైపు ఏఎస్ఐగా బాధ్యతల్ని నిర్వర్తిస్తూనే.. మరోవైపు క్రీడల్లో రాణించింది. ఈ క్రమంలో భారత టాప్ వెయిట్‌లిఫ్టర్లలో ఒకరిగా ఎదిగింది. 2024లో ప్రపంచ వెయిట్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్స్‌లో అయిదో స్థానంలో నిలిచింది. 2025లో జ్ఞానేశ్వరి ఛత్తీస్‌గఢ్‌లో ఉత్తమ క్రీడాకారులకిచ్చే 'గుండాధూర్ సమ్మాన్' పురస్కారాన్ని అందుకుంది. ముఖ్యంగా ఈ ఏడాది ఆసియా వెయిట్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్స్‌లో సత్తాచాటి, కామన్వెల్త్‌లో పతకానికి ఫేవరెట్‌గా మారింది. ఆ పోటీల్లో మొత్తం 194 కేజీలతో కాంస్యం గెలుచుకుంది. అప్పుడు జ్ఞానేశ్వరి స్నాచ్‌లో 88 కేజీలు మోసి జాతీయ రికార్డు నెలకొల్పింది. ఈ ప్రదర్శనతో ఆమెపై అంచనాలు మరింత పెరిగాయి.

# వుదయం సినిమా

MOVIE TIME!

## ‘స్పైడర్ మ్యాన్: బ్రాండ్ న్యూ డే’

**వుదయం సినిమా** అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న హాలీవుడ్ సూపర్ హీరో చిత్రం ‘స్పైడర్ మ్యాన్: బ్రాండ్ న్యూ డే’. తాజాగా సెన్సార్ పనులు పూర్తి చేసుకున్న ఈ సినిమా జులై 30న భారత్‌లో విడుదల కానుంది. టామ్ హాలెండ్ మరోసారి పీటర్ పార్కర్‌గా నటిస్తున్న ఈ చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే దేశవ్యాప్తంగా అడ్వాన్స్ బుకింగ్స్ ప్రారంభం కాగా.. టికెట్ ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. ముఖ్యంగా మెట్రో నగరాల్లో లగ్జరీ సీట్ల రేట్లకు డిమాండ్ బాగా పెరిగింది. దేశ వ్యాప్తంగా పలు నగరాలు, థియేటర్ల ఫార్మాట్లను బట్టి ఈ సినిమా టికెట్ ధరల్లో వ్యత్యాసం కనిపిస్తోంది. సింగిల్ స్క్రీన్‌లలో సాధారణ టికెట్ ధర రూ.200 నుంచి అందుబాటులో ఉన్నప్పటికీ.. లగ్జరీ, ప్రీమియం ఫార్మాట్లలో రేట్లు ఆకాశాన్ని తాకుతున్నాయి. ఢిల్లీలో టికెట్ ధరలు రూ.250 నుంచి మొదలై.. ప్రీమియం రిక్లైనర్ సీట్లకు దాదాపు రూ.2,400 వరకు పలుకుతున్నాయి.



## "చెన్నై లవ్ స్టోరీ" సక్సెస్ మీట్





**వుదయం సినిమా:** హీరో కిరణ్ అబ్బవరం, శ్రీ గౌరి ప్రియ జంటగా నటించిన "చెన్నై లవ్ స్టోరీ" సినిమా అన్ని వర్గాల ప్రేక్షకుల ఆదరణతో ఘన విజయాన్ని సొంతం చేసుకుంది. ఒక బ్యూటిఫుల్ లవ్ స్టోరీతో ఆకట్టుకున్నారంటూ సినిమా చూసిన ప్రతి ఒక్కరూ స్పందిస్తున్నారు. ప్రశంసలతో పాటు మంచి వసూళ్లు దక్కించుకుంటోంది "చెన్నై లవ్ స్టోరీ" సినిమా. ఈ సినిమా 3 రోజుల్లోనే 40.1 కోట్ల రూపాయలు ఆర్జించింది. ఈ నేపథ్యంలో ఈ సినిమా గ్రాండ్ సక్సెస్ మీట్ ను యువసామ్రాట్ నాగచైతన్య ముఖ్య అతిథిగా హైదరాబాద్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దర్శకుడు, నటుడు దేవిప్రసాద్ మాట్లాడుతూ – చెన్నై లవ్ స్టోరీ లాంటి మంచి ప్రేమ కథా చిత్రానికి ఘన విజయాన్ని అందించిన ప్రేక్షకులకు థ్యాంక్స్. ఈ సినిమాలో క్యారెక్టర్స్ ఇవ్వడం ద్వారా మమ్మల్నీ భాగం చేశారు నిర్మాతలు ఎస్ కేఎన్, సాయి రాజేష్. రచయితగా, దర్శకుడిగా సాయి రాజేష్ ను అభిమానిస్తాను. ఆయన హృదయ కాలేయం సినిమా నుంచే తన ప్రతిభ నిరూపించుకున్నారు. అన్నారు.దర్శకుడు, నటుడు కరుణ కుమార్ మాట్లా డుతూ – సినిమాల ట్రెండ్ మారుతున్నా, ఎప్పటికీ మారనివి ప్రేమ కథలు మాత్రమే. అలా వచ్చిన మంచి ప్రేమ కథా చిత్రం చెన్నై లవ్ స్టోరీ.

## ఆగస్టు 21న 'ఇరుముడి'

**వుదయం సినిమా:** మాస్ మహారాజా రవితేజ ఎమోషనల్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'ఇరుముడి'పై భారీ అంచనాలు ఉన్నాయి. శివ నిర్వాణ దర్శకత్వంలో, మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాణంలో రూపొందుతున్న ఈ చిత్రం 'ఫస్ట్ గ్లింప్స్', చార్ట్‌బస్టర్ అయ్యప్ప భక్తి పాట 'ఇరుముడి కట్టు'తో ప్రేక్షకులను అలరించిన ఈ చిత్రం, ఇప్పుడు మరో కీలక అప్ డేట్‌తో ముందుకొచ్చింది. విడు దల తేదీకి సంబంధించి నెల కొన్న ఊహాగానాలకు తెరదించు తూ, అనుకున్న సమయానికే అంటే ఆగస్టు 21న 'ఇరుముడి' ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుందని చిత్ర బృం దం అధికారికంగా అనౌన్స్ చేసింది. విడుదల షెడ్యూల్‌లో ఎలాంటి మార్పు లేదని స్పష్టం చేస్తూ, '25 Days To Go' పోస్టర్‌ను విడుదల చేశారు. కొత్తగా విడుదలైన ఈ పోస్టర్ సినిమాలోని ఎమోషన్ ని అద్భు తంగా ఆవిష్కరించింది. ఇందు లో రవితేజ, చిన్నారి నక్షత్ర మధ్య తండ్రీ–కూతుళ్ల అను బంధం ఎంతో ఆప్యాయంగా కనిపిస్తోంది. రవితేజ పేకాటలో నిమగ్నమై ఉండగా, ఆ చిన్నారి వెనుక నుండి ఆప్యాయంగా అతన్ని కౌగిలించుకోవడం, ఈ కథలోని ఎమోషన్ని ప్రజెంట్ చేస్తోంది. కుటుంబ కథా చిత్రాలను తెరకెక్కించడంలో దర్శకుడు శివ నిర్వాణకు మంచి పేరుంది; ఆయన 'ఇరుముడి'ని ఒక కంప్లీట్ ఎంటర్‌టైనర్‌గా తీర్చిదిద్దుతున్నారు. ఇప్పటివరకు విడుదలైన ప్రచార చిత్రాలు, వీడియోలు ఆయన ఈ సినిమాను ఎంత శ్రద్ధతో రూపొందిస్తున్నారో తెలియజేస్తున్నాయి.ప్రియా భవాని శంకర్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రాన్ని నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్నారు.



## ‘మకుటం’ నుంచి ‘కలతేలా’ అంటూ సాగే సాంగ్ రిలీజ్



**వుదయం సినిమా:** సూపర్ గుడ్ ఫిల్మ్స్ బ్యానర్ మీద 99వ ప్రాజెక్ట్‌గా విశాల్ హీరోగా, దర్శకుడిగా చేస్తున్న చిత్రం ‘మకుటం’. స్వర్గీయ ఆర్ బీ చౌదరి నిర్మిస్తున్న ఈ చిత్రంలో అంజలి, దుషార విజయన్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ మూవీ నుంచి వచ్చిన టీజర్, ఫస్ట్ సింగిల్ ‘ది రైజ్ అఫ్ లింగా’, ఫోక్ సాంగ్ ‘నచ్చాకే వచ్చేరా’ అనే పాటలు అన్నీ కూడా అందరిలోనూ అంచనాలు పెంచేశాయి. ఇక తాజాగా మరో పాటను చిత్రయూనిట్ రిలీజ్ చేసింది.‘కలతేలా’ అంటూ సాగే సాంగ్‌ను తాజాగా రిలీజ్ చేశారు. ఇదొక ఫ్యామిలీ, మోటివేషనల్ సాంగ్‌లా కనిపిస్తోంది. ఇందులో విశాల్, దుషారలతో పాటుగా పిల్లలు కూడా కనిపిస్తున్నారు. ఈ పాటను రాజశ్రీ సుధాకర్ రచించగా.. కృష్ణ తేజస్వీ ఆలపించారు. ఇక జీవీ ప్రకాష్ అందించిన బాణీ ఎంతో క్యాచీగా ఉంది. ఇక ఈ పాట యూట్యూబ్‌లో ఇట్టే ట్రెండ్ అయ్యేలా కనిపిస్తోంది.ఈ సినిమాకి రిచర్డ్ ఎం. నాథన్, అభినందన్ రామానుజం కెమెరామెన్లుగా, N.B. శ్రీకాంత్ ఎడిటర్‌గా పని చేస్తున్నారు. త్వరలోనే ఈ మూవీకి సంబంధించిన రిలీజ్ డేట్‌ను ప్రకటించనున్నారు.

## ‘అబ్జెక్షన్ మై లార్డ్’ ప్రివ్యూ ఈవెంట్

**వుదయం సినిమా:** వినూత్నమైన కంటెంట్‌తో అన్ని వర్గాల ప్రేక్షకు లను మెప్పిస్తూ అందరి హృదయాల్లో తనదైన స్థానాన్ని దక్కించుకున్న మోస్ట్ పాపులర్ ఒటీటీ ఫ్లాట్‌ఫామ్ జీ5 నుంచి మరో ఒరిజినల్ ప్రేక్షకుల ముందుకు రానుంది. అదే ‘అబ్జెక్షన్ మై లార్డ్’. శ్రీకాంత్, అనన్య శర్మ, ముఖేష్ రుషి, స్నేహాల్, సమీర్ ప్రధాన పాత్రధారులుగా నటించారు. ‘నోటరీ పరశురాం’ ట్యాగ్ లైన్. సంతోష్ అయ్యప్పన్ దర్శకత్వంలో డ్రీమ్ హౌస్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రాజ్‌కుమార్ ఆకెళ్ల ఈ సిరీస్‌ను రూపొందించారు. 7 ఎపిసోడ్స్‌తో ఎమోషనల్ కోర్ట్ రూమ్ డ్రామాగా రూపొందిన ఈ ఒరిజినల్ జూలై 31 నుంచి జీ5లో స్ట్రీమింగ్ కానుంది. తాజాగా ఈ రోజు ఈ సిరీస్ ప్రివ్యూ ఈవెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నటీనటులతో పాటు హీరో శ్రీకాంత్, పలువురు ముఖ్య అతిథులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎడిటర్ కిషోర్ మాట్లాడుతూ.. నా చిన్నప్పుడు శ్రీకాంత్ సినిమాలు చాలా చూసేవాడిని. ఈ సినిమా చాలా సీరియస్ డ్రామా. ఈ నెలలోనే స్టార్ట్ చేసి ఈ నెలలోనే రిలీజ్ చేయడం ఛాలెంజింగ్ టాస్క్. టీం అంతా చాలా కష్టపడి పని చేశారు అన్నారు. జెమినీ సురేష్ మాట్లాడుతూ, అందరికీ నమస్కారం. సీరియస్ డ్రామాను మీ ముందుకు తీసు కురావడం పెద్ద టాస్క్. ‘అబ్జెక్షన్ మై లార్డ్’ టీం ఇందులో సక్సెస్ అవుతారని నమ్ముతున్నా. నాకు మంచి పాత్ర ఇచ్చిన జీతెలుగుటీం అందరికీథాం క్స్. ఈ సిని మాను ఇంత అద్భుతంగా తీర్చిదిద్దిన డైరెక్టర్కి ఆల్ ది బెస్ట్. ఈ సిని మాలో నాకు ఇచ్చిన పాత్ర, షూటింగ్ చేస్తున్న పుడు చాలా నేర్చుకున్నా.





## ‘ఆకాశంలో ఒక తార’ నుంచి ఫస్ట్ సింగిల్



**వుదయం సినిమా:** వెర్సటైల్ స్టార్ దుల్కర్ సల్మాన్ పుట్టినరోజు సందర్భంగా ‘ఆకాశంలో ఒక తార’ చిత్ర యూనిట్ ఈరోజు (మంగళవారం) ఫస్ట్ సింగిల్ ‘చిట్టి చిట్టి చీమ’ను విడుదల చేసింది.జివి ప్రకాష్ కుమార్ స్వరపరిచిన ‘చిట్టి చిట్టి చీమ’ పాట హృదయాన్ని హత్తుకునే మెలోడి.. భావోద్వేగంగా సినిమాలో ఏం చెప్పాలనుకున్నారో ఆ పాయింట్‌ను అద్భుతంగా ప్రతిబింబిస్తుంది. హీరోయిన్ కోణంలో పాడిన ఈ పాట, నక్షత్రాలను చేరాలనే ఒక మహిళ కలను, ఆమె పక్కన నిలబడి నిశ్శబ్దంగా అండగా నిలిచే వ్యక్తి ప్రేమను చూపిస్తుంది.

## సెప్టెంబర్ 11న ‘మహేంద్రగిరి వారాహి’

**వుదయం సినిమా:** సుమంత్, ఐశ్వర్య రాజేష్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న స్పిరిచువల్ మిస్టరీ థ్రిల్లర్ ‘మహేంద్రగిరి వారాహి’. సంతోష్ జాగర్లపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ‘మహేంద్రగిరి వారాహి’ మహేంద్రగిరి నేపథ్యంగా, వారాహి మాత డివైన్ పవర్ చుట్టూ సాగే ఈ కథలో ఎన్నో అంతుచిక్కని సంఘటనలు, రహస్యాలు, మిస్టరీతో ప్రేక్షకులకు సరికొత్త సినీ అనుభూతిని అందించబోతుంది. ఈ చిత్రంలో మీనాక్షి గోస్వామి, మాళవిక నాయర్, బ్రహ్మానందం, వెన్నెల కిషోర్, రాజీవ్ కనకాల, అలీ కీలక పాత్రలు పోషిస్తున్నారు. రాజశ్యామల ఎంటర్‌టైన్‌మెంట్స్, బ్రిడ్జ్ ఫిలిమ్స్ బ్యానర్లపై కలిపు మధు, లక్ష్మణ్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్ కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఈ చిత్రం సెప్టెంబర్ 11న ఈ చిత్రం ప్రేక్షకులు ముందుకురానున్నట్లు మేకర్స్ అనౌన్స్ చేశారు. ఈ సందర్భంగా రిలీజ్ డేట్ ప్రెస్ మీట్ నిర్వహించారు.రిలీజ్ డేట్ ప్రెస్ మీట్‌లో హీరో సుమంత్ మాట్లాడుతూ: అందరికీ నమస్కారం. 'మహేంద్రగిరి వారాహి' జర్నీ రెండున్నరేళ్ల క్రితం ప్రారంభమైంది. సంతోష్ నాకు ఈ సబ్జెక్ట్ చెప్పిన తర్వాత ఒక మంచి నిర్మాత కోసం ఎదురు చూశాం. మధు గారు, లక్ష్మణ్ గారు చాలా ప్యాషనేట్ ప్రొడ్యూసర్స్. ఈ సినిమాకు ఏం కావాలో అన్నీ సమకూర్చి, చాలా గొప్పగా తీర్చిదిద్దారు. టీజర్‌ను ఇంత పెద్ద హిట్ చేసిన ప్రేక్షకులందరికీ కృతజ్ఞతలు.




## ‘ఆదర్శ కుటుంబం హౌస్ నెం. 47’లో శ్రీనిధి శెట్టి



**వుదయం సినిమా:** విక్టరీ వెంకటేష్ పోషించిన చిట్టిబాబు పాత్ర పరిచయానికి ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించిన నేపథ్యంలో, ‘ఆదర్శ కుటుంబం హౌస్ నెం. 47’ (AK47) చిత్ర బృందం ఈ ఆదర్శ కుటుంబంలోని మరో కీలక సభ్యురాలిని పరిచయం చేసింది. ఈ చిత్రంలో శ్రీనిధి శెట్టి ‘స్వర్ణ’ పాత్రలో నటిస్తున్నారు. చిట్టిబాబుకు భార్యగా, చిరునవ్వే చిరునామాగా ఉండే ఓ ఆప్యాయమైన మధ్యతరగతి ఇల్లాలిగా ఆమె పాత్ర ప్రేక్షకుల హృద యాలను హత్తుకోనుంది. చిట్టిబాబు–స్వర్ణల మధ్య ఉండే అనుబంధం, చిలిపి సంభాషణలు, అనురాగం, కుటుంబ విలువలు సినిమాకు మరింత ఆత్మను, ఆహ్లాదాన్ని అందించనున్నాయి. విడుదలైన ఈ క్యారెక్టర్ గ్లింప్స్‌లో నివేదా పేతురాజ్, ప్రముఖ హాస్యనటుడు సత్య కొన్ని క్షణాలు కనిపిస్తూ చిత్రంలోని వినోదాత్మక వాతావరణాన్ని మరింత ఆసక్తికరంగా మలిచారు. ఇప్పటికే విడుదలైన పాత్ర పరిచయాలు ప్రేక్షకుల్లో విశేష ఆసక్తిని రేకెత్తించగా, త్వరలోనే యువినా పార్థవిను ‘సంపూర్ణ’గా, రాజా ప్రజ్వల్ను ‘సర్వ’గా చిత్ర బృందం పరిచయం చేయనుంది. ప్రఖ్యాత హారిక & హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్. రాధాకృష్ణ నిర్మిస్తున్న ఈ చిత్రానికి రచన, దర్శకత్వం త్రివిక్రమ్ శ్రీనివాస్ వహిస్తున్నారు. థమన్ ఎస్. సంగీతం అందిస్తుండగా, రవి.కె. చంద్రన్ ఛాయా గ్రహణం, శ్రీకర్ ప్రసాద్ ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

## 'ఇమ్మోర్టల్' నుంచి 'షీ ఈజ్ మై' సాంగ్

**వుదయం సినిమా:** మల్టీ ట్యాలంటెడ్ జి.వి. ప్రకాష్ కుమార్, కయదు లోహర్ జంటగా నటిస్తున్న డార్క్ పాంటసీ సూపర్ నేచురల్ థ్రిల్లర్ 'ఇమ్మోర్టల్' మరియప్పన్ చిన్న దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని అరుణ్‌కుమార్ ధనశేఖరన్ నిర్మిస్తున్నారు ఇప్పటికే రిలీజ్ చేసిన సాంగ్ కి అదిరిపోయే రెస్పాన్స్ వచ్చింది.తాజాగా 'ఇమ్మోర్టల్' నుంచి రొమాంటిక్ మెలోడీ 'షీ ఈజ్ మై' లిరికల్ వీడియోను మేకర్స్ విడుదల చేశారు.ఈ పాటకు సామ్ సీఎస్ అందించిన సంగీతం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.అరవింద్ శ్రీనివాస తన వోకల్స్ పాటకు ప్రాణం పోయగా, రాజశ్రీ సుధాకర్ రాసిన సాహిత్యం ప్రేమలోని భావోద్వేగాలను అందంగా పలికించింది.ఈ పాటలో జి.వి. ప్రకాష్ కుమార్, కయదు లోహర్‌ల మధ్య కెమిస్ట్రీ చాలా ఆసక్తికరంగా వుంది. మనసును హత్తుకునే ట్యూన్, లిరిక్స్‌తో 'షీ ఈజ్ మై' సంగీత ప్రియులను ఆకట్టుకునే మెలోడీగా నిలిచింది.నటీనటులు : జివి ప్రకాష్ కుమార్, కయదు లోహర్, TM కార్తీక్, కుమార్ నటరాజన్, లొల్లు సభ మారన్, ఆదిత్య కతిర్, అర్షు మహర్జన్, పెమ త్సంచో, సునీతా శ్రేష్ఠ.



Printed, Published & Owned by Sirikonda Maria, Ashish Publications H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 1-3-95,Padmashali Street, Karimnagar-505001 Telangana. Editor : Sirikonda Augustin, RNI No. TELTEL/2013/65079, E-mail : voodayam2007@gmail.com Cell : 9247698676.